ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ అష్టమి మ.1.23 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: విశాఖ సా. 5.23 వరకు, అనంతరం అనురాధ; అమృతకాలం: ఉ. 8.05 నుండి 9.45 వరకు; వర్జ్యం: రా. 9.43 నుండి 11.27 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, తదుపరి మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక:298 • గురువారం 8 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



మళ్లీ మేమే

- 2019లో టీఆర్ఎస్ అధికారంలోకి రాకుంటే.. రాజకీయ సన్యాసం
- ఉత్తమ్ దమ్ములేని దద్దమ్మ
- సవాల్ స్వీకరించుకున్నా..కట్టుబడి ఉంటా
- ప్రతిపక్షాలకు ఇష్యూలు లేకనే.. నీతిమాలిన విమర్శలు
- రాహుల్ కంటే పప్పు ఎవరూ లేరు
- మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నా వయసు 42. మరో ఇరవై, పాతికేళ్ళు రాజకీయం చేయ గలను. నా పాతికేళ్ళ రాజకీయ జీవితాన్ని పణంగా పెట్టి సవాల్ చేస్తే.. ఉత్తమ్ క ుమా ర్‌రెడ్డి దద్దమ్మలా కుటుంబాన్ని సీన్‌లోకి లాగుతుండు. ఆయన మూడున్నర, నాలుగేండ్లు మంత్రిగా చేసిండు.. నేను అంతే టైం మంత్రిగా ఉన్నా. ఆయనది.. నా కంటే పెద్దస్థాయి కాదు. ఆయనకు దమ్ము, ధైర్యం ఉంటే నేరుగా సవాల్‌కు సిద్ధమా లేదా చె ప్పాలి. వచ్చే ఎన్నికల్లో టిఆర్ఎస్ అధికా రంలోకి రాకుంటే రాజకీయాల నుండి నేను తప్పుకుంటా.. ఉత్తమ్‌కుమార్ రెడ్డి సిద్ధమా అని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖా మంత్రి కల్వ కుంట్ల తారకరామారావు మరోసారి సవాల్ విసిరారు. బుధవారం సాయంత్రం బేగంపేటలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉత్తమ్ కుమార్‌రెడ్డి సవాల్ స్వీకరించినా, దద్దమ్మలా స్వీకరించకపోయినా నేను మాత్రం దీనికి కట్టుబడి ఉంటా. ప్రజలపై నాకు అత్యంత విశ్వాసముంది.. 2019లో మరోసారి మేం అధికారంలోకి వస్తున్నాం. తాడు, బొంగరం లేని మాటలు మాట్లాడుతున్న ఉత్తమ్‌కు ఏ మాత్రం నమ్మకమున్నా డొంకతిరుగుడు ప్రకటనలు మాని సవాల్ స్వీకరించాలి.ఒకవేళ అధికారంలోకి రాకుంటే రాజకీయాల నుండి పూర్తిగా తప్పుకుంటా అంటూ సంచలన ప్రకటన చేశారు. తాను జిహెచ్ ఎంసి ఎన్నికల్లోనూ ఇలా

➪ 3వ పేజీలో...

ఆ బడ్జెట్‌లో ఏం లేదు..!

- రూ.40వేల కోట్లు ప్రతిపాదనలిస్తే.. బాహుబలి కలెక్షన్లు కూడా రాలేదు..
- కేంద్ర బడ్జెట్‌పై కేటీఆర్ విసుర్లు
- ఆహాఅని పొగడ్తలే తప్ప దిల్లిగవ్వలేదు

3లో

కాంగ్రెస్ పాపాలే దేశానికి శాపాలు



తెలుగువారి ఆత్మగౌరవానికి తూట్లు పొడిచారు

అంతా మీరే చేశారు!

అందుకే ఎన్టీఆర్ పార్టీ పెట్టారు

- ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు
- రాష్ట్రాలనే కాదు దేశాన్నే కాంగ్రెస్ విభజించింది
- పటేల్ తొలి ప్రధాని అయివుంటే, కాశ్మీరంతా మనకే ఉండేది
- తెలుగు ప్రజలను రాజీవ్‌గాంధీ అవమానించారు
- ఎన్‌పీఏ పాపాలకు యూపీయేదే బాధ్యత
- గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని మేం కోరుకుంటున్నాం
- న్యూ ఇండియాను మేం కోరుతున్నాం
- వాళ్లేమో ఎమర్జెన్సీ కుంభకోణాల భారత్ కావాలంటున్నారు
- అబద్ధాలతో యువతను తప్పుదారి పట్టించొద్దు
- ఆధార్‌ను సాంకేతికంగా పట్టిష్టం చేశాం
- పార్లమెంటులో ప్రధాని మోడీ ఉద్వేగ ప్రసంగం

వివరాలు 2లో...

కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిప్పులు చెరిగారు. దేశం అభివృద్ధి చెందకపోవడానికి కాంగ్రెస్ తప్పుడు విధానాలే కారణమని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న హస్తం పార్టీ, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, ఒక కుటుంబం ప్రయోజనాల కోసం దేశ శ్రేయస్సును పణంగా పెట్టింది. ఆ కుటుంబం కోసమే పియానో వాయిస్తూ, రాగాలు ఆలపించిందని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

పద్దులు భారీ! ...నిధులేవీ?

- మోడీ కేర్‌తో సహా అన్నీ ప్రజాకర్షక పథకాలే
- తక్షణ వ్యయం చేయాల్సిన పనిలేనివే
- విధివిధానాలతో చాలా సమయం అవసరం
- ప్రజా నిరసన తప్పించుకునే చాణక్యం
- తక్షణ ఆచరణలోకి అంతంతమాత్రమే
- బెడిసి కొట్టిన సంస్కరణల వ్యూహం
- రూటు మార్చిన కేంద్ర ప్రభుత్వం



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ఇప్పటికిప్పుడు తక్షణ వ్యయ అవసరం లేని పథకాలతోనే కేంద్రం బడ్జెట్ పద్దుల్ని నింపేసింది. ఈసారి బడ్జెట్‌లో ఎన్నో ప్రజా రంజక, ఆకర్షణీయ పథకాల్ని ప్రకటించారు. ఇవేవీ తక్షణం అమల్లోకి వచ్చేవికాదు. దేశం లోని ఐదు కోట్ల కుటుంబాలకు ఆరోగ్యబీమా కల్పించే మోడికేర్ పథకం ఈ రంగంలో ఇప్పటివరకు ప్రపంచంలో ఉన్న అన్నింటికంటే అతిపెద్దది. ఏకంగా 50కోట్ల మంది భారతీయులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతారు. ఇది ఇప్పుడిప్పుడే అమల్లోకొచ్చే అవకాశాల్లేవు. సెప్టెంబర్ లేదా అక్టోబర్ తర్వాతే ఇది కార్యరూపం దాలుస్తుంది. అప్పటివరకు పథకం అమలు నిమిత్తం విధి విధానాల రూపకల్పనకు సమయం అవసరం. ఈసారి బడ్జెట్‌లో భారీ పథకాలన్నీ ఇలాంటివే. ఇందుకు కారణం ఇప్పుడు కేంద్రం నిధుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటోంది. అతిపెద్ద ఆర్థిక సంస్కరణ ద్వారా పన్నుల రాబడిని అనూహ్యంగా పెంచుకోవచ్చన్న మోడి వ్యూహం బెడిసికొట్టింది. పెద్దనోట్ల రద్దు, నగదురహిత ఆర్థిక సేవల పెంపుతో భారత ఆర్థిక రంగానికో కుదుపొస్తుందని కేంద్రం భావించింది. ప్రతి రూపాయి మారకాన్ని బ్యాంక్‌తో ముడిపెట్టడం ద్వారా క్రయవిక్రయాల్లో పారదర్శకత పెరుగుతుందని అభిలషించింది. ఇందుకు అనుగుణంగా పన్నుల వసూళ్ళలో వృద్ధి కనిపిస్తుందని భావించింది. ఈ చర్యలు చేపట్టి ఏడాది పూర్తయింది. ఇప్పుడు పరిస్థితిని పరిశీలిస్తే నగదు రహిత సేవలు విస్తరించడానికి బదులు బ్యాంకు రహిత ఆర్థికసేవలు విస్తరించాయి. ఇందుకు కారణం బ్యాంకులతోపాటు ఆదాయపన్ను వంటి కేంద్ర ప్రభుత్వ శాఖలు అనుసరిస్తున్న తీరే. దేశవ్యాప్తంగా ఏటీఎంలన్నీ 'నో క్యాష్' బోర్డులతో దర్శనమిస్తున్నాయి. తమ సొమ్ము బ్యాంకులో నిల్వ ఉన్నా తీసుకునే వెసులుబాటు లేక గతేడాదిగా భారతీయుడు అనేక అవస్థలకు గురవుతూనే ఉన్నాడు. ఇక బ్యాంక్‌ల నుంచి నేరుగా నగదు ఉపసంహరణకు సవాలక్ష ఆంక్షలు విధించారు. ప్రతి ఉపసంహరణకు నిర్దిష్ట కారణాన్ని చూపాల్సిందేనని నిబంధన పెట్టారు. రూ.49 వేలుదాటితే

➪ 3వ పేజీలో...

స్పీచ్‌లు కాదు జాబ్స్ ఇవ్వండి

- ఎన్నికల ప్రసంగంలా ఉంది
- ఏం చేస్తారో చెప్పకుండా ఎదురుదాడేమిటి: రాహుల్

2



కోరుకుంటున్నది ఒకటి మోడీ మాట్లాడిందొకటి

- ప్రధాని కొత్తగా చెప్పిందేమీ లేదు
- ఉద్యోగాల సృష్టి ప్రస్తావనే లేదు
- సోనియాగాంధీ పెదవి విరుపు



10లో

ఉత్తరాది రాజకీయాల్లో సినీ వివాదాల ట్రిక్స్



- నిన్నటిదాకా పద్మావత్ సెగలు
- తాజాగా మణికర్ణిక పొగలు

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

దక్షిణభారత రాజకీయాలపై దీర్ఘకాలంగా సినీరంగ ప్రభావముంది. ఇటీవల ఇది ఉత్తర భారత రాజకీయాల్లో కూడా ప్రవేశించింది. అయితే ఇందులో ఓ భేదముంది. దక్షిణ భారత రాజకీయాల్లోకి సినీరంగ ప్రముఖులు ప్రవేశించారు. కొందరు అధికారాన్ని చేపట్టారు. మరికొందరు ప్రజాప్రతినిధులుగా ఓ వెలుగు వెలిగారు. ఇంకొందరు రాజకీయాల్ని, ఎన్నికల్ని ప్రభావితం చేశారు. ఇప్పుడు ఉత్తర భారతదేశంలో సినిమాలే నేరుగా రాజకీయాలపై ప్రభావం చూపిస్తున్నాయి. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే రాజకీయాల్ని ప్రభావితం చేసేందుకు కొందరు నాయకులు సినిమాల్ని ఆలంబనగా చేసుకుంటున్నారు. ఇటీవల పద్మావత్ చిత్రంపై వెల్లువెత్తిన ఉద్యమాలు ఉత్తర భారతదేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. రెండుమాసాల క్రితం జరిగిన గుజరాత్ ఎన్నికల్లో అధికార పక్షానికి చావుతప్పి కన్ను లొట్టబోయేలా చేశాయి. రాజపుత్‌లతో పాటు హిందువుల్ని కూడా అధికార పార్టీకి ఈ వివాదం దూరం చేసింది. నెలతిరగక ముందే రాజస్థాన్‌లో జరిగిన రెండు పార్లమెంట్, ఒక అసెంబ్లీ ఉపఎన్నికల్లో కూడా ఈ వివాదమే అధికార పార్టీని మట్టికరిపించింది. ఇక రానున్న సాధారణ ఎన్నికల్ని ప్రభావితం చేసేందుకు ఉత్తరాది రాజకీయ నాయకులు నిర్మాణంలో ఉన్న మణికర్ణిక చిత్రాన్ని ఎంచుకున్నారు. దీనిచుట్టూ వివాదాలు అల్లడం మొదలెట్టారు. పద్మావత్‌లో రాజపుత్ స్త్రీల్ని అవమానించేలా చిత్రీకరణ జరిగిందంటూ వివాదాన్ని రాజేస్తే మణికర్ణికలో బ్రాహ్మణ స్త్రీల పట్ల అపచారం జరిగిందంటూ వివాదానికి ఆజ్యం పోస్తున్నారు. మహ్మదీయ చక్రవర్తి, క్రూరుడైన అల్లావుద్దీన్ ఖిల్జీతో రాణిపద్మావతికి స్వప్నంలో శృంగార దృశ్యాలతో కూడిన పాట చిత్రీకరించారంటూ లేని సంఘటనను ఊహించుకుని రాజపుత్రుల ప్రతినిధిగా కర్ణిసేన ఈ చిత్రాన్ని నిషేధించాలంటూ పెద్దఎత్తున ఉద్యమించింది. పద్మావత్ చిత్రీకరణ సమయంలోనే యూనిట్‌పై దాడులు చేసింది. రెండుసార్లు అవుట్‌డోర్ సెట్టింగ్‌లను ధ్వంసం చేసింది. నిర్మాత, దర్శకుడు సంజయ్‌లీలా బన్సాలీని హత్యచేసి తలతెస్తే పదికోట్లు ఇస్తామంటూ ప్రకటించింది. పద్మావతిగా నటించిన దీపిక పదుకుణె

➪ 3వ పేజీలో...



ఏపీకి ప్రత్యేక హోదా సాధనకు
ప్రత్యేక జేఏసీ

- రాజకీయాలను పక్కనబెట్టి ఉద్యమిద్దాం
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు

9



ఏపీ డిమాండ్లు న్యాయమైనవి
పోరుకు మద్దతు!

- విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందే
- టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత జితేందర్

9



నిన్న అమెరికా...నేడు సౌదీ అరేబియా
వలస జీవిపై ఉక్కుపాదం

- మారుతున్న ధనిక దేశాల వైఖరి
- స్వదేశీయులకు ఉపాధి పెంపే లక్ష్యం

11లో



10లో

ముద్దుకృష్ణమ ఇక లేరు!

- పార్టీలకతీతంగా నేతల నివాళి

కాంగ్రెస్ పాపాలే దేశానికి శాపాలు



- ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు
- పటేల్ తొలి ప్రధాని అయివుంటే, కాశ్మీరమంతా మనకే ఉండేది
- తెలుగు ప్రజలను రాజీవ్ గాంధీ అవమానించారు
- తెలుగువారి ఆత్మగౌరవం కోసమే ఎన్టీఆర్ పార్టీ స్థాపించారు
- ఎన్‌పీఏ పాపాలకు యూపీఏయేదే బాధ్యత
- గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని మేం కోరుకుంటున్నాం
- అబద్దాలతో యువతను తప్పుదారి పట్టించొద్దు
- ఆధార్‌ను సాంకేతికంగా పటిష్టం చేశాం
- పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యం నెహ్రూ పుణ్యం కాదు.మీరు మాకు ప్రజాస్వామ్య పాఠాలు చెప్పాల్సిన పనిలేదు. ఒకకుటుంబం కోసం దేశ ప్రయోజనాలను పణంగా పెట్టింది మీరు కాదా? అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాధాలు తెలిపే తీర్మానంపై పార్లమెంట్‌లో ప్రసంగించిన ఆయన కాంగ్రెస్‌ను టార్గెట్‌గా చేసుకొని పదునైన విమర్శలు చేశారు. ప్రధాని ప్రసంగానికి ప్రతిపక్షాలు పదేపదే అడ్డుతగలగా, టీడీపీ సభ్యులు మాత్రం ప్రసంగానికి అరగంట ముందే ఆందోళన విరమించారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ మూడుసార్లు హెచ్చరించడంతో తెదేపా ఎంపీలు ఆందోళన విరమించి వారి స్థానాల్లో కూర్చున్నారు. వైకాపా సభ్యులు మాత్రం నిరసనల అనంతరం సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. తొలుత లోక్‌సభలో మాట్లాడిన ఆయన ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విభజన అంశాన్ని ప్రస్తావించారు. 'అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ విభజించిన తీరు వల్లే ఇన్నేళ్లయినా సమస్యలు అలాగే ఉన్నాయి. కేవలం రాజకీయ ప్రయోజనాల కోణంలోనే విభజన చేయడం వల్ల, నేటికీ ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎన్డీయే హయాంలో మూడు రాష్ట్రాల ఏర్పాటు జరిగింది. ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఏర్పాటు సమయంలో అప్పటి వాజ్‌పేయి ప్రభుత్వం రాజనీతిజ్ఞతతో వ్యవహరించింది. రాజకీయ దృష్టితో కాకుండా ప్రజల కోసం పనిచేశాము' అంటూ కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నిప్పులు చెరిగారు.



కాంగ్రెస్ పాపాలు నేటికీ వెంటాడుతున్నాయ్

కాంగ్రెస్ చేసిన పాపాలే ఇప్పటికీ వెంటాడుతున్నాయి. రాష్ట్రాలనే కాదు దేశాన్ని కూడా విభజించింది. ఏపీ ప్రజల మనోభావాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. లోక్‌సభ తలుపులు మూసి మరీ చట్టాన్ని ఆమోదించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఇష్టానుసారం వ్యవహరించారు. ఏపీ విభజన జరిగి నాలుగేళ్లయినా ఇంకా సమస్యలున్నాయి. తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మేం మద్దతు పలికాం. వాజ్‌పేయి ప్రభుత్వం దూరదృష్టి కారణంగా మూడు రాష్ట్రాలు విభజించినా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. ఎవరి వాటాలు వారికి ఇచ్చారు. కానీ ఆంధ్రప్రదేశ్ విషయంలో అలా జరగలేదు. రాజకీయ లబ్ధి కోసం పార్లమెంటు తలుపులు మూసివేసి విభజన బిల్లు ఆమోదింపజేసుకున్నారు. నామమాత్రం ప్రతిపక్షం, ప్రసార మాధ్యమాలపై నియంత్రణతో కాంగ్రెస్ ఇష్టారాజ్యంగా వ్యవహరించింది. తమ నిర్వాకాలు బయటకు రాకుండా కాంగ్రెస్ పార్టీ ఇష్టారీతిగా వ్యవహరించింది. అప్పుడు వారు చేసిన తప్పుల వల్లనే ఈనాడు ప్రతిపక్షంలో కూర్చున్నారు.



ప్రజాస్వామ్యం అంటే మాదే..

దళితులను అవమానించే కాంగ్రెస్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం తగదు. ప్రజాస్వామ్యం అంటే మాదే. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదు. కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించలేదు. రాజీవ్ గాంధీ చేసిన అవమానాల వల్లే ఏపీలో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టారన్నారు. హైదరాబాద్‌లో ఏపీ దళిత ముఖ్యమంత్రిని రాజీవ్‌గాంధీ అవమానించారు. నీలం సంజీవరెడ్డి, అంజయ్య, పీవీ నర్సింహారావును కాంగ్రెస్ అవమానించింది. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కాపాడేందుకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. దీనికోసమే తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్టీఆర్ సినిమాలు వదిలి రాజకీయ ప్రవేశం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ చేసిన రాజకీయ అరాచకాలు అనేకం. అలాంటివారా ఆ రాష్ట్రం గురించి మాట్లాడేది? కర్ణాటక ఎన్నికలు లేకుంటే, ఆంధ్రప్రదేశ్ విభజన గురించి మల్లికార్జున ఖర్గే మాట్లాడేవారేనా? తమిళనాడు, పంజాబ్, కేరళ రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన చరిత్ర కాంగ్రెస్‌ది కాదా? రాహుల్‌కు పార్టీ పగ్గాలు అప్పగించడం వారసత్వానికి నిదర్శనం.



నేను చెప్పేది వినేందుకు ధైర్యం ఉండాలి

నేను చెప్పేది వినేందుకు ధైర్యం లేకనే కాంగ్రెస్ పార్టీ నా ప్రసంగాన్ని అడ్డుకుంటోంది. పార్టీలు శాశ్వతం కాదు. దేశమే శాశ్వతమన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలి.

కాంగ్రెస్ హయంలో రోజుకు 11 కిలోమీటర్లు మేర రోడ్డు వేస్తే, మా హయాంలో రోజుకు 22కి.మీల మేర రహదారులు వేశాం. అభివృద్ధి విషయంలో భేదభావాలు చూపడం లేదు. ఖర్గే ఎంపీగా ఉన్న బీదర్‌లో వాజ్‌పేయి ప్రభుత్వం 1020 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ వేసింది. ఖర్గే రైల్వేమంత్రిగా ఉండి ఏం చేశారో చెప్పాలి. ఇచ్చిన హామీల మేరకు ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించడం జరిగింది. యూపీఏ కంటే ఎన్డీయే ప్రభుత్వం వచ్చాకే మెజార్టీ గ్రామాల్లో ఫైబర్‌నెట్ వ్యవస్థ వెల్లూనుకుంది.

ఆధార్‌ను వాళ్లే వద్దంటున్నారు..

మోడీ వస్తే ఆధార్‌కు మంగళం పాడతారని ప్రతిపక్షం ప్రచారం చేసింది. ఆధార్ వ్యవస్థను బలోపేతం చేసేసరికి ఇప్పుడు ఆధార్‌ను కాంగ్రెస్ వద్దంటోంది. సమతుల అభివృద్ధిని ఇన్నాళ్లు వాళ్లు సాధించలేకపోయారు. అలాంటి మేము చేసి చూపించాం. ఆధార్ తీసుకొచ్చింది మేమేనని కాంగ్రెస్ చెప్పుకుంటున్నది. కానీ, 1998లో రాజ్యసభలో జరిగిన ఓ చర్చను ఈ సందర్భంగా గుర్తు చేయాలనుకుంటున్నాను. అప్పుడు ఎల్‌కే అద్వానీ ప్రసంగంలోనే ఆధార్ మూలాలు ఉన్నాయి. అంటే.. ఆధార్‌కు అప్పట్లోనే పునాది పడిందనే విషయాన్ని మీరు గుర్తు పెట్టుకోవాలి. ప్రతిపక్షం కళ్లు మూసుకుని ఉన్నందునే ఉపాధి కల్పన పెరిగినా చూడలేకపోతున్నది. అవినీతి, దళారి వ్యవస్థకు మేం కళ్లెం వేస్తే, ప్రతిపక్షం బాధపడుతోంది. మా హయంలో అతి పొడవైన సొరంగం, అత్యంత వేగవంతమైన రైళ్లు, గ్యాస్ పైప్‌లైన్లు వచ్చాయి. కేరళ, బంగాల్, ఒడిశా, కర్నాటకలో కోటి మందికి ఉపాధి కల్పించాం. కర్నాటకలో ప్రభుత్వం ఎంతమందికి ఉపాధి కల్పించిందో కాంగ్రెస్ చెప్పాలి.



ఎన్‌పీఏ సంక్షోభం కాంగ్రెస్ పాపమే

బ్యాంకుల వద్ద పేరుకుపోయిన నిరర్ధక ఆస్తులపై కొందరు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. 36 సాతం ఎన్‌పీఏలను 86శాతంగా చూపిస్తున్నారు. అసలు ఈ సంక్షోభానికి గత ప్రభుత్వాలే కారణం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రుణాల వల్లే ఎన్‌పీఏ సంక్షోభం ఏర్పడింది. అప్పట్లో అధికారంలో ఉన్నవారి సన్నిహితులకే రుణాలు ఇచ్చారు. దీని మూలంగా ఆర్థికవ్యవస్థకు తీరని నష్టం వాటిల్లింది. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన రుణాల్లో ఒక్క ఎన్‌పీఏ కేసు కూడా లేదు. ఇప్పుడిప్పుడే బ్యాంకులు పరిపుష్టం అవుతున్నాయి. బ్యాంకులకు మూలధనం సమకూర్చేందుకు మా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మొత్తాన్ని 18 లక్షల కోట్ల నుంచి 52 లక్షల కోట్లకు పెంచడం జరిగింది. అవినీతి, నల్లధనాన్ని రూపుమాపేందుకు కృషిచేస్తున్నాం. తద్వారా సామాన్య పౌరుడి హక్కులను పరిరక్షిస్తున్నాం. మునుపటి ప్రభుత్వాల హయాంలో బ్యాంకింగ్ విధనాలు సమగ్రంగా లేవు. దాంతో మధ్యవర్తులు బాగుపడ్డారు. దేశం సమస్యల్లో కూరుకుపోయింది. అబద్ధాలను గట్టిగా చెబితే నిజాలవుతాయని ప్రతిపక్షం భావిస్తోంది. ప్రజలు ఇప్పుడిప్పుడే వాస్తవాలు గ్రహిస్తున్నారు. మీ పాపాలను వారు క్షమించరు.



గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం కావాలి

అత్యయిక పరిస్థితులు, కుంభకోణాలు, సిక్కులకు వ్యతిరేకంగా హింసాత్మక సంఘటనలతో కూడిన పాత భారత్‌నే కాంగ్రెస్ కోరుకుంటోంది. కానీ, మా పార్టీ నూతన భారతాన్ని ఆవిష్కరించాలని తపిస్తోంది. ఆ దిశగా అడుగులు వేస్తున్నాం కూడా. గాంధీజీ కలలు కన్న స్వరాజ్యమే నేను కూడా కావాలనుకుంటున్నది. కాంగ్రెస్ రహిత భారత్ అన్నది మా నినాదం మాత్రమే కాదు. మహాత్మా గాంధీ కోరిక కూడా. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ అవసరం ఇక లేదని గాంధీజీ అన్నారు. నేను కూడా అదే చెబుతున్నాను. గాంధీజీ చెప్పినట్లే. మన దేశానికి కాంగ్రెస్ అవసరం లేదంటున్నాను. ఇందిరాగాంధీ మరణానంతరం ప్రధాని అయిన తర్వాత రాజీవ్ చేసిన వ్యాఖ్యలను మీకు గుర్తుచేస్తున్నాను. వేలాది మంది అమాయక సిక్కుల మరణాలను పార్టీ కోరుకుంటున్నదని చెప్పారు. నిజంగా కాంగ్రెస్ కోరుకుంటున్నది ఇదేనా? ఆయుష్మాన్ పథకాన్ని మీరు అమెరికా, బ్రిటన్ పథకాలతో పోల్చుతున్నారు. ఆ దేశాలకు, మనకు చాలా తేడా ఉంది. 50 ఏళ్లకుపైబడి పరిపాలించిన మీరు చేసిందేమిటి? మా పథకాల మీద అన్నివేళలా సలహాలు, సూచనలు స్వీకరిస్తాం.

ఈ దేశం కోసం, పేదల కోసమే మేము పనిచేస్తున్నాం. బీజేపీపై అభాండాలు వేయడానికి ప్రయత్నిస్తూ, ఏకంగా ఈ దేశాన్నే అప్రతిష్టపాల్జేస్తు న్నారు. ఓబీసీ, త్రిపుల్ తలాఖ్ బిల్లుల ఆమోదానికి ప్రతిపక్షం సహకరించాలి. మేము నేమ్ చేంజర్స్ మాత్రమే.. గేమ్ చేంజర్స్ కాదని మీరు అన్నారు. కానీ, మేము అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పథకాలు, అభివృద్ధి పనులు చూస్తే మీకే అర్థమవుతుంది. నిర్ణీత కాలవ్యవధి లక్ష్యాలతో పథకాలను చేపట్టి పూర్తిచేస్తున్నాం.



ఏకకాల ఎన్నికలను స్వాగతించండి..

ఎన్నికల నిర్వహణకు వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. అంతేకాదు ఎంతో సమయం, శక్తి వృథా అవుతోంది. ఇండియా వంటి దేశాలు ఈ భారాన్ని మోయగలవా? మీరే ఆలోచించండి. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుంది. ఇందుకు ప్రతిపక్షం సహకరించాలి. దీనిపై నిర్మాణాత్మక చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దావోస్ పర్యటనపై విమర్శలకు జవాబు చెప్పదలచుకున్నాను. ఓపిగ్గా వినండి.. నేనూ దావోస్ వెళ్లాను. నువ్వూ దావోస్ వెళ్లావు. కానీ ఇక్కడ తేడా ఒక్కటే. వేరెవరినో కాపాడేందుకు నువ్వు లేఖతో వెళ్లావు. దేశం కోసం, పెట్టుబడుల కోసం నేను వెళ్లాను. తప్పుడు ప్రచారం చేస్తున్నందుకు సిగ్గుగా లేదా? డొక్లాం సరిహద్దులో చైనా సైన్యం మోహరించినప్పుడు, కాంగ్రెస్ నాయకుడు చైనా అధికారులను కలవడంలో ఆంతర్యం ఏమిటి? ఇందిరా గాంధీ పాక్‌తో ప్రైవేటుగా షిమ్లా ఒప్పందం చేసుకున్న విషయాన్ని వాజ్‌పేయి సున్నితంగా విమర్శించారు. దేశానికి చేటుతెచ్చేలా బహిరంగ విమర్శలు చేయలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను.

తప్పుడు ప్రచారం తగదు..

ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూడొద్దు. 70 లక్షల మంది కొత్తగా ఈపీఎఫ్ ఖాతాలు ప్రారంభించారు. ఇవన్నీ 18-25 ఏళ్ల మధ్య వయసు వారివే. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టాండప్ ఇండియా పథకాలు యువత ఆకాంక్షలకు ఊతమిస్తున్నాయి. మన యువకుల్లో శక్తి, ఆసక్తిని నేను గమనించాను. సొంతంగా స్టార్టప్స్ ప్రారంభించాలన్న ఆకాంక్ష వారిలో కనిపిస్తోంది. మధ్యతరగతికి మా ప్రభుత్వం విస్తృత ప్రోత్సాహం ఇస్తున్నది. అవినీతి, నల్లధనానికి వ్యతిరేకంగా మా ప్రభుత్వం చేస్తున్న పోరాటంతో వారికి నిద్ర కరువైంది. అందుకే విపక్షాలు నన్ను లక్ష్యంగా చేసుకున్నాయి. దళారులు, అవినీతి పరుల ఆట కట్టించడంతో కాంగ్రెస్ నిరుత్సాహానికి లోనైంది. సామాన్యుడిని దోపిడీ చేసిన సొత్తంతా తిరిగి సామాన్యులకు చేరాల్సిందే

ఇక బడ్జెట్ మధ్యతరగతికి ప్రయోజనం కలిగించేలా లేదని ప్రతిపక్షం చెబుతున్నది. తద్వారా వారిలో అసంతృప్తిని వ్యాప్తిచేసేందుకు కుట్ర చేస్తున్నది. వాస్తవానికి మా ప్రభుత్వం వివిధ రకాలుగా మధ్యతరగతికి చేయూతనిస్తోంది. మౌలికరంగం, విద్య, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేశాం. తద్వారా మెరుగైన జీవన అవకాశాలకు కృషిచేస్తున్నాం. ఈ రంగాల ద్వారా 12వేల కోట్ల మందికి కొత్తగా ప్రయోజనం చేకూరుతుంది.

"సర్దార్ వల్లభాయ్ పటేల్ గనుక దేశానికి తొలి ప్రధాని అయివుంటే, జమ్ము-కాశ్మీర్‌లోని కొంతభాగం పాకిస్తాన్ ఆధీనంలోకి వెళ్లివుండేది కాదు. వాస్తవానికి మెజార్టీ కాంగ్రెస్ వర్గం నెహ్రూ కంటే పటేల్ వెనుకే ఉండేది. అయినా నెహ్రూ ప్రధానమంత్రి అయ్యారు"


"త్రిపుల్ తలాక్ నిషేధానికి చట్టం చేయకుండా 30 ఏళ్ల నుంచి మిమ్మల్నెవరు అడ్డుకున్నారు. మీ ఓటు బ్యాంకు పోతుందేమోనన్న భయంతో వచ్చిన అవకాశాన్ని చేజార్చారు"

" ఓ మహావృక్షం నేల కూలినప్పుడు.. ఎందరో అమాయక సిక్కులు ఊచకోతకు గురయ్యారు. ఈ వ్యాక్యాలు మీకు గుర్తున్నాయా? ఇలాంటి ఇండియానేనా మీరు కోరుకుంటున్నది? మీకు నూతన భారత్ అవసరం లేదు. కానీ ఎమర్జెన్సీ, బోఫోర్స్ కుంభకోణాల ఇండియాను మీరు కోరుకుంటున్నారు"

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తమది లక్ష్యాలను చేధించే ప్రభుత్వమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. తమది నేమ్ ఛేంజర్ ప్రభుత్వం కాదని, ఎయిమ్ ఛేజర్ ప్రభుత్వమని తెలిపారు. బుధవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రభుత్వం తరపున సమాధానమిచ్చారు. కాంగ్రెస్ పార్టీ స్వచ్ఛ భారత్, మేకిన్ ఇండియా, సర్జికల్ స్ట్రైక్స్, యోగా డే ఇలా ప్రతి పథకాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకుందన్నారు. దేశంలో జరిగే మంచి కూడా వారికి చెడులా కనిపిస్తోందన్నారు. ఓబీసీ కమిషన్ రాజ్యాంగ హోదా కల్పించే బిల్లుకు ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. ఓబీసీల ఆకాంక్షలు కాంగ్రెస్‌కు పట్టవా అని అడిగారు. బీజేపీని, మోడీని విమర్శించడమే పనిగా పెట్టుకుని దేశాన్ని సైతం తిడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రైల్వేబడ్జెట్ పేరుతో భారీ ఎత్తున రైళ్లు, లైన్లు ప్రకటించేందుకే పరిమితమయ్యారని అన్నారు. పత్రికల్లో హెడ్‌లైన్‌లు, సన్మానాలకు పరిమితమై ఆ తర్వాత వాటన్నింటిని అటకెక్కించారని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం రైల్వేలోని పెండింగ్ పనులన్నింటిని త్వరితగతిన పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ప్రగతి అనే కొత్త కార్యాచరణ ద్వారా దేశంలో ఆగిపోయిన భారీ ప్రాజెక్టులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నానని అన్నారు. కేంద్రప్రభుత్వ కార్యదర్శులు, రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో ఆన్‌లైన్‌లో మాట్లాడి ప్రతిబంధకాలు తొలగించి పనులు వేగవంతం చేశామని అన్నారు. దీని వల్ల అనేక పనులు పూర్తయ్యాయని చెప్పారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. వెదురు, తేనెటీగల పెంపకం లాంటి వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించి వారికి మరింత ఆదాయాన్ని ఇచ్చే కార్యక్రమం చేస్తున్నామన్నారు. రైతులకు మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు పెంచిన విషయాన్ని తెలిపారు.

మాది లక్ష్యాలు చేధించే ప్రభుత్వం

సైనికులకు వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌పై కాంగ్రెస్ పార్టీ తప్పుదోవ పట్టిస్తోందని అన్నారు. స్వచ్ఛ భారత్ ప్రచార ఖర్చు ఎందుకని కాంగ్రెస్ అడగడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల ఉపయోగం, స్వచ్ఛత అనేది మనిషి ప్రవర్తనలో మార్పు ద్వారా వస్తుందని తెలిపారు. ఆ ప్రవర్తనను మార్చేందుకు పెద్ద ఎత్తున ప్రచారంపై ఖర్చు చేస్తూ చైతన్యం తీసుకువస్తున్నామని చెప్పారు. ఒక్క కుటుంబం కోసం దేశ ప్రయోజనాలను తాకట్టుపెట్టారని అన్నారు. బోఫోర్స్ కుంభకోణం గురించి ప్రస్తావించిన ప్రధాని మోడీ, కాంగ్రెస్ సీనియర్ నేత నాటి రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్ ఆత్మకథలో పలు పేరాలను ఉటంకించారు. కాంగ్రెస్ పార్టీకి చందాలు ఆయుధాల డీలర్ల నుంచి వచ్చేవని పుస్తకంలో రాసిన విషయాన్ని తెలిపారు. దేశంలో ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరపాల్సిన అవసరముందన్నారు. దీనిపై దేశంలో విస్త తమైన చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల కోసం దేశంలో వేలకోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చవుతోందని అన్నారు. కోట్లాదిమంది ఉద్యోగులు ఈ ఎన్నికల కోసం సమయాన్ని వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. పేదలెందరో ఉన్న ఈ దేశంలో భారీ స్థాయిలో ప్రజాధనం ఎన్నికలపై ఖర్చు చేయడం సరైందికాదన్నారు. ప్రస్తుతం లోక్‌సభతో పాటు ఏపీ, తెలంగాణ, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయని గుర్తు చేశారు.



అడిగింది చెప్పకుండా ఆరోపణలా?

ప్రధానికి రాహుల్ సూటి ప్రశ్న



రాఫెల్ ఒప్పందం, రైతుల దుస్థితి,ఉద్యోగార్థుల డిమాండ్ల వంటి అంశాలపై తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, పార్లమెంటులో ఆరోపణలు చేయడం ప్రధాని హోదాలో ఉన్న నాయకునికి తగదని నరేంద్రమోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విసుర్లు విసిరారు.తమ పార్టీ ప్రస్తావించిన ఈ మూడు ప్రశ్నలూ ప్రజలు అడుగుతున్నవేననీ, వీటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రధానమంత్రిపై ఉందని ఆయన అన్నారు. ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, ప్రజలకే ప్రధాని ప్రశ్నలను సంధిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీపై మోడీ బహిరంగ సభల్లో ఎంత తీవ్రంగానైనా విమర్శించవచ్చునీ, కానీ, ఇందుకు పార్లమెంటును వేదిక చేసుకోవడం మాత్రం సమంజసం కాదని రాహుల్ స్పష్టం చేశారు. పార్లమెంటు ఉన్నది ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పడానికేననీ,ప్రతిపక్షాలను విమర్శించడంకోసం కాదని మోడీ గ్రహించాలని రాహుల్ అన్నారు.

ఆత్మగౌరవ ఉద్యమం తప్పదా?

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

తెలుగు ప్రజలు మరోసారి ఆత్మగౌరవ ఉద్యమానికి సిద్ధపడాల్సిన పరిస్థితులు గోచరిస్తున్నాయి. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రంలోని అధికార, ప్రతిపక్షాలు పరస్పర ఆరోపణలకు పాల్పడ్డం తప్ప రాష్ట్రానికి చేకూర్చదల్చిన ప్రయోజనాలపై ఇతమిద్దంగా తేల్చడంలేదు. బడ్జెట్‌పై దేశాధ్యక్షుని ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై బుధవారం పార్లమెంట్‌లోని రెండు సభల్లో ప్రసంగించిన ప్రధాని మోడి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అనుభవిస్తున్న దురావస్థలకు కారణం కాంగ్రెస్సేనంటూ దుయ్యబెట్టారు. నీలం సంజీవరెడ్డి, పివి నరసింహరావు, అంజయ్య వంటి నేతల్ని కాంగ్రెస్ ఏమార్చిందంటూ విమర్శించారు. రాష్ట్ర విభజనకు బిజెపి వ్యతిరేకం కాదుగాని, అసంబద్ధ విభజనను తాము అంగీకరించలేదన్నారు. ఇలా ప్రస్తుత పరిస్థితికి కారణాల్ని కాంగ్రెస్‌పైనే నెట్టేయడంలో కృతకృతులయ్యారు. రాష్ట్రం నుంచి లోక్‌సభలో కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం కొరవడ్డంతో మోడి వ్యాఖ్యలకు కనీసం నిరసన తెలిపే గళం కూడా కనిపించలేదు. సంఖ్యాబలం సరిపోక మోడి ప్రసంగాన్ని కాంగ్రెస్ ఎంపిలు అడ్డుకోలేక పోయారు. తద్వారా తాజా బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎగిసిపడుతున్న ఉద్యమ జ్వాలల్ని కాంగ్రెస్ వైపు మళ్ళించేందుకు మోడి ప్రయత్నించారు. అయితే ఎంతసేపు అప్పుడెప్పుడో కాంగ్రెస్ చేసిన తప్పుల్ని ఎత్తిచూపి విమర్శించడం తప్ప గత నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఏం చేసిందన్నదానిపై మోడిగాని, ఆయన మంత్రివర్గ సహచరులు, పార్టీ సీనియర్‌లెవరు స్పందించడంలేదు. ఇంతవరకు నాలుగు బడ్జెట్‌లు చూశారు. ఐదో బడ్జెట్‌లో ఇక తమకిచ్చేదేం లేదంటూ ఆంధ్రప్రదేశ్ వాసులు గుర్తించారు. అందుకే పార్టీలకతీతంగా కేంద్రంపై ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే గురువారం వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బంద్‌కు పిలుపునిచ్చారు. సరిగ్గా 1982సమయంలో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఆంధ్రుల ఆత్మగౌరవం దెబ్బతింది. కేంద్రం ముందు చేయిచాపినా కనికరించేదికాదు. పైగా ఇక్కడి నాయకుల్ని కాంగ్రెస్ అధిష్టానం బఫూన్లుగా పరిగణించింది. ఆ సమయంలోనే ఎన్‌టిఆర్



ఆత్మగౌరవ నినాదంతో రాజకీయ ప్రవేశం చేశారు. ఒక్కసారిగా తెలుగు ప్రజల ఆత్మగౌరవం దశదిశలకు వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగుప్రజల శక్తి తెలిసొచ్చింది. తిరిగి అలాంటి ప్రయోగం జరగాల్సిన ఆవశ్యకతుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. లేనిపక్షంలో ఢిల్లీలోని పాలకులు కాంగ్రెస్ అయినా బిజెపి అయినా ఆంధ్రప్రదేశ్ పట్ల సవతితల్లి ప్రేమనే చూపిస్తున్నాయి. తాత్కాలిక ఉపశమనం కోసం పరస్పర నిందారోపణలకు దిగుతూ వారు మాత్రం పబ్బం గడుపుకుంటున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

పద్దులు భారీ! ...నిధులేవీ?

(మొదటిపేజీ తరువాయి)

ఉపసంహరించే వీల్లేకుండా పరిమితి విధించారు. పైగా సొంతసొమ్ము ఉపసంహరణదార్లపై కూడా ఆదాయ పన్ను శాఖ దాడులు చేసి ఆరాలు తీస్తోంది. మరోవైపు బ్యాంకుల్లోనున్న ప్రజల ధరావతుల్ని అవసరమైతే బ్యాంకులు షేర్ల రూపంలోకి మార్చుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం ఆయా బ్యాంకుల యాజమాన్యాలకు ఇచ్చింది. దీంతో బ్యాంకుల్లో తమ సొమ్ముకు ఇక భద్రతలేదని సగటు భారతీయుడికి అర్థమైంది. బ్యాంకులు తమ అవసరాలు తీర్చలేవని అర్థమైపోయింది. అక్కడి నుంచి బ్యాంకుల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్ల ఉపసంహరణ జోరందుకుంది. మరోవైపు నగదుపై ఆంక్షల కారణంగా అనేక వ్యాపారాలు క్షీణించాయి. రియల్‌ఎస్టేట్ రంగం పతనమైంది. దీంతో బ్యాంకు రహిత సేవలవైపే వ్యాపారులు మొగ్గు మొదలెట్టారు. అవినీతిపరులైన అధికారులు, పన్ను ఎగవేతదార్లు తమ అక్రమార్జనను బంగారం, భూముల రూపంలోకి మార్చేశారు. ఉన్న నగదు నిల్వల్ని వీలైనంతవరకు ఇళ్ళల్లోనే దాచిపెడుతున్నారు. తిరిగి పాతకాలం తరహాలో భూముల్లో పాతరేస్తున్నారు. కొందరు బినామీల పేరిట తరలించేస్తున్నారు. ఇటీవలె బాలీవుడ్ బాద్‌షా నివాసంపై దాడి చేసిన ఆదాయపన్ను శాఖాధికారులకు ఈ విషయం స్వయంగా తెలిసొచ్చింది.

ఇలా మారిన వైఖరితో ఆశించిన స్థాయిలో పన్నుల వృద్ధి చోటు చేసుకోలేదు. ఇది కేంద్ర ప్రభుత్వ ఆదాయంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపిస్తోంది. ఇప్పటికిప్పుడు భారీగా వ్యయం చేసేందుకు తగినన్ని నిధులు కేంద్రానికి అందుబాటులో లేవు. అసలే ఎన్నికల ఏడాది కావడంతో ఈ విషయాన్ని బహిర్గతం చేసి ప్రజల నిరసనను ఎదుర్కోవడం ఇష్టంలేకే భారీ పద్దులతో బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్రం అందుకు తగిన జాగ్రత్తలు కూడా తీసుకుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లోని పద్దులు, పథకాలన్నీ ప్రకటనలకే తప్ప ఆచరణలోకొచ్చే అవకాశం అంతంత మాత్రమేనని తేల్చేస్తున్నారు.

ఉత్తరాది రాజకీయాల్లో సినీ వివాదాల ట్రిక్స్

(మొదటిపేజీ తరువాయి)



ముక్కు కోస్తే ఐదుకోట్ల నజరానాను ఇస్తామంది. సెన్సార్ పూర్తయ్యాక కూడా విడుదలకు అడ్డంపడింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం కూడా ఈ చిత్రంపై ఆంక్షలు విధించింది. ఏదైనా ఈ ఉద్యమ ప్రభావం మాత్రం ఉత్తరాది రాజకీయాలపై తీవ్రంగానే పడింది. గుజరాత్‌లో ఆపసోపాలుపడి బీజేపీ తిరిగి అధికారంలోకి వచ్చింది. రాజస్థాన్ పరిణామాలతో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధరా రాజేను పదవి నుంచి దించేయాలని బీజేపీ అధిష్టానం యోచిస్తోంది.

ఇప్పుడు మణికర్ణికపై కూడా ఇలాంటి వివాదాలే ముసురుకున్నాయి. ఝాన్సీలక్ష్మీబాయ్ అసలు పేరు మణికర్ణిక. ఈ చారిత్రక ఇతివృత్తాన్ని తెలుగు దర్శకుడు క్రిష్ అత్యద్భుత రీతిలో జాతీయస్థాయి చిత్రంగా తీర్చిదిద్దుతున్నారు. దీనికి విజయేంద్ర ప్రసాద్ కథాసంకలనం చేశారు. జాతీయ ఉత్తమనటి కంగనా రనౌత్ ప్రధానపాత్రలో నటిస్తున్నారు. బ్రిటీష్ జాతీయుడైన రాబర్ట్ ఎల్లీస్‌తో మణికర్ణిక ప్రేమాయణం నడిపిందంటూ చిత్రంలో చూపించనున్నారంటూ అఖిల భారత సర్వబ్రాహ్మణ మహాసభ వివాదం రాజేసింది. మణికర్ణిక తమ బ్రాహ్మణజాతికి చెందిన స్త్రీ అని, ఆమె పాత్రను అవమానకర రీతిలో చిత్రీకరించడాన్ని సహించలేక పోతున్నామంటూ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్‌మిశ్రా రోడ్డెక్కి ఉద్యమిస్తున్నారు. ఆయన ఇప్పుడు రాజస్థాన్ రాష్ట్రకాంగ్రెస్ కార్యదర్శిగా ఉన్నారు. వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాతలు ఆలోచిస్తున్నారు. దాదాపుగా అప్పుడే సార్వత్రిక ఎన్నికలు కూడా జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే కులపరమైన ఈ వివాదాన్ని రాజేశారన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి. క్రిష్ ఒక బాధ్యతాయుతమైన దర్శకుడు. తెలుగులో లంచాలకు వ్యతిరేకంగా వచ్చిన ఠాగూర్ చిత్రాన్ని గబ్బర్ ఈజ్ బ్యాక్ పేరిట హిందీలో పునర్నిర్మించారు. అలాగే తెలుగులో ఆయన తీసిన కంచెకు ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయ అవార్డు లభించింది. క్రీస్తుపూర్వం రెండోశతాబ్దం నాటి తెలుగు చక్రవర్తి గౌతమిపుత్ర శాతకర్ణి కథను చారిత్రక ఆధారాలతో సహా ఆయన చిత్రంగా మలిచారు. కథకుడు విజయేంద్ర ప్రసాద్‌కు బాధ్యతాయుతమైన చరిత్ర ఉంది. బాహుబలి రెండు భాగాలకు కథ అందించింది ఆయనే. హిందీలో ఘన విజయం సాధించిన భజరంగీ బాయిజాన్ చిత్రం కూడా ఆయన కథ ఆధారంగానే తీశారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రూపొందించిన మెర్సల్ తమిళ చిత్రం ఘన విజయం సాధించింది. దీనిక్కూడా ఆయనే కథనందించారు.

ఇంతటి బాధ్యతాయుత వ్యక్తుల ఆధ్వర్యంలో మణికర్ణిక చిత్రం రూపుదిద్దుకుంటోంది. అయినప్పటికీ ఊహాజనిత ఆలోచనలతో ఈ చిత్రానికి వ్యతిరేకంగా వివాదాలు మొదలయ్యాయి. బ్రాహ్మణసేన చేపట్టిన ఈ ఉద్యమానికి కర్ణిసేన కూడా మద్దతు ప్రకటించింది. ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా విడుదల చేసేందుకు వీల్లేదంటూ ఈ రెండు సంఘాలు ఈ ఏడాది పొడవునా ఉద్యమాలకు సిద్ధమౌతున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ తదితర ప్రాంతాల్లోని బ్రాహ్మణుల ఓట్లనే లక్ష్యంగా చేసుకుని ఈ ఉద్యమం మొదలైందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గతంలోనే ఉత్తరాదిన పలువురు నటులు రాజకీయాల్లోకి వచ్చారు. అమితాబ్ బచ్చన్, ధర్మేంద్ర, దారాసింగ్, హేమమాలిని, జయాబచ్చన్, సునీల్‌దత్, వినోద్‌ఖన్నా, శత్రుఘ్నసిన్హా, రాజేష్‌ఖన్నా ఇలా ఎందరో రాజకీయాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కానీ వీరెవరూ రాజకీయాల్లో తమదైన ముద్రవేయలేక పోయారు. దీర్ఘకాలం రాజకీయాల్లో మనుగడ సాగించలేక పోయారు. కానీ పద్మావత్, మణికర్ణిక చిత్రాలు మాత్రం ఉత్తర రాజకీయాల్ని ఏదొక దిశగా ఖచ్చితంగా ప్రభావితం చేస్తున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.



'ఎస్సార్డీపీ'పై మంత్రి కేటీఆర్ సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎస్సార్డీపి ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి కె.తారక రామారావు బుధవారం సమీక్ష నిర్వహించారు. బేగంపేట కార్యాలయంలో జరిగిన ట్రాన్స్‌కో, జలమండలి, సిపిడిసిఎల్, జిహెచ్‌ఎంసి అధికారుల సమన్వయ సమావేశంలో మంత్రి ఎస్సార్డీపి పనుల వివరాలను అడిగి తెలుకున్నారు. ఈ ప్రాజెక్టు పనుల కోసం తరలించనున్న విద్యుత్, వాటర్ వర్క్స్ లైన్ల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రధానంగా చర్చించారు.

ఇది ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు అని పేర్కొన్న మంత్రి పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. శాఖల మధ్య సమన్వయానికి ఇలాంటి సమావేశాలు తరచుగా నిర్వహించాలని, సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో సాగితేనే పనులు వేగవంతంగా పూర్తవుతాయన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ సమస్యలపైన మంత్రి, జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగంతో మంత్రి ఫోన్లలో మాట్లాడారు. ఎస్సార్డీపిలో భాగంగా కామినేని, ఎల్‌బి నగర్, బయోడైవర్సిటీ పార్క్, చింతలకుంట, దుర్గం చెరువు తదితర ప్రాంతాలలో చేపట్టిన పనులపై కూడా మంత్రి ప్రస్తావించారు.

చంద్రబాబుపై కేటీఆర్ ప్రశంసలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: చంద్రబాబు గొప్పోడు. ఆయన 14వసారి దావోస్ వెళ్ళారు.. నేను మొదటిసారి దావోస్ వెళ్ళా అంటూ రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖా మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. బుధవారం ఆయన మీడియా చిట్‌చాట్ సందర్భంగా చంద్రబాబుతో సెల్ఫీ అంశాన్ని ప్రస్తావించగా స్పందించారు. చంద్రబాబు దేశంలో అత్యంత సీనియర్ ముఖ్యమంత్రి అని, సమర్థుడని అన్నారు. వారితో తనకు పోలిక లేదన్నారు.

డిండితో ముంపు లేదు

- అచ్చంపేట సెగ్మెంట్‌లో లక్ష ఎకరాలకు నీరు
- జలసౌధలో మంత్రి హరీశ్‌రావు సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా తలపెట్టిన ఉల్పర రిజర్వాయర్‌తో ముంపు ఉండదని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. అతితక్కువ ముంపుతో రైతాంగానికి ప్రయోజనం కలిగించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టును రీడిజైన్ చేశారన్నారు. జలసౌధలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట అసెంబ్లీ నియోజక వర్గంలోని సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉల్పర రిజర్వాయర్ నిర్మాణం వల్ల ముంపుకు గురవుతామనే భయాందోళనలు అవసరం లేదని మంత్రి భరోసానిచ్చారు. రిజర్వాయర్ సామర్థ్యంపై జరుగుతున్న ఊహాగానాలు నమ్మవద్దన్నారు. 3టిఎంసీలు లేదా ఒక టిఎంసి కెపాసిటీతో రిజర్వాయర్ కడుతున్నారన ప్రచారాన్ని ఖండించారు. కేవలం 0.25టిఎంసిలతోనే ఉల్పర రిజర్వాయర్ నిర్మిస్తున్నట్లు మంత్రి హరీష్ ప్రకటించారు. ఈ రిజర్వాయర్ పరిధిలో దాసరాజుపల్లి గ్రామం ముంపుకు గురవుతున్నదనే ప్రచారం నమ్మవద్దన్నారు. ఈ గ్రామంలో ఒక్క ఇల్లు కూడా ముంపుకు గురికాదన్నారు. భూనిర్వాసితులకు మార్కెట్ రేటు ప్రకారం తగిన పరిహారం చెల్లిస్తామని మంత్రి వారికి హామీనిచ్చారు. చీఫ్ ఇంజనీర్ సునీల్, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులు అంచనా వేస్తారన్నారు. ఉల్పర రిజర్వాయర్ కింద రెండు పంటలకు నీరందుతుందన్నారు. ప్రస్తుతం పంటలు వేసుకుని ఉన్నందున దిగుబడి వచ్చేవరకు కాల్వల తవ్వకం జరగదని హరీష్ చెప్పారు. రెండు, మూడు నెలల తర్వాత ఆర్‌డిఓ ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో ప్రజలతో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

సముద్రానికి 680మీటర్ల ఎత్తులో ఉన్న ఆమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు అందించాలని అచ్చం పేట ఎమ్మెల్యే బాలరాజు మంత్రికి విజ్ఞప్తిచేశారు. ఇప్పటికే కల్వకుర్తి ప్రాజెక్టు నుండి అచ్చంపేట నియోజకవర్గానికి 50వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, ఈ నియోజక వర్గంలో మొత్తం లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలుచేస్తున్నట్లు తెలిపారు.

మళ్లీ మేమే

(మొదటిపేజీ తరువాయి)

సవాల్ చేస్తే కాంగ్రెస్ ముఖ్య నాయకులు ముందుకు రాలేదని, తర్వాత తాను ఇన్‌ఛార్జిగా వెళ్ళిన పాలేరు అసెంబ్లీ ఉప ఎన్నికల సందర్భంగా కూడా.. ఓడితే మంత్రి పదవిని వదులుకుంటా మీరు సిద్ధమా.. అని ప్రశ్నించినా సవాల్ స్వీకరించలేక పారిపోయారన్నారు.

ఉత్తమ్ మాట్లాడితే తనను ఓ బచ్చా అంటూ విమర్శిస్తారని, వారి నాయకుడు రాహుల్‌గాంధీ ఎవరన్నారు. ఆయనకు ఇంకా పెళ్ళి కూడా కాలేదని చమత్క రించారు. మంత్రి అనుభవంలో ఉత్తమ్, తాను సేమ్ అని.. యువత రాజకీయాల్లోకి రావాలంటూ తరచూ ప్రకటనలిచ్చే ఉత్తమ్ ఇలా మాట్లాడొచ్చా అంటూ ఎద్దేవా చేశారు. తనను సూటు, బూటు మంత్రి అనేవారు ఈ దేశంలో రాహుల్‌ను మించిన పప్పు, దద్దమ్మ ఎవరైనా ఉన్నారా.. కావలంటే గూగుల్‌లో పప్పు అని టైప్ చేయండి అంటూ మండిపడ్డారు. గడచిన మూడున్నరేళ్ళుగా టిఆర్‌ఎస్ ప్రభుత్వం సాధిస్తున్న అప్రతిహత విజయాలే ముఖ్యమంత్రి కెసిఆర్‌పై ప్రజల్లో ఉన్న అచంచల విశ్వాసానికి అద్దం పడుతున్నాయన్నారు. ఇపుడే పరిస్థితి ఇలా ఉంటే..ఇక ఈ ఏడాది అందుబాటులోకి వస్తున్న సంక్షేమ ఫలాలతో పరిస్థితి ఇంకా బాగుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న గత పదేళ్ళలో కేవలం 5వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీచేసిందని, తాము అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ళలో ఇప్పటికే 30వేల ఉద్యోగాలు భర్తీచేశామన్నారు.

ప్రతి నీటిబొట్టులో కెసిఆర్..

మిషన్‌భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా నీళ్ళిస్తే ప్రతి నీటిబొట్టులోనూ మహిళలకు కెసిఆర్ కనిపిస్తారని మంత్రి కెటిఆర్ అన్నారు. ఆ తర్వాత రైతు పెట్టుబడి పథకం, ప్రాజెక్టుల ద్వారా నీళ్ళు ఇలా పథకాలు అమలయ్యాక విపక్షాలు ఇంకా అడ్రస్ లేకుండా పోతాయన్నారు. నల్లగొండ ఫ్లోరైడ్ సమస్యకు వందశాతం కారణం కాంగ్రెస్సేనన్నారు. కాంగ్రెస్ దుష్టపరిపాలన వల్లే, కృష్ణాజలాలు అక్కడి ప్రజలకు అందించకపోవడం వల్లే 1956తర్వాత సమస్య ఉత్పన్నమైందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలకు ఇష్యూలు లేవని, సిఎం పదవి కోసం రాష్ట్ర రాజదానిలో మతకల్లోలాలు సృష్టించిన నేర చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. పదవుల కోసం నరహంతకులుగా మారిన పార్టీ దేశ చరిత్రలో కాంగ్రెస్ తప్ప ఎవరూ లేరన్నారు. థర్డ్‌గ్రేడ్ లోఫర్ పార్టీ అంటూ తీవ్రస్థాయి విమర్శలు చేశారు. 356ఆర్టికల్‌ను ప్రయోగించి.. అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలను బర్తరఫ్‌చేసిన నీచ సంస్కృతి కాంగ్రెస్‌దన్నారు. నల్లగొండ స్థానిక అంశాలను.. రాష్ట్ర రాజకీయాలకు ముడిపెట్టే యత్నం చేయడం సిగ్గుచేటన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మా పార్టీ తలుపుతట్టీ.. తట్టీ తీయకపోయేసరికి ఇపుడు అరుస్తున్నాడని.. అలాంటి వారి గురించి తాను మాట్లాడనన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టుకునే హక్కు ఉందని.. కోదండరాం, జస్టిస్ చంద్రకుమార్, చెరుకుసుధాకర్ ఇలా ఎన్ని పార్టీలైనా రావొచ్చని, అంతిమంగా ప్రజలు నిర్ణయించుకుంటున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక.. ఈ ప్రాంతంలో రెండు పార్టీలు మాత్రమే సక్సెస్ అయ్యాయని, అందులో ఒకటి ఎన్టీఆర్ స్థాపించిన టిడిపి.. రెండోది టిఆర్‌ఎస్ మాత్రమేనన్నారు. ప్రాంతీయ పార్టీలే.. దేశానికి బలమని, ప్రజలకు మంచి చేస్తాయన్నారు. ఇపుడు దేశంలో జాతీయపార్టీలు లేవని.. బిజెపి, కాంగ్రెస్‌లు పెద్ద సైజు ప్రాంతీయపార్టీలేనన్నారు.

ఆ బడ్జెట్‌లో ఏం లేదు

- రూ. 40వేల కోట్ల ప్రతిపాదనలిస్తే బాహుబలి కలెక్షన్లు కూడా రాలేదు
- కేంద్ర బడ్జెట్‌పై మంత్రి కేటీఆర్ విసుర్లు
- ఎవరినీ మెప్పించని, అర్థంకాని బడ్జెట్
- పథకాలు ఆహా.. అని పొగడటమే తప్ప చిల్లిగవ్వ ఇచ్చింది లేదు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎవరికీ అర్థంకాని, ఎవరినీ మెప్పించని నిరుత్సాహ బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని, రాష్ట్రం తరుపున రూ.40వేల కోట్ల ప్రతిపాదనలిస్తే కనీసం బాహుబలి కలెక్షన్లు కూడా కేటాయింపుల్లో లేవని మంత్రి కేటీఆర్ విమర్శించారు. బుధవారం బేగంపేట క్యాంప్ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ చేసిన ఆయన ఈ బడ్జెట్ చివరికి బిజెపి వాళ్ళకు కూడా అర్థం కాలేదన్నారు. మిత్రులను మెప్పించక, సొంత పార్టీ ఎంపీలను మెప్పించక.. ప్రజలను మెప్పించక ఇంక ఎవరికోసం ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారో వారికి తెలియాలన్నారు. కేంద్రం తమను ఎంత ప్రేమించిందో.. ప్రజలు కూడా అంతే ప్రేమ చూపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తమ రాష్ట్రప్రభుత్వం తరుపున ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ఇప్పటికే నిరసన తెలిపారన్నారు. మిషన్ భగీరథ పథకం బేష్ అంటూ ప్రశంసించారని, నీతిఆయోగ్ రూ.19వేల కోట్లు ఇవ్వమంటూ స్వయంగా సిఫార్సు చేసిందని.. అయినా ఇచ్చిందేమీ లేదని ఆయన మండిపడ్డారు.

పథకాలు అద్భుతం అంటు న్నారని, కానీ ఇచ్చిందేమీ ఉండడం లేదన్నారు. ఎయిమ్స్‌పై అరుణ్‌జైట్లీ స్వయంగా ఇస్తామని చెప్పారని.. తమ ఎంపీ జితేందర్‌కు, తనకు స్వయంగా మూడుసార్లు చెప్పారని.. కానీ ఒక్కరూపాయి కూడా విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. మిషన్‌కాకతీయకు రూ.5వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫార్సుచేయగా.. చిల్లిగవ్వ ఇవ్వలేదన్నారు. కేంద్రం నుండి వచ్చి ఆహా అని పొగుడు తున్నారని, కానీ నిధులు మాత్రం ఇచ్చింది లేదన్నారు. రాజ్యాంగం ప్రకారం హక్కుగా రాష్ట్రాలకు వచ్చే నిధులు తప్ప అదనంగా ఒక్క పైసా కూడా రాష్ట్రానికి ఇచ్చిందిలేదన్నారు. ఐటిఐఆర్‌ను మూడున్నరేళ్ళ తర్వాత కూడా ఇస్తామని.. ఇవ్వమని తేల్చడం లేదన్నారు. బయ్యారం ఫ్యాక్టరీ గురించి అడిగితే ప్రకటనలే తప్ప ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఆచరణ లేదన్నారు.

చెవిటివాని ముందు శంఖం ఊదినట్లే..

ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ప్రభుత్వానికి ఏం చెప్పినా చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లేనని మంత్రి కెటిఆర్ మండిపడ్డారు. పార్లమెంట్‌లో 11మంది ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపినంత మాత్రాన ఉపయోగం ఉండదని.. తాము ఏం చెప్పినా ప్రజలకే చెప్పుకుంటామని.. వారే నిర్ణయిస్తారన్నారు. న్యాయంగా రావాల్సిన హైకోర్టు లేదు.. ఎమ్మార్పీస్ అంశంపై అపాయింట్‌మెంట్ ఇచ్చి రద్దుచేశారు.. హైద్రాబాద్ వచ్చినపుడు అఖిలపక్షం కలుస్తామన్నా ససేమిరా అన్నారు.. ప్రధానిని స్వయంగా పిలిచి ప్రజల సమక్షంలోనే ఏదో ఒక ప్రాజెక్టుకు జాతీయహోదా అడిగితే అదీలేదు.. ఉన్న దత్తాత్రేయను మంత్రి వర్గం నుండి తొలగించారు. కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లు అంబర్‌పేట, ముషీరాబాద్ దాటి రారు.. మేమే ప్రత్యా మ్నాయం అం టారు. అమిత్‌షా వస్తున్నాడు పొడిచేస్తాం అంటారు.. అంటూ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. నరేగాను వ్యవసాయానికి అను బంధం చేయమంటే దానికీ ఉలుకూ.. పలుకూ లేదు.. విభజన చట్టాల అమలు లేదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పునర్వి భజన జరిగినా.. జరగ కున్నా తమకు వచ్చిన ఇబ్బందేమీలేదని, కానీ చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. వారి మిత్ర పక్షం టిడిపినే ఆందోళన చేస్తుంటే ఇక.. మేమడిగితే ఏమి స్తారు.. అయినా గురువారం పలువురు మంత్రులకు విజ్ఞాప నలు సమర్పించేందుకు మళ్ళీ ఢిల్లీ వెళ్తున్నానని చెప్పారు.

త్వరలో టిఆర్ఎస్ శిక్షణా కార్యక్రమాలు..

తమ పార్టీ బలంగానే ఉందని, ప్రభుత్వం చేసే పనుల వల్లే పార్టీకి మంచిపేరు వస్తుందని మంత్రి కెటిఆర్ అన్నారు. త్వరలో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేస్తామన్నారు. నిజాంపేట, మణికొండ వంటి ప్రాంతాలను గ్రేటర్‌లో కలిపే చర్చలు జరుగుతున్నాయని, త్వరలో దీనిపై స్పష్టత వస్తుం దన్నారు. తనకు మంత్రి హరీష్‌కు మధ్య ఎలాంటి బేదా భిప్రాయాలు లేవని, కాంగ్రెస్ నేతలు ఇష్యూలు లేకుండా తరచూ ఇలాంటివి లేవనెత్తుతారన్నారు.

సిరిసిల్ల నుంచే పోటీ

వచ్చే ఎన్నికలలో హైదరాబాద్ నుండి పోటీ చేస్తారన్న ప్రచారం ఎందుకు జరుగుతుందో తనకు అర్థం కావడం లేదని.. గ్రేటర్‌లో ఎంఐఎంతో కలిసి తాము 144స్థానాలు గెలిచామని మంత్రి కెటిఆర్ అన్నారు. తనకు సిరిసిల్ల బాగానే ఉందని, అక్కడి నుండే పోటీచేస్తానన్నారు. టిడిపి విలీనంపై ప్రశ్నించగా.. అసలు తెలంగాణలో టిడిపి ఎక్కడుందని ఆయన అన్నారు. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి తీరుతామని అన్నారు. ఇప్పటికే 87వేల ఇళ్ళనిర్మాణం ప్రారంభమైందని, మిగతా 13వేల ఇళ్ళ నిర్మాణం కూడా ప్రారంభిసామన్నారు. జర్నలిస్టులకు ఇంటిస్థలాల సమస్య పరిష్కరిస్తామన్నారు.

మళ్లీ పాతవేనా!

- పట్టాదార్ పాస్ పుసక్తకాలకు బిడ్‌లు
- సమీపిస్తున్న గడువు
- డిజైన్‌లపై పునఃసమీక్ష
- గడువులోగా కష్టమే

ఆంధ్రప్రభ, హైదరాబాద్: ఒక్క రోజులో 80లక్షల పాస్ పుస్తకాలను రద్దు చేసిన ప్రభుత్వం కొత్తవాటిపై నానా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ప్రైవేటు ఐటీ కంపెనీలనుంచి పెద్దగా స్పందన రాకపోవడం, క్యూఆర్ కోడ్ వంటి అధునాతన ఫీచర్ల కల్పన ప్రభుత్వానికి సవాలుగా మారిన పరిస్థితుల్లో వీటిపై అయోమయం నెలకొంది. వీటి ముద్రణకు ఇచ్చిన టెండర్ గడువును మూడు దఫాలుగా పొడిగించారు. అయినా పెద్దగా స్పందన రాలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మింట్ కాంపౌండ్‌కు ఈ బాధ్యతలు కట్టబెట్టాలని పరిశీలిస్తున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి రెవెన్యూ శాఖ కూడా నూతన పాస్‌పుస్తకాలకు మింట్‌ను సంప్రదించింది, అయితే అది ఆచరణలోకి రాలేదు. కానీ ఇప్పుడు ఐటీశాఖకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు. సమయం దగ్గరపడుతోంది. మార్చి 11 నాటికి రాష్ట్రమంతటా ఏకకాలంలో 71 లక్షల పట్టాదార్ పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. టెండర్లు పూర్తికాకపోవడంతో సందిగ్ధత నెలకొంది. ఇప్పటివరకూ ఒక్క బిడ్ కూడా దాఖలు కాకపోవడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. తాజాగా మద్రాస్ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌ను సంప్రదించినా ఇన్ని ఫీచర్లతో ఇంత తక్కువ సమయంలో ప్రింటింగ్ అసాధ్యమంటూ చేతులెత్తేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని మింట్‌పై ఆశలు పెట్టుకున్నారు. అవసరమైతే ప్రస్తుత డిజైన్‌లో కొన్ని మార్పులకు ఆమోదం తెలిపి సులువుగా ముద్రించి 21 రోజుల్లో పనిపూర్తిచేసేలా ప్రభుత్వం పరిశీలన చేస్తోంది.



మరోవైపు పాస్ పుస్తకాల జారీని ప్రభుత్వం సరళతరం చేసింది. ఇందుకు మ్యుటేషన్ విధానాన్ని స్వచ్ఛందంగా మార్చివేసింది. గతేడాది జూన్ 17నుంచి పాస్ పుస్తకాల జారీ, మ్యుటేషన్లు నిల్చిపోవడంతో వ్యవసాయ భూముల క్రయ విక్రయాలపై భారీ ప్రభావం పడింది. మ్యుటేషన్ ప్రక్రియకున్న 90 రోజుల గడువును 15 రోజులకు తగ్గించడంతోపాటు పాస్ పుస్తకాల జారీ 15 రోజుల్లోగా పూర్తి చేసేలా సర్కార్ చట్ట సవరణ చేసింది. వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో సంస్కరణలతోపాటు ఆర్వోఆర్ చట్టంలోని సెక్షన్ 60లో మార్పులు పూర్త య్యాయి. గతేడాది జూన్ 17న సర్కార్ జారీ చేసిన ఆర్డినెన్స్ ప్రకారం రాష్ట్రంలో కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాల జారీ నిల్చిపోయింది. డిజిటలైజ్డ్ ఇ పట్టాదార్ పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్‌లను అమలులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ ఆర్డినెన్స్‌ను జారీ చేశారు. అయితే ఇదే సమయంలో రిజర్వ్‌బ్యాంకు సూచనల మేరకు రాష్ట్రంలోని 82 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్‌లను పూర్తిగా రద్దు చేశారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలోనే విధిగా మ్యుటేషన్ రుసుములను వసూలు చేస్తారు.

అధునాతన ఫీచర్లకు అంతర్జాతీయ సమస్యలు కూడా మరో అడ్డంకిగా మారుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో 71 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాల జారీకి మార్చి 11ను గడువుగా పెట్టుకున్నది. అయితే 71 లక్షల అధునాతన పాస్‌పుస్తకాల ముద్రణకు సాంకేతిక ఇబ్బందులతోపాటు, 120జీఎస్ఎం పేపర్ కొరత ఉందని తెలిసింది. తెలంగాణ లోగోను 4.3 సెంటీమీటర్లసైజులో ఉబ్బెత్తుగా ముద్రించాలని, ప్రతీ పాస్ పుస్తకంపై రైతు ఫోటోతోపాటు యూనిక్ కోడ్‌ను చేతితో తడిమితే తగిలేలా ఉబ్బెత్తుగా ముద్రించేలా డిజైన్ ఖరారు చేశారు. పాస్ పుస్తకం ఒరిజినాలిటీని ధృవీకరించేలా క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్ కోడ్)ను వాడేందుకు నిర్ణయించారు. దీనికి ఒక్కో పాస్ పుస్తకానికి ఒక్కో బార్‌కోడ్‌ను, క్యూఆర్ కోడ్‌ను ఇవ్వనున్నారు. దీంతో 2డి బార్‌కోడ్ తరహాలో ఈ పుస్తకాన్ని సెల్‌ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి వివరాలు ఇంటర్‌నెట్‌లో పొందేలా వెసులుబాటు కల్పించాలని నిర్ణయించారు. మొత్తం 20 పేజీలతో 30 ఏళ్లపాటు మన్నికగా ఉండేలా వీటిని రూపొందించాలని ప్రభుత్వం భావించింది. 13 డిజిట్లతో కూడిన యూనిక్ నెంబర్‌ను వేసేలా డిజైన్‌ను రూపొందించారు. కానీ వీటికి ఏ సంస్థ ముందుకు రాకపోవడంతో ప్రభుత్వం ఢీలా పడిపోయింది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 8 ఫిబ్రవరి 2018

వాగ్ధాటిలో కలిసిన వాగ్దానాలు!

వాగ్ధాటిలో, సమయస్ఫూర్తిలో సమకాలీన రాజకీయాల్లో తనకు సమఉజ్జీ ఎవరూ లేరని ప్రధానమంత్రి నరేంద్రమోడీ మరోసారి నిరూపించుకున్నారు. పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానం చెప్పే అవకాశాన్ని ఆయన ఒక దెబ్బకు రెండు పిట్టలు చందంగా ఉపయోగించుకున్నారు.

ఆయన ప్రసంగం తార్కికంగా బాగానే ఉన్నా, నైతికంగా సరికాదన్నది సుస్పష్టం. గడిచిన ఏడు దశాబ్దాల్లో ఎక్కువ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పై విరుచుకుని పడటం ఆయనకు కొత్త కాదు. ఆకాశవాణి మన్‌కీ బాత్, బహిరంగ సభల్లో, ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగం అంతా పాత పాలకుల నిర్వాకాన్ని ఎండగట్టేందుకే కేంద్రీకరించడం ఆయనకు అలవాటు. అదే బాణీలో బుధవారంనాటి ఆయన ప్రసంగం కాంగ్రెస్ సభ్యుల నిరసనల మధ్య సాగింది. తాను అధి కారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన కార్య క్రమాలూ, వాటి పురోగతీ గురించి వివరించేందుకే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారనుకున్న వారికి నిరాశ మిగిలింది. కాంగ్రెస్ హయాంలో అవినీతి, అనువంశిక పాలన, ఎమర్జెన్సీ అరాచకాలు, రాజ్యాంగ సంస్థలకు స్వతంత్రత లేకపో వడం వంటి పాత ఆరోప ణలనే ఆయన మళ్ళీ మరింత ఉచ్ఛస్వరంతో ఏకరవు పెట్టారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం ఇచ్చిన హామీల అమలుకు, ముఖ్యంగా బడ్జెట్‌లో నికరమైన కేటాయింపుల కోసం తాము చేస్తున్న ఆందోళనపై మోడీ స్పందిస్తారేమోనని ఆశపడిన ఆ ప్రాంత ఎంపీలకు నిరాశ కలిగింది. దేశంలో కొత్త రాష్ట్రా ల ఏర్పాటుకు ఎన్‌డిఏ విధానం, మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలో మూడు కొత్త రాష్ట్రా ల ఏర్పాటుకు అనుసరించిన విధానం వంటి పాత విషయాలను గుర్తు చేస్తూనే, ఏపీ విభజనబిల్లును ఆమోదం కోసం పూర్వపు ప్రభుత్వం సభ తలుపులు మూయించి అక్రమంగా, అడ్డగోలుగా వ్యవహరించిందంటూ మోడీ చేసిన ఆరోపణ కొత్త కాదు. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఏపీ పర్యటనకు వచ్చినప్పు డల్లా ఈ ఆరోపణ తరచూ చేసే వారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడూ అలాగే చేస్తున్నారు. రాష్ట్రా నికి పార్లమెంటులో జరిగిన అన్యాయాన్ని, పార్లమెంటులోనే తేల్చుకోవాలని ఆయన తమ పార్టీ ఎంపీలకు పిలుపు ఇచ్చారు కూడా. ఆ ప్రకారమే టీడీపీ ఎంపీలు, వైకాపా సభ్యులు గడిచిన రెండు రోజుల నుంచి తెస్తున్న ఒత్తిడిని పురస్కరించుకుని ప్రధానమంత్రి తెలుగు రాష్ట్రాలకు తీపి కబురు ఏమైనా చెబుతారేమోనని ఆయా పార్టీల ఎంపీలే కాకుండా, ప్రజలు కూడా ఆశించారు. అటువంటిది ఏమీ లేకపోవడం నిరాశ కాక మరేమిటి? సాధారణ బడ్జెట్‌లో బెంగళూరు మెట్రో రైలుకు 14 వందల కోట్లను ఆర్థిక మంత్రి జైట్లీ కేటాయించి తాను సమర్పించిన ఆఖరి పూర్తి స్థాయి బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ అని రుజువు చేసుకున్నారు. అదే సందర్భంలోతమ రాష్ట్రా లకు ఎంతో కొంత మేలు చేస్తారేమోనని ఆశించిన తెలుగు ప్రజలకు నిరాశ మిగిల్చారు. కనీసం ప్రధానమంత్రి ఇచ్చే సమాధానంలోనైనా ఇలాంటి ప్రకటన ఉంటుందని ఆశించడం తప్పేమీ కాదు. అలా చేయనందుకు తెలుగు ప్రజలు తమపై అసంతృప్తి పెంచుకుంటారేమోనని మోడీ వ్యూహాత్మకంగా తన ప్రసంగం ఫోకస్‌ను విభజన రాజకీయాల వైపు తిప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్‌పై ఆయన విమర్శలను ఎవరూ తోసిపుచ్చలేని మాట నిజమే కానీ, అప్పటి అన్యాయాన్ని సరిదిద్దడానికి తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి ఆయన వివరించి ఉంటే బాగుండేది. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఐఐటి వంటి ఉన్నత స్థాయి విద్యా సంస్థలకు సరైన భవనాలు లేవు. నిధులు లేవు. తెలంగాణలో ఇరిగేషన్, విద్యుత్ ప్రాజెక్టుల కోసం ఇస్తామన్న నిధుల ఊసే లేదు. ఆంధ్రప్రదేశ్‌కి ఇంతవరకూ ఇచ్చిన నిధులను సమీక్షించి కొత్తగా ఇవ్వాల్సిన వాటిపై సమీక్షించేందుకు సంబంధిత అధికారులను ఢిల్లీకి పిలిపించారు. తెలంగాణ నాయకులు ఒత్తిడి తెస్తే ,ఆ ప్రాంతం అధికా రులను పిలిపించి సమీక్షిస్తారు. ఇవన్నీ పూర్తయ్యేటప్పటికి గిర్రున సంవత్సరం తిరిగి పోతుంది. ఇవన్నీ కాలయాపనకేనన్న సంగతి ప్రజలకు తెలుసు. ఉత్తరాది రాష్ట్రా లకూ, ఎన్నికలు జరగనున్న కర్నాటక తదితర రాష్ట్రా లకూ మరిన్ని ఎక్కువ నిధులివ్వడం ఏ ప్ర భుత్వం అధి కారంలో ఉన్నా సహజంగా జరిగేదే కావచ్చు. అదే సందర్భంలో తమకు ఇచ్చిన హామీలను అమలు జేయ మని కోరుతున్నామే తప్ప, కొత్తగా నిధులు కేటాయించమని అడగడం లేదన్న తెలుగు ఎంపీల వాదన న్యాయమైనదే కదా! దీనిపై సూటిగా ప్రకటన చేయకుండా, పాత పద్ధతిలోనే ప్రసంగించి ఎన్టీఆర్‌ని పొగిడినంత మాత్రాన ఆంధ్రప్రదేశ్ పౌరులకూ, పీవీ, అంజయ్యలకూ ఎదురైన అవమానాలను గుర్తు చేసినంత మాత్రాన తెలంగాణవాసులకూ, నీలం సంజీవరెడ్డికి జరిగిన అవమానాలను గొలుసుకట్టుగా ప్రస్తావించడం వల్ల రాయలసీమ వాసులకూ కడుపు నిండదు. అప్పటి అన్యాయాలకు బాధ్యత కాంగ్రెస్‌దేనన్న సంగతి ప్రజలకు తెలుసు. అందుకే ఆ పార్టీని ఓడించి కక్ష తీర్చుకున్నారు. ఎమర్జెన్సీ సంఘటనలు, ఢిల్లీలో సిక్కుల ఊచకోత సంఘటనలను మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించడం అసంగతమే. పాత విషయాలను తవ్వుకుంటూ పోతే గుజరాత్ అల్లర్ల వంటి సంఘటనలు కూడా చర్విత చరణంగా చెప్పినట్టవుతుంది.

మంచి మాట

అనేక సంఘర్షణలకు నష్టాలకు గురయ్యాక మనుషులు వినమ్రశీలురుగా, వివేకులుగా మారతారు.

● బెంజమిన్ ఫ్రాంక్లిన్

ఒక మోడీ.. రెండు పార్శ్వాలు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం ఉభయ సభల్లో చేసిన సుదీర్ఘ ప్రసంగాలు ఆయనలోని భిన్న పార్శ్వాలకు అద్దం పట్టాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం మీద జరిగిన చర్చకు ముక్తాయింపుగా ప్రధానమంత్రి సమాధానమివ్వడం రాజ్యాంగ రివాజు. అందులో భాగంగానే ఆయన ముందుగా లోక్‌సభలో మాట్లాడారు. తొంభయ్ నిమిషాల పాటు ఆయన ప్రసంగిస్తే అదే తొంభయ్ నిమిషాల పాటు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అలనాడు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఎలా దెబ్బతీసిందో వివరిస్తూ..అందుకే ఎన్టీరామారావు రాజకీయ రంగ ప్రవేశం చేశారని ప్రస్తావించడం ద్వారా సభలోని టీడీపీ ఎంపీలతో పాటు అమరావతిలో ఉండి శ్రద్ధగా ఆలకిస్తున్న చంద్రబాబుని కూడా సంతృప్తి పరిచే ప్రయత్నం చేసినట్టుగా అనిపించింది. రాష్ట్రపతి ప్రసంగంలో లేని అనేక అంశాలను కాంగ్రెస్‌కి జోడించి ప్రధాని మోడీ చేసిన ప్రసంగ విన్యాసం ఆయనలోని భావావేశానికి నిదర్శనంగా నిలిచింది తప్ప వేరే ఏరకంగానూ ఎన్డీయే ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నదని కాంగ్రెస్ నేతలు పదేపదే చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ..ఆ క్రెడిట్ మీరు తీసుకోండి..అభ్యంతరం లేదంటూ వారిని చల్లబరిచే ప్రయత్నం చేశారు. అంతేకాదు. అంతా ఏకపక్షంగా విమర్శల దాడికి బదులు కాంగ్రెస్ సభ్యులను ఒప్పించే ప్రయత్నంగా సావధానపు వివరణలు ఇవ్వడానికి ప్రయత్నించారు. కాంగ్రెస్ ముక్త భారత్ అన్న నినాదాన్ని బీజేపీ సృష్టించలేదని, స్వాతంత్ర్యం వచ్చాక ఇక కాంగ్రెస్ పార్టీ అవసరమే లేదని నట్టు అర్థమవుతున్నది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నుంచి అటు సోనియాగాంధీ, ఇటు రాహుల్‌గాంధీ సభలో ఉన్నందున తన విమర్శల దాడి నేరుగా వారిని తాకాలన్న ఉద్దేశంతోనే ఆయన శూలాల్లాంటి ఆరోపణలు సంధించారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దానికితోడు లోక్‌సభలో తమతో కలిసిరాని ఇతర ప్రతిపక్షాలు కూడా నినాదాల హోరెత్తిస్తున్నందున దాని ప్రభావం కూడా మోడీ ప్రసంగంలో ప్రస్ఫుటించి ఉండవచ్చన్నది మరో అభిప్రాయం. అదే రాజ్యసభలో



లోక్‌సభలో ...

రాష్ట్రపతి ప్రసంగంలో లేని అనేక అంశాలను కాంగ్రెస్‌కి జోడించి ప్రధాని మోడీ చేసిన ప్రసంగ విన్యాసం ఆయనలోని భావావేశానికి నిదర్శనంగా నిలిచింది తప్ప వేరే ఏరకంగానూ సంతృప్తిపరచలేదన్నది విశ్లేషకుల మనోగతంగా ఉన్నది. వల్లభాయ్ పటేల్‌ని ప్రధానమంత్రిని చేసుంటే కాశ్మీర్ కష్టం ఈరోజు ఇలా ఉండేది కాదన్న తమ పార్టీ సిద్ధాంతాన్ని మరోసారి చట్టసభ ద్వారా చెప్పుకుని..2019 ఎన్నికలకు ఇప్పుడే శంఖారావం పూరించారన్న వ్యాఖ్యలకు అవకాశం ఇచ్చారు. ప్రధాని ప్రసంగం రాజకీయ ప్రసంగంగా సాగిందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.



రాజ్యసభలో ...

ఆయనకు అడుగడుగునా తీవ్రస్థాయిలో అడ్డుతగులుతూ నినాదాలతో హోరెత్తించింది. తొలుత తెలుగుదేశం, వైకాపా ఎంపీలు జత చేరినా, ఆ వెంటనే తెలుగుదేశం సభ్యులు తమ సీట్లలోకెళ్లి కూచుని ప్రధాని ప్రసంగాన్ని ఆలకించారు. వైకాపా ఎంపీలు మాత్రం బాయ్‌కాట్ చేసి బైటికెళ్లి ప్లకార్డులతో నిరసన తెలిపారు. తమ పార్టీమీద మోడీ దాడి తీవ్రమవుతున్న కొద్దీ కాంగ్రెస్ సభ్యుల్లో అసహనం పెరిగిపోసాగింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగిస్తారని లోక్‌సభ స్పీకర్ ప్రకటించగానే ప్రధాని ప్రసంగం ఈ గొడవలో ఎలా సాగుతుందా అన్న అనుమానాలు కలిగాయి. మోడీ మాత్రం తడుముకోకుండా మంద్రస్థాయిలో మొదలుపెట్టి కొద్ది నిమిషాల్లోనే ప్రతిపక్షాల గొంతుల కన్నా అధిక గొంతుతో విరుచుకుపడటం ప్రారంభించారు. ఆది నుంచి చివరిదాకా ఆయన కాంగ్రెస్ లక్ష్యంగా దాడి చేశారు. తెలుగుదేశం పార్టీ చేస్తున్న డిమాండ్లకు సమాధానం చెబుతారేమోనని అందరూ ఆబగా ఎదురుచూస్తే..ప్రధాని మోడీ తెలివిగా ఆంధ్రుల సెంటిమెంట్‌ని తనకనుకూలంగా మలుచుకున్నారు. కాంగ్రెస్ సంతృప్తిపరచలేదన్నది విశ్లేషకుల మనోగతంగా ఉన్నది. వల్లభాయ్ పటేల్‌ని ప్రధానమంత్రిని చేసుంటే కాశ్మీర్ కష్టం ఈరోజు ఇలా ఉండేది కాదన్న తమ పార్టీ సిద్ధాంతాన్ని మరోసారి చట్టసభ ద్వారా చెప్పుకుని..2019 ఎన్నికలకు ఇప్పుడే శంఖారావం పూరించారన్న వ్యాఖ్యలకు అవకాశం ఇచ్చారు. ప్రధాని ప్రసంగం రాజకీయ ప్రసంగంగా సాగిందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. ఆతర్వాత రాజ్యసభలో మాట్లాడిన ప్రధాని ఆ వీరావేశం లేకుండా..అతి తక్కువ హావభావాలతో..పొదుపైన ఆహార్యంతో మాట్లాడటం ద్వారా తనలోని మరో పార్శ్వాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేశారు. తొలి ప్రసంగంలో సర్వసైన్యాధ్యక్షుడి మాదిరి చెలరేగిన ప్రధాని మోడీ రెండో ప్రసంగంలో మాత్రం తనలో సాత్విక మోడీ ఉన్నారని చెప్పుకునే ప్రయత్నం చేసినట్టుంది. దాంతోపాటు లోక్‌సభలో కాంగ్రెస్ మీద తాను చేసిన దాడి ప్రభావాన్ని చల్లబరిచే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ పార్టీ అస్సలు ఏమీ చేయలేదని తాను అనడం లేదని ఒక దశలో అన్నారు. అంతేకాదు. తమ పథకాల పేర్లు మార్చి తమ పథకాలుగా ఆనాడు మహాత్మా గాంధీయే అన్నారని గుర్తు చేసి తనలోని వివరణాత్మక శక్తిని చాటుకున్నారు. స్వాతంత్ర్యం తర్వాత గాంధీ కొత్త ఇండియాను కోరుకుంటే..కాంగ్రెస్ మాత్రం ఎమర్జెన్సీ సహిత భారత్‌ని, బోఫోర్స్ భారత్‌ని, హెలికాప్టర్ కుంభకోణాల భారత్‌ని కోరుకుంటున్నదని, తాము మాత్రం గాంధీ కోరుకున్న భారత్‌ని అభిలషిస్తున్నామని తనలోని భావనాపటిమను ప్రదర్శించి అధికార పక్షం చేత చప్పట్లు కొట్టించారు. అలాగే ట్రిపుల్ తలాక్, రాఫెల్ ఒప్పందం తదితర అంశాలను ప్రస్తావించినా..వాటిమీద వివరణాత్మక సమాచారంతో కాంగ్రెస్‌ని సమాధానపరిచే ప్రయత్నం చేశారు. లోక్‌సభలో చేసిన ప్రసంగం సందర్భంగా పదునైన వ్యంగ్యాస్త్రాలతో విమర్శల దాడికి పూనుకున్న ప్రధాని మోడీ రాజ్యసభలో మాత్రం నవ్వుల పువ్వులు పూయించే విధంగా చతురోక్తులు విసురుతూ సభను తేలిక పరుస్తూ ప్రసంగించారు. లోక్‌సభలో కనిపించిన ఆహార్యమే రాజ్యసభలోనూ కనిపించినా..అదనంగా భుజాన శాలువా వేసుకుని రావడం ద్వారా పెద్దల సభలో పెద్దరికం ప్రదర్శించి రాజకీయ పార్టీల ప్రభావం కన్నా పెద్దల సభ అన్న భావనే ఆయన చేత సౌమ్యంగా మాట్లాడించి ఉండవచ్చు అని అనుకోవడానికి ఎవ్వరికీ ఎలాంటి అభ్యంతరం ఉండకపోవచ్చు. మొత్తం మీద ప్రధాని మోడీ రాబోయే సార్వత్రిక ఎన్నికల కోసం తన ప్రసంగ పాటవానికి ఉభయ సభల్లో ప్రసంగాల ద్వారా పదును పెట్టుకున్నట్టయింది. తనలోని రెండు పార్శ్వాలను అన్యాపదేశంగా కాక..ఉద్దేశపూర్వకంగానే ప్రదర్శించుకున్నట్టయింది. అంతేకాదు. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు..తెలుగుదేశం ఎంపీలంతా మూకుమ్మడిగా తమ సీట్లలో కూచుని తన ప్రసంగాన్ని శ్రద్ధగా వినేలా చేయడం ద్వారా నరేంద్ర మోడీలోని రాజకీయ వ్యూహకర్తని..ఎన్టీరామారావు ప్రస్తావనను, తెలుగు నేతలకు కలిగిన అవమానాలను గుర్తుచేయడం ద్వారా తనలోని సమయానుకూల రాజకీయ నేతను భారతదేశ ప్రధానమంత్రి యావద్దేశానికి మరోమారు పరిచయం చేసినట్టయింది.!

❑ వయ్యస్సారెస్

మోడీకేర్.. కొత్త అధ్యాయం

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గత గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో అతి పెద్ద ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని వేల కోట్ల రూపాయిల ఖర్చుతో అమలు చేయనున్నట్టు ప్రకటించారు. అంతేకాదు. ఇలాంటి కార్యక్రమం ప్రపంచంలోనే ఎక్కడా లేదని అన్నారు. ఈ కార్యక్రమానికి మోడీ కేర్ అని నామకరణం చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒబామా కేర్ అనే ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పుడు దానిని ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రద్దు చేయాలని అనుకుంటున్నారు. అది వారి దేశానికి సంబంధించిన విషయం. జైట్లీ ప్రకటననే తీసుకుంటే ఇది ప్రపంచంలోనే తొలి కార్యక్రమం అనడం అతిశయోక్తి అవుతుంది.


అంతర్జాతీయంగా యూరోపియన్ దేశాలు 1920వ దశకంలోనే ఇలాంటి కార్యక్రమాలను అమలు జేశాయి. యూరప్ దక్షిణ ప్రాంతంలోని దేశాలు 1960వ దశకంలోనే ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టాయి. జర్మనీలో ప్రైవేటు ట్రస్టులు నిర్వహించే ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలకు తోడ్పాటుగా ప్రభుత్వం నిధులు అందజేస్తోంది. అందువల్ల విదేశాల్లో ఇలాంటి కార్యక్రమాల్లో విజయవంతం అయినవీ ఉన్నాయి. అయితే, ప్రధానంగా అక్రమాలు, అవినీతికి తావు లేకుండా ఇలాంటి కార్యక్రమాలను దేశవ్యాప్తంగా, భారీ స్థాయిలో అమలు జేయడం నిజంగా ఒక సవాలే. ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమానికి సంబంధించి అన్ని కోణాలను పరిశీలించడంలో తప్పులేదు. అంతమాత్రాన నిరాశాజనకంగా మాట్లాడినట్టు కాదు.

దేశవ్యాప్తంగా పది కోట్ల నిరుపేద కుటుంబాలకు వైద్య, ఆరోగ్య సౌకర్యాలను కల్పించేందుకు ఉద్దేశించిన మోడీ కేర్ కార్యక్రమం ఎంతో ఆదర్శప్రాయమైనదనడంలో సందేహం లేదు. అయితే, పథకాలు కాగితాల మీద చూస్తే ఎప్పుడూ ఆదర్శప్రాయంగానే కనిపిస్తాయి. క్షేత్రస్థాయిలో అమలు తుచ తప్పకుండా అమలు జేసేటప్పుడే సమస్యలు ఎదురవుతాయి. భారత దేశంలో ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమం పూర్తిగా విఫలమైంది. ఆస్పత్రుల్లో మందులుంటే, డాక్టర్లు ఉండరు, డాక్టర్లుంటే మందులుండవు. ఆస్పత్రులలో పారిశుధ్యం సంగతి సరేసరి. దాంతో వైద్య సౌకర్యాల కోసం రోగులు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్ళక తప్పడం లేదు. అక్కడ ఖర్చులు చూస్తే, ఎవరైనా కళ్ళు తిరిగి పడిపోవల్సిందే. భారతదేశంలో ఆరోగ్య పరిరక్షణకు అయ్యే ఖర్చు తలకు మించిన భారంగా తయారైందని ప్రపంచ బ్యాంకు 2014లోనే ప్రకటించింది. ప్రపంచ దేశాల్లో సగటు ఖర్చు కన్నా 18 శాతం ఎక్కువ. మన దేశంలో కూడా ఇలాంటి కార్యక్రమాలు గతంలో లేకపోలేదు. 2005లో ఆనాటి యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించి వేల కోట్ల రూపాయిలు కేటాయించింది. ఈ నిధుల్లో మూడు వంతులు పైగా రాజకీయ నాయకుల జేబుల్లోకి వెళ్ళాయి. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ కార్యక్రమం అమలులో వేల కోట్ల కుంభకోణం జరిగింది. దీనిపై దర్యాప్తు జరిపిన సీబీఐ మాయావతినీ, ఆమె మంత్రివర్గ సహచరుడు బాబూ సింగ్ కుష్వానీ ప్రశ్నించింది. కుష్వా ఎన్నికల ముందు బీఎస్‌పి నుంచి ఫ్లేటు ఫిరాయిస్తే, ఎన్నికల ముందు ఆయనకు కమలనాథులు కాషాయ కండువా కప్పారు. అంటే ఈ పథకంలో అవినీతికి తావుందనే విషయం బీజేపీ పెద్దలకు తెలియంది కాదు. లొసుగులు, లోపాలకూ, అక్రమాలకు తావు లేకుండా దీనిని అమలు జేస్తే మోడీ కేర్ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. పేదలే కాకుండా, సామాన్యుల వైద్యం ఖర్చులు నానాటికీ పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా, మధ్యతరగతి వర్గాలకు తిండి ఖర్చు కన్నా, వైద్యం ఖర్చు ఎక్కువ అవుతోంది. ఈ పథకం వల్ల మధ్యతరగతికి ఒరిగేది ఏమీ లేదు.

ఈ పథకం కింద నిరుపేద కుటుంబాలకు ఏడాదికి ఐదు లక్షల రూపాయిల మేరకు వైద్యం ఖర్చుల కింద అందజేస్తారు. స్విట్జర్లాండ్‌లో ప్రైవేటు సంస్థలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. వైద్య విధానం జనానికి అందుబాటులో ఉండేట్టు చూడటమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యం. 2005లో యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమం కింద ఏటా కుటుంబానికి 30 వేల రూపాయిల మేర వైద్య ఖర్చులను అందజేసే వారు. ఇవి ఏమూలకు? కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తే, వేలు కాదు, లక్షల్లో బిల్లులు అవుతున్నాయి. ప్రాణాలను నిలబెట్టుకోవాలంటే, ఎంత ఖర్చయినా వెనకాడకుండా ఆస్పత్రులకు వెళ్ళడం పేద, ధనిక తేడా లేకుండా అన్ని వర్గాల్లోనూ ఉంది. అందువల్ల బిల్లుల రీయింబర్స్‌మెంట్ అనేది ఒక ప్రహసనం. కార్పొరేట్ ఆస్పత్రులకు ఇలాంటి ఆరోగ్య బీమా పథకాలు కామధేనువులుగా ఉన్నాయన్నది లోకవిదితం. పూర్వపు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకం ఘోరంగా విఫలమైందని సౌమిత్రి ఘోష్, నవనీత దత్తాలతో కూడిన కమిటీ తేల్చి చెప్పింది. ఈ పథకం అప్పట్లో కుటుంబంలో 12.7 శాతం మందికి మాత్రమే వర్తిస్తుందనీ, దీనివల్ల ఏమి ఉపయోగమని కూడా పేర్కొంది. ఇలాంటి పథకాలను అమలు జేసేటప్పుడు క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేణ ఉండాలి. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పథకం విఫలమైంది. అదే మాదిరిగా ఈ కొత్త కార్యక్రమం విఫలం కారాదన్నదే అధిక సంఖ్యాకుల అభిప్రాయం. ఈ కొత్త కార్యక్రమం కింద కొత్తగా ఆస్పత్రులు తెరుస్తామనీ, డాక్టర్లను నియమిస్తామన్న మంత్రి జైట్లీ మాటలు నమ్మేట్టుగా లేవు. ఎందుకంటే, దేశంలో ప్రస్తుతం అనేక మెడికల్ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో అనుమతులు, తగిన వసతులు లేకుండా పనిచేస్తున్నవి ఎన్నో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఫాతిమా మెడికల్ కాలేజీ వ్యవహారం ఇటీవల తీవ్రమైన చర్చనీయాంశం అయింది. కొత్త మెడికల్ కాలేజీలకు విద్యార్థులనూ, వైద్యులనూ సమీకరించేందుకు ఎన్ని సంవత్స రాలు పడుతుందో వేరే చెప్పనవసరం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఢిల్లీలో ఆలిండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ (ఎయిమ్స్) వరకూ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల వరకూ ఉన్న వ్యవస్థను లొసుగులు లేకుండా ప్రభుత్వాలు మెరుగు పర్చగలిగితే కొత్త కార్యక్రమాలు అవసరం లేదు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే ముందుగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. ఆరోగ్య బీమా పథకాలకు సంబంధించి ప్రతి రాష్ట్రంలోనూ ప్రస్తుతం అమలులో ఉన్నాయి. తమ ప్రియతమ నాయకులు, నాయకురాళ్ళ పేర్లతో వాటిని ప్రభుత్వాలు అమలు జేస్తున్నాయి. వీటి పనితీరుపై సరైన సమీక్షలేకపోవడంతో తరచూ ఆరోపణలు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు కొత్త పథకా లనూ, కార్యక్రమాలనూ ప్రకటించడం జనాన్ని మభ్య పెట్టడమే. ఆరోగ్య బీమా పథకాలకూ, పబ్లిక్ ట్రస్టులకూ మధ్య పోటీ పెడితే అదో రకంగా మేలు చేసే అవకాశ ఉంది. లొసుగులు, లోపాలు లేకుండా నిరంతర పర్యవేక్షణతో అమలు జేస్తే ఆరోగ్య పరిరక్షణ పథకాలు మంచివే. మోడీ కేర్ కార్యక్రమం మెడికేర్ లో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తుందని ఆశిద్దాం.


❑ ఎ.పి.స్వామి

చరిత్రలో ఈ రోజు



1672: ఐజాక్ న్యూటన్ కాంతిశాస్త్రంలో తొలి అధ్యయనాన్ని రాయల్ సొసైటీ, లండన్‌కు సమర్పించారు. ఇదే ఏడాది జనవరిలోనే ఆయన రాయల్ సొసైటీ సభ్యునిగా ఎంపికయ్యారు. ఆయన రూపొందించిన టెలిస్కోప్‌కు గుర్తింపునిచ్చారు. అప్పటికే కొన్నేళ్ళుగా అంటే 1665నుంచే న్యూటన్ కాంతి శాస్త్రంలో పరిశోధన చేస్తున్నారు. కాంతి..రంగులు అనే అంశంపై తన సిద్ధాంతాన్ని 1672లో రూపొందించారు. 1704లో దీనిని విస్తృతంగా మార్చారు.

1883: ఫౌంటెన్ పెన్ ఆవిష్కరణకు మూలమైన ప్రయోగాలను లూయిస్ వాటర్‌మన్ ప్రారంభించారు.



1898: వర్సెస్టర్‌కు చెందిన జాన్ అమెస్ షెమన్ రూపొందించిన ఎన్వెలప్ ఫోల్డింగ్ అండ్ గమ్మింగ్ మిషన్‌కు పేటెంట్ లభించింది. షెమన్ చేసిన ఆవిష్కరణ ఎన్వెలప్ తయారీ ఖర్చును తగ్గించింది. వెయ్యి ఎన్వెలప్‌ల తయారీకి అప్పటి వరకూ 60సెంట్లు అయ్యేది. షెమన్ కృషి ఈ ఖర్చును 8సెంట్లకు తగ్గించింది.



1974: స్కైలాబ్ స్పేస్ స్టేషన్ నుంచి తమ పనిని ముగించుకుని మూడో వ్యోమగాముల బృందం భూమికి తిరిగొచ్చింది. స్కైలాబ్‌ను 1973 నవంబర్ 16న ప్రయోగించారు. అది మొత్తం 2వేల 476 సార్లు భూమి చుట్టూ తిరిగింది. మొత్తం 171రోజులు అంతరిక్షంలో ఉంది. వ్యోమగా ముల బృందాలు 2వేల గంటల పాటు శాస్త్రీయ, వైద్య ప్రయోగా లను నిర్వహించాయి. స్కైలాబ్ 1979 జులై 11న భూ వాతావరణంలోకి ప్రవేశించి, అదృశ్యమైంది.



రైల్వే నిధులు ఓ నిరాశ!

నరేంద్రమోడీ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడ్డాక అప్పటి కేంద్ర రైల్వే మంత్రి సురేశ్ ప్రభు కీలక ప్రాజెక్టులకు మాత్రం నిధులిచ్చారు. సాధారణ బడ్జెట్‌లో ఈసారి రైల్వే శాఖకు కేటాయింపులు సంతృప్తికరంగా లేవు. దక్షిణ మధ్య రైల్వేకి 5,752 కోట్లు కేటాయించారు. వీటిలో తెలంగాణకి 1,813 కోట్లు, ఏపీకి 3,670 కోట్లు కేటాయించారు. కొత్త మార్గాల నిర్మాణానికి 1,757 కోట్లు కేటాయించారు. ప్రయాణీకుల మౌలిక వసతులకు నిధుల పెరుగుదల 77 శాతం ఉంది. మార్గాల పునరుద్ధరణ పనులకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో 800 కోట్లు ఇచ్చారు. వామపక్ష ఉగ్రవాదుల ప్రాబల్యం కలిగిన ప్రాంతాలలో ఐదు కొత్త మార్గాలను కేంద్రానికి ఏపీ ప్రతిపాదించింది. వీటిలో ఒక్కటీ మంజూరు కాలేదు. తెలంగాణలో కొత్త మార్గాలు లేవు. ఉన్నవాటికే ప్రాధాన్యం ఇచ్చారు. కాజీ పేట వర్క్ షాపునకు 200 కోట్లు ఇచ్చారు. కొత్త మార్గాల సర్వేకు ఆమోదం తెలిపారు. చర్లపల్లి టెర్మినల్‌కు ఐదు కోట్లు మాత్రమే చూపారు. కొత్త రైళ్ళ ప్రకటన లేకపోగా నిధులు విడుదలలోనూ అన్యాయమే ఎదురైంది. ఏలూరు స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం గత బడ్జెట్‌లో ప్రతిపాదించినా పనులు ప్రారంభం కాలేదు. ఏపికి ప్రత్యేక రైల్వే జోన్‌ను విభజన చట్టంలో పొందుపరిచారు. ఈ విషయంలో రాష్ట్రానికి మొండి చేయి చూపింది. ఈసారైనా ప్రధాని నరేంద్రమోడీ ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని కోరినా ఫలితం లేకపోయింది. రైల్వే లైన్లను పెంచాలన్న డిమాండ్ నెరవేరలేదు. ఎప్పటిమాదిరిగానే సగటు రైల్వే ప్రయాణీకుడు డిమాండ్ ఉన్న ప్రాంతాలకు రైళ్ళను నడపాలని కోరుతున్నారు. ప్రధానంగా తిరుపతి, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు రైళ్ళ సంఖ్యను పెంచాలంటున్నారు. రాత్రిపూట రైళ్ళతోపాటు, పగటిపూట అందరికీ సౌకర్యంగా ఉండే విధంగా రైళ్ళను వేయాలంటున్నారు. ప్రధాన రైల్వే స్టేషన్లలో సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉంది. కోటిపల్లి నుంచి నరసాపురానికి లైన్‌ను పొడిగించాల్సి ఉంది. దీనికి 2000 - 01 బడ్జెట్‌లో రూ.700 కోట్లు చూపారు. సర్వే , భూసేకరణ అన్నీ పూర్తయినా దాదాపుగా తొమ్మిదేళ్ళపాటు నిధులివ్వ లేదు. ఈ పనులు పెండింగ్‌లో పడ్డాయి. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక అప్పటి రైల్వే మంత్రి సురేష్ ప్రభు 2017- 18 బడ్జెట్‌లో ఏకంగా రూ.450 కోట్లు కేటాయించారు. దీనికి సంబంధించిన క్షేత్రస్థాయి పనులు ప్రారంభించారు. ఇప్పటికే ఈ పనులకు సంబంధించిన వంతెనలకు టెండర్లు కూడా పిలిచారు. బడ్జెట్ 2018- 19లో కోటిపల్లి-నరసాపురానికి 200 కోట్లు కేటాయించారు. అంటే గత ఏడాది కన్నా 250 కోట్లు తక్కువన్న మాట. ఈసారి బడ్జెట్‌లో జిల్లా రైల్వే లైన్లపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రైల్వే బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారి వినిపించే మాట నరసాపురం కోటిపల్లి రైల్వేలైన్. దీనిని 1925లో ప్రతిపాదించారు. అప్పటినుంచి అది కాగితాలకే పరిమితమైంది. తర్వాత క్రమంలో కాకినాడ నుంచి కోటిపల్లి వరకూ రైల్వేలైన్‌ను ప్రతిపాదించి సుమారు రూ.54 కోట్లతో పూర్తి చేశారు. 1965లో కొవ్వూరు భద్రాచలం రైల్వే లైన్‌ను ప్రతిపాదించారు. పశ్చిమ ఏజెన్సీలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు పల్లెలకు రైలుమార్గం ఏర్పడనుంది. 2010 - 11లో రూ.965 కోట్లు కేటాయించి దీనిని అప్పటి ఉమ్మడి రాష్ట్రం 50 శాతం భరించాలని ప్రతిపాదించింది. తర్వాత సంవత్సరాల్లో పెద్దగా ఈ లైన్‌కు కేటాయింపు లేదు.

2016- 17లో మాత్రం రూ.5 కోట్లు ఇచ్చారు. గత బడ్జెట్ 2017-18లో రూ.122 కోట్లిచ్చారు. తిరిగి ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు మరిచిపోకుండా చేస్తే దీనిద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో పనులు పూర్తవుతాయనే ఆశతో ప్రజలు ఉన్నా ఫలితం లేకపోయింది. మచిలీపట్నం - గుడివాడ - భీమవరం - నరసాపురం - నిడదవోలు రైల్వే లైన్ పనులు ఏళ్ళతరబడి పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటి పనులకు గడిచిన మూడు బడ్జెట్‌లలో కూడా ఆశాజనక కేటాయింపులు జరిగాయి. పనులు కూడా వేగవంతంగా పూర్తి చేయడం ద్వారా డబ్లింగ్ పనులు పూర్తయి లైన్ అందుబాటులోకి వస్తుందని అంతా ఆశిస్తున్నారు. ప్రారంభంలో పూర్తి చేయడం ద్వారా డబ్లింగ్ పనులు పూర్తయి లైన్ అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రారంభంలో పనులు నడిచిన విధంగా తర్వాత కాలంలో సాగకపోవడం పట్ల వచ్చిన నిధులను వినియోగించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

❑ కీర్తి నాగరాజు, 9652404611

రోడ్డున పడ్డ ఫార్మా-డి విద్యార్థులు

● పేరుకు ముందు డాక్టర్... అయినా దక్కని ఉద్యోగం ● కమిటీ పేరుతో కాలయాపన
● ఒక్కసారీ సమావేశం కాని కమిటీ ● మాకు దారిచూపండి: క్లినికల్ ఫార్మాసిస్టుల ఆవేదన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పేరుకు ముందు డాక్టర్ అన్న హోదా. ఈ పేరు వల్ల సమాజంలో మంచి గౌరవం. ఎవరైనా ఇలాంటి చాన్స్ వదిలిపెట్టుకుంటారా? దీనికితోడు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కోటాను ప్రకటిస్తామని ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా విద్యార్థులు ఈ కోర్సు చేయడానికి క్యూ కట్టారు. 2008 సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఫార్మా-డి అనే కోర్సు ప్రారంభమయింది. దీంతోపాటు మనరాష్ట్రంలో చాలా కాలేజీల్లో ఈ కోర్సును ప్రారంభించారు. చూస్తుండగానే 5 సంవత్సరాల కోర్సు అయిపోయింది. మరో సంవత్సరం ఆస్పత్రుల్లో అప్రెంటిస్ కూడా అయిపోయింది. విద్యార్థులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. ఒక్కొక్కరూ మేనేజ్‌మెంట్ కోటా కింద 15 నుంచి 20 లక్షల రూపాయలను ఖర్చు చేసి ఈ కోర్సు చదువుకున్నారు. వెనుకకు తిరిగి చూస్తే విద్యార్థుల తల్లిదండ్రులకు అప్పులు తప్ప ఏమీ మిగలలేదు. ఈ కోర్సు చదవండని చెప్పిన ప్రభుత్వం ఆ తరువాత దాని ఊసే ఎత్తడం మానేసింది.

చదువుకోవడానికి అప్పులు

చదువుకోవడానికి అప్పులు చేసినవిద్యార్థులు ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని రోడ్డెక్కారు. అయినా ఈ విషయమై ప్రభుత్వం స్పందించడం లేదని మాకు ఆత్మహత్యే శరణ్యమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా- డి డాక్టర్లకు ఉద్యోగాలు కల్పించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని, ఉద్యోగాల కల్పన పట్ల ప్రభుత్వానికి స్పష్టత లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ కూడా వెలువరించలేదని వారు ఆరోపిస్తున్నారు. ఫార్మా-డి విద్యార్థులు ఆరు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన రాలేదని, దీనితో ఆందోళన బాట పట్టామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2008లో ప్రారంభం

ఈ కోర్సు మొదటగా అమెరికాలో ప్రారంభం అయింది. ఇండియాలో కూడా ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వం అనుమతితో దేశవ్యాప్తంగా 2008లో ఈ కోర్సు ప్రారంభించింది. ఈ కోర్సు చదివిన విద్యార్థులకు ఎక్కడ ఉద్యోగం కల్పించాలన్న దానిపై కేంద్ర, రాష్ట్రాలు స్పష్టత ఇవ్వలేదు. 2013 నుంచి ఈ కోర్సు చదివిన విద్యార్థులు ప్రభుత్వం చుట్టూ ప్రదక్షిణలు చేయడం ప్రారంభించారు. మొదటగా విద్యార్థులకు 5 సంవత్సరాల కోర్సు అయిపోగానే ఏదైనా నాలుగు విభాగాల్లో సంవత్సరం పాటు శిక్షణ పొందాల్సి ఉంటుంది. జనరల్ మెడిసిన్ అనేది ప్రతి విద్యార్థి కచ్చితంగా శిక్షణ పొందాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఫార్మ్ డీ కళాశాలలు 118 ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో 65 ఉన్నాయి.

2015లో త్రిసభ్య కమిటీ ఏర్పాటు

2015 సంవత్సరం ఆగస్టులో తెలంగాణ ప్రభుత్వం త్రిసభ్య కమిటీని వేసింది. ఈ కమిటీలో డీఎంఈతో పాటు డ్రగ్ కంట్రోల్ అథారిటీ నుంచి ఒకరు, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ నుంచి మరొకరు ఉండాలని జీఓలో ప్రభుత్వం పేర్కొంది. ఇంతవరకు ఈ కమిటీ సమావేశం నిర్వహించలేదు. డీఎంఈ, డ్రగ్ కంట్రోల్ తెలంగాణకు ఉన్నా రాష్ట్రానికి తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అనేది లేదు. కమిటీ సమావేశం కాకపోవడానికి ఇది ఒక కారణమని వైద్య ఆరోగ్య శాఖాధికారులు పేర్కొంటున్నారు. తెలంగాణలో 4 బ్యాచ్‌లకు చెందిన 6 వేల మంది విద్యార్థులు ఈ కోర్సు పూర్తి చేశారు. వీరు క్లినికల్ ట్రైనింగ్‌ను కూడా పూర్తి చేశారు. ఇందులో 5 శాతం మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ. 15 వేల నుంచి రూ.20 వేల జీతానికి పనిచేస్తున్నారు.ఈ కోర్సు చదివిన విద్యార్థులకు ప్రభుత్వం చెప్పే మాట ఒక్కటే.. త్రిసభ్య కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే తదుపరి కార్యాచరణ ఉంటుందని అంటోంది.

విద్యార్థులు మాత్రం ఈ కమిటీ వేసి 2 సంవత్సరాలు అయినా గాని ఇంతవరకు ఉలుకుపలుకు లేదని వారు ఆవేదన చెందుతున్నారు.

రోగిని పరీక్షించే సమయం కూడా వైద్యులకు లేదు

డాక్టర్ రోగానికి తగ్గట్టుగా మందు రాస్తే దానిని ఎలా వాడాలి? ఎంత మోతాదులో వాడాలి? రోగికి ఆ మందు ఎంత మేర పనిచేస్తుందన్న విషయాలను తెలియచెప్పడమే ఫార్మా-డి కోర్సు యొక్క ముఖ్య ఉద్దేశ్యం. వైద్యులు ప్రిస్క్రిప్షన్ రాస్తే దానిని రోగి ఎలా వాడాలో సంపూర్ణ పరిజ్ఞానం వీరికి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రోగులను నిశితంగా పరీక్షించే సమయం కూడా వైద్యులకు లేదు. రోగుల తాకిడి తగ్గట్టుగా వైద్యుల భర్తీలు లేవు. ఇక ప్రభుత్వ ఆస్పత్రుల్లో అయితే రోజుకు ఒక్కో డాక్టర్ వందలమంది రోగులను చూస్తుంటారు. ఫార్మా-డి విద్యార్థుల వలన వైద్యులపై భారం తగ్గించ వచ్చన్న ఆలోచనతో కేంద్రం అప్పట్లో ఈ కోర్సుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

మహారాష్ట్రలో మాత్రమే అమలు

మహారాష్ట్రలో మాత్రమే ఈ కోర్సు చదివిన విద్యార్థులకు అక్కడి ప్రభుత్వం వారికి ఉద్యోగాలు కల్పించింది. కేంద్ర ప్రభుత్వం 2015లో ఫార్మసీ ప్రాక్టీస్ రెగ్యులరైజేషన్ పేరుతో ఒక చట్టాన్ని రూపొందించింది. దీనిని కేరళ, ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయి. దీనివల్ల ఫార్మా-డీ కోర్సు చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. దీనిని మిగతా రాష్ట్రాలు ఆమోదం తెలపలేదు. ఈ విషయమై రెండురోజుల క్రితం రాజ్యసభలో ఒక ఎంపీ ప్రస్తావన తెచ్చినప్పుడు కేంద్ర మంత్రి నడ్డా ఫార్మా-డికు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశామని దీనిని అన్ని రాష్ట్రాలు ఆమోదించాలని తెలిపారు.

కేంద్రం అనుమతివ్వాలి

ఈ కోర్సు వలన వైద్య రంగానికి మేలు చేస్తుంది. క్లీనికల్ వైద్య సేవల కింద వీరి సేవలు ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. కానీ ఎంసీఐ గైడ్‌లైన్స్‌లో దాని గురించి ఎక్కడా పేర్కొనలేదు. ప్రస్తుతం ఈ కోర్సు చేసిన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నా దానికి తగ్గట్టుగా కేంద్రం మార్గదర్శకాలు ఉంటేనే ఏమైనా చేయవచ్చు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునేది ఏమీ ఉండదు. రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా, మెడికల్ అథారిటీ ఆఫ్ ఇండియాలదే. ఈ విద్యార్థులు అక్కడి నుంచి అనుమతి తీసుకోస్తే బాగుంటుంది.



డాక్టర్ టి.నర్సింగారెడ్డి ,
ఐఎంఎ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు

బలిదానాలతోనే ఉద్యోగాలా?

ఆరు సంవత్సరాల క్లీనికల్ ఓరియంటెడ్ కోర్సు పూర్తి చేసిన తాము బలిదానాలు చేసుకుంటేనే ఉద్యోగాలు ఇస్తామంటే అందుకు తాము సిద్ధంగా ఉన్నాం. నిబంధనల మేరకు మొదటి 3 సంవత్సరాలు పాఠ్యాంశాలతో పాటు ప్రాక్టికల్స్‌తో పాటు ఆస్పత్రి సందర్శనలు చేస్తాం. నాల్గో సంవత్సరంలో తరగతులకు హాజరవ్వడంతో పాటు వారానికి నాలుగు సార్లు ఆస్పత్రి సందర్శనలు చేసి రోగులకు సేవలందిస్తాం. ఐదో సంవత్సరంలో వార్డుల్లో రౌండ్లు, బెడ్ సైట్ ట్రైనింగ్, ఆరోసంవత్సరంలో ఆసుపత్రిలోనే పూర్తిగా ఇంటర్న్ షిప్ చేయాల్సి ఉంటుంది. రెసిడెన్సీ ప్రోగ్రాంలో ఆరు నెలల పాటు జనరల్ మెడిసిన్, తర్వాత ఒక్కో విభాగంలో రెండు నెలల చొప్పున మూడు స్పెషాలిటీలలో శిక్షణ ఉంటుంది. ఔషధ సేవలందించడంలో ఎండి నిపుణులతో పాటు సరిసమానమైన నైపుణ్యం తమకు ఉంటుంది. సైడ్ ఎఫెక్ట్స్ తగ్గించ డంలో ఫార్మా-డీ డాక్టర్లు కీలక పాత్ర పోషిస్తారు.



డాక్టర్ చంద్రశేఖర్,
ఫార్మా-డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు

భద్రాద్రిలో గంజాయి పట్టివేత


● నలుగురి అరెస్టు... విలువ రూ. 30 లక్షలు



భద్రాచలం(క్రైం), ప్రభ న్యూస్ : భద్రాచలం పట్టణంలోని ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ అధికారులు రూ.30 లక్షల విలువ గల గంజాయిను బుధవారం పట్టుకున్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నర్శింహా రెడ్డి వివరాల ప్రకారం.. తెలంగాణ-ఆంధ్రా సరిహద్దు రాష్ట్రమైన ఒరిస్సా నుండి మహారాష్ట్రకు భద్రాచలం మీదుగా గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒంటిగంట ప్రాంతంలో టీఎస్28 టి1608 నెంబరు ఆటోను ఆపి తనిఖీ చేయగా 43 గంజాయి ప్యాకెట్లు తరలిస్తున్నట్లుగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో టీఎస్ 04 యుబి 9089 నెంబరు గల మరో బొలోరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో రెండు కిలోల చొప్పున 200 ప్యాకెట్లు గంజాయి ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందన్నారు. ఈ గంజాయి అక్రమ రవాణాలో పాల్గొన్న భూసాని సుదర్శన్, జల్లార్లపు వెంకటప్పారావు, బాంగోతు దేవా, గుమ్మడి రమేష్‌ను విచారించగా తాము ఒరిస్సా రాష్ట్రం నుండి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు అంగీకరించారన్నారు. మొదటి వాహనంలో 86 కిలోలు, రెండో వాహనంలో 400 కిలోలు ఉన్నాయన్నారు. వీటి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందన్నారు. తనిఖీల్లో ఏఈఎస్ వివేక్, సీఐ మోహన్‌బాబు, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ శ్రీనివాసరావు, భద్రాచలం ఎక్సైజ్ సీఐ జయశ్రీలతో పాటు ఎస్ఐ సమీఉల్లాఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను నెరవేర్చండి

● ఎస్ఎల్‌బీసీ అధికారులకు వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి వినతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌లో పంట రుణ లక్ష్యాలను నెరవేర్చాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని తెలంగాణ వ్యవసాయశాఖ కార్యదర్శి సి. పార్థసారధి అన్నారు. 2017-18 వ్యవసాయ సంవత్సరంలో లక్ష్యాలను సాధించలేకపోయామని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశంపై రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందున రుణ లక్ష్యాల విషయంలో సానుకూల దృక్పదంతో ఉండాలన్నారు. నేషనల్ షాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నివేదిక ప్రకారం సాగు భూమి సగటు ఆస్తి విలువ దేశవ్యాప్తంగా రూ.28.7 లక్షల కాగా, రాష్ట్రంలో ఆ విలువ రూ.13.69 లక్షలుగా ఉందన్నారు. నాబార్డు సూచనల మేరకు టర్మ్‌లోన్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయిల్లో కూడా బ్యాంకర్ల సమావేశం త్వరలోనే నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాలపై వెల్లడిస్తామన్నారు.

క్షణికావేశంలో హత్యలు చేశా

● హరీందర్ వెల్లడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : క్షణికావేశంలోనే హత్య చేయాల్సి వచ్చిందని నిందితుడు హరీందర్‌గౌడ్ చెప్పారు. మీర్‌పేటలో భార్యాపిల్లల్ని హతమార్చిన నిందితుడు హరీందర్‌గౌడ్‌ను పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మిన్నకుండి పోయాడు. హత్యలకు సంబంధించి పోలీసులు పలు వివరాలు వెల్లడించారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేక మానసికంగా కుంగి పోయానని, భార్యతో గొడవలతో క్షణికావేశంలోనే భార్యను, పిల్లలనూ హత్య చేశానని నిందితుడు చెప్పాడు. పిల్లలను చంపినందుకు పశ్చాత్తాపడట్లేదా? అని ప్రశ్నించిన సందర్భంలో హరీందర్ మిన్నకుండి పోయాడు. హరీందర్‌గౌడ్, జ్యోతికి 2009లో పెళ్లి జరిగింది. పెళ్లి తర్వాత చాలాకాలం సంతోషంగానే ఉన్నారని పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల పట్టివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర గ్యాంగ్ ముఠా గుట్టు రట్టయింది. ఎల్‌బీనగర్ పరిధిలోని సాగర్ రింగ్ రోడ్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఈ గ్యాంగ్‌కు చెందిన ఎనిమిది మంది సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన నిందితుల నుంచి నాలుగు లక్షల నగదు, నాలుగు మొబైల్ ఫోన్‌లు, పది కేజీల బరువున్న నాలుగు నకిలీ గోల్డ్ దండలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మహారాష్ట్రకు చెందిన మోహన్ కన్నయ్య లాల్ బాగెల్, బప్పి బాలచంద్ సోలంకి, గౌరి సుఖ్‌లాల్ చోవన్, సుఖ్‌లాల్ లక్ష్మణ్ చోవన్, విజయ్ కన్నయ్య సోలంకి, కిషన్ లక్ష్మణ్ కాశి, నారన్ సుఖ్‌లాల్ చోవన్, ప్రభు మోహన్ లాల్ భగేల్. ఈ గ్యాంగ్ సభ్యుల్లో ఓ మహిళ కూడా ఉండటం గమనార్హం. వీరిలో ఏడుగురు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోచమ్మ బస్తీలో నివాసం ఉంటున్నారు. ఈ గ్యాంగ్ సభ్యులు తమ కుటుంబ సభ్యులతో నగర శివారుల్లో నివాసముంటారు. అమాయకులను ఎంచుకుని వారితో పరిచయాలు పెంచుకుని తాము మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు జీవనోపాధి నిమిత్తం వచ్చి కార్మికులుగా పనిచేస్తున్నామని చెప్పుకొస్తారు. తమ వలలో చిక్కిన అమాయకులను తమ వద్ద ఒక కేజీ బరువున్న గోల్డ్ దండ వుందని ఐదు లక్షలకే అమ్మేస్తామని చెబుతారు. వారికి అది గోల్డ్ అని నమ్మబలికేందుకు అనువుగా అందులోనుంచి తాము ముందుగానే ఉంచిన బంగారు పూసను వారికందజేస్తారు. దీంతో అది నిజమైన బంగారమని భ్రమింపజేస్తారు. ఈ విధంగా వారి వద్దనుంచి డబ్బులు దండుకుని పుత్తడికి బదులు ఇత్తడిని అప్పగిస్తారు. ఇలా వరుస వెంబడి నాలుగైదు దృష్టి మరల్చి చోరీలకు పాల్పడిన తర్వాత సిటీ వదిలి వెళ్లిపోతారు. కాగా, ఈ గ్యాంగ్ సభ్యులది స్వస్థలం గుజరాత్ కాగా.. నాగాపూర్, మహారాష్ట్రలో స్థిరపడ్డారు. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పలువురిని ఈ గ్యాంగ్ ఇలా మోసగించిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. ప్రధానంగా ఈ గ్యాంగ్ ఆయా సిటీలలో ఆర్ఎంపీ డాక్టర్లు, బట్టల షాపు యజమానులు, కిరాణా షాపు యజమానులను టార్గెట్ చేస్తారు. ఈ క్రమంలో గ్యాంగ్‌లోని సభ్యులు పోలీసులకు దొరక్కుండా జాగ్రత్తపడుతుంటారు.

ఆహార తయారీ రంగంలో అద్భుత అవకాశాలు

● పెట్టుబడులకు ఏపీ సర్కార్ ఆహ్వానం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆహార తయారీ రంగంలో పెట్టుబడుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాగస్వామ్య సదస్సులు నిర్వహిస్తోందని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కార్యదర్శి గిరిజా శంకర్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సంఘం సీఈవో వై.ఎస్ ప్రసాద్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందుకు సంబంధించి రేపు పూణేలో, 9వ తేదీన హైదరాబాద్‌లో, ఈనెల 24 నుంచి 26 వరకు విశాఖపట్నంలో సదస్సులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఒప్పందాలు జరిగాయని గిరిజా శంకర్ తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇప్పటికే ఏపీలో 226 యూనిట్‌లు పని చేస్తున్నాయని, 40 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఏపీని ఆహార ఉత్పత్తి కేంద్రంగా మార్చేందుకు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సర్కార్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని విడుదల చేసిందని, 15 ఫుడ్ పార్కులనూ ఏర్పాటు చేస్తోందన్నారు.

పోలీస్ స్టేషన్‌లో జాతీయ జెండాకు అవమానం


హైదరాబాద్, ఆంధ్రప్రభ : జాతీయ పతాకానికి నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్లో ఘోర అవమానం జరిగింది. మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇందుకు వేదిక అయింది. జాతీయ పతాకాన్ని కిందపడేసి అవమానపర్చాడో కానిస్టేబుల్. ఈ నెల 3న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీస్ స్టేషన్‌పై జాతీయ పతాకం రెపరెపలాడుతూ కనిపించని నాలుగో సింహాలలో స్ఫూర్తి రగిలిస్తూ ఉంటుంది. అలాంటిది ఈ నెల మూడవ తేదీ సాయంత్రం 6.03 గంటల ప్రాంతంలో పి.వెంకట్ నరేశ్ అనే కానిస్టేబుల్ స్టేషన్ రూఫ్ పైకి చేరి జెండాను కిందకు లాగేశాడు. అయితే స్టేషన్‌కు దగ్గరలో ఉండే అన్వర్ అనే వ్యక్తి జెండా కింద ఉండటం గమనించి ఫోటో తీసి వాట్సాప్‌లో షేర్ చేశాడు. ఈ ఫోటో ఇప్పుడు వైరల్‌గా మారింది. దీంతో పోలీసులు చర్యలకు దిగారు. ఘటనపై దర్యాప్తు జరపగా సీసీటీవీ ఫుటేజ్‌లో అసలు విషయం బయటపడింది. ఇదిలా ఉండగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మారేడ్‌పల్లి సీఐ స్పష్టం చేశారు.

100 దాటితే 108 ఎక్కుతావు!

● హైదరాబాద్ పోలీసుల కొత్త నినాదం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొత్త నినాదం తీసుకొచ్చారు. డ్రంక్ అండ్ డ్రైవ్ స్పీడ్ లిమిట్ కంట్రోల్ చేస్తూ వచ్చిన ఈ స్లొగన్ పబ్లిక్‌కు బాగా కనెక్ట్ అవుతోంది. 100 దాటితే.. 108 ఎక్కుతావ్ అంటూ ప్లకార్డులు పట్టుకుని రోడ్లపై అవగాహనను పోలీసులు కల్పిస్తున్నారు. వాహనాల స్పీడ్ 100 దాటితే కంట్రోల్ తప్పుతుంది. యాక్సిడెంట్స్ అవుతున్నాయి. దీంతో ఓవర్‌స్పీడ్ అనర్థాలను తెలుపుతూ ఈ స్లొగన్ బాగుందంటున్నారు వాహనదారులు. 108 అంటే అంబులెన్స్.. అంటే ఆసుపత్రికి చేరడం ఖాయం అని భయపడుతున్నారు. ఒక్క ఓవర్‌స్పీడ్‌పైనే కాకుండా డ్రంక్ అండ్ డ్రైవ్‌కు కూడా ఈ స్లొగన్ కనెక్ట్ అవుతుంది. ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడుతున్న మందుబాబుల ఆల్కహాల్ శాతం వంద దాటుతుంది. 100 స్పీడ్ దాటితే వాహనం నడిపేవాడి కంట్రోల్‌లో ఉండదు. అప్పుడు యాక్సిడెంట్స్ అవుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని 100 దాటితే.. 108 ఎక్కుతావ్ అంటూ స్లాగన్ రిలీజ్ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 35 పాయింట్లు దాటిన తర్వాత కేసు బుక్ చేస్తారు. 100 పాయింట్లు అంటే తీవ్రంగా పరిగణిస్తారు. కనీసం మూడు బీర్లు, ఓ హాఫ్ బాటిల్ లిక్కర్ కొడితేనే 100 పాయింట్ల కౌంట్ వస్తుంది. అంటే ఆ స్థాయిలోనే మందుకొట్టి వాహనం నడిపితే యాక్సిడెంట్స్ జరగడం ఖాయం అంటున్నారు పోలీసులు. ఎట్టి పరిస్థితుల్లోనూ 100 దాటి రోడ్లెక్కితే 108 ఎక్కుతావ్ అని చెప్పటానికి ఈ స్లొగన్ తీసుకొచ్చారు.

ఎన్‌డీ దళ కమాండర్ అరెస్టు?



బయ్యారం, ప్రభ న్యూస్ : న్యూడెమోక్రసీ రాయల వర్గానికి చెందిన బయ్యారం ఏరియా దళకమాండర్ బండారు ఐలయ్య అలియాస్ వీరన్నను పోలీసులు బుధవారం అరెస్ట్ చేసినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఎన్‌డీ రాయల వర్గానికి చెందిన బయ్యారం ఏరియా దళకమాండర్ అలియాస్ వీరన్న దళంతో పాటు మండలంలోని కొత్తగూడెం పంచాయతీ మూల పోచారం గ్రామంలోని ఓ ఇంట్లో ఉన్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఏఎస్పి గిరిధర్ ఆధ్వర్యంలో గ్రామంలో సోదాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఓ ఇంట్లో బండారి ఐలయ్యతో పాటు మరో దళసభ్యుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరితో పాటు వారి వద్ద నుంచి రెండు ఆయుధాలను, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయాన్ని పోలీసులు ధృవీకరించలేదు.

ఇది ఇలా ఉండగా నూతన జిల్లా మహబూబాబాద్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నంద్యాల కోటిరెడ్డి జిల్లాలో శాంతి భద్రతల విషయంలో రాజీలేని ధోరణిని అవలంబిస్తున్నారు. విప్లవ గ్రూప్‌లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పరిస్థితుల్లో ఫ్రెండ్లీ పోలీస్ నినాదంతో పాటు సమగ్ర నేరస్థుల సర్వే చేపట్టిన ఆయన స్థానిక సీఐ రమేష్, ఎస్సై రవీందర్‌ల నేపథ్యంలో మాజీ, ప్రస్తుతం అజ్ఞాతంలో పనిచేస్తున్న విప్లవ సభ్యుల ఇండ్లకు వెళ్ళి వారు జనజీవన స్రవంతిలో కలిసిపోయే విధంగా కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇస్తూ వచ్చారు. ఇదే సమయంలో ఇటీవల మండలంలోని ఇసుక మేది గ్రామంలో అజ్ఞాత దళంలో పనిచేస్తున్న ఒక దళ సభ్యుడిని అరెస్ట్ చేసిన సందర్భంలో ఎస్పీ ఎన్‌డీ దళాలకు ఎస్పీ హెచ్చరికలు చేశారు. శాంతి భద్రతల విషయంలో రాజీ ప్రసక్తే లేదని తేల్చి చెప్పిన ఆయన కొద్ది రోజులకే బండారి ఐలయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్త మండలంలో ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఎన్‌డీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

బుధవారం మండలంలోని మూలపోచారం గ్రామంలో పోలీసులు ఎన్‌డీ దళ నాయకుడు బండారి ఐలయ్యను అరెస్ట్ చేయటాన్ని నిరసిస్తూ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మోటార్ సైకిళ్ళపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అమరవీరుల స్తూపం వద్ద జరిగిన సభలో ఎంపీటీసీ, ఎన్‌డీ రీజినల్ నాయకులు గౌని ఐలయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విప్లవ గ్రూప్‌లపై ఉక్కుపాదం మోపుతుందని విమర్శించారు. పోడు రైతులు, ఆదివాసీల పక్షాన నిలిచిన ఎన్‌డీ నాయకులను అణచివేచే దోరణి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. అరెస్ట్ చేసిన బండారు ఐలయ్యను వెంటనే కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీ నాయకులు చిన్నచంద్రన్న, జగ్గన్న, రంగయ్య, తిరుమలేష్, యాకయ్య, ప్రభాకర్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా మళ్లీ తమ్మినేని

● 60 మందితో నూతన కార్యవర్గం



నల్గొండ, ప్రభ న్యూస్‌బ్యూరో : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం తిరిగి ఎంపికయ్యారు. రెండవసారి ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సీపీఎం ద్వితీయ మహాసభలు నల్గొండ పట్టణంలో నాలుగు రోజులపాటు జరిగాయి. ఈ మహాసభల ముగింపు సందర్భంగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. 60 మందితో నూతన కార్యవర్గాన్ని నియమించారు. వీరితో పాటు తొమ్మిది మంది ఆహ్వానితులు.. ముగ్గురిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్నుకున్నారు. అంతే కాకుండా హైదరాబాద్‌లో జరిగే జాతీయ మహాసభలకు తెలంగాణ ప్రతినిధులుగా 27 మందిని ఎంపిక చేశారు. ఇదిలా ఉంటే రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా 13మందిని ఎన్నుకున్నారు. వీరినుంచి కార్యదర్శిగా తమ్మినేనిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు..

రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యునిగా 13మందిని నియమించారు. తమ్మినేని వీరభద్రం, ఎస్.వీరయ్య, సిహెచ్ సీతారాములు, జి.నాగయ్య, చుక్కా రాములు, నంద్యాల నర్సింహారెడ్డి, సున్నం రాజయ్య, బి.వెంకట్, టి.జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, పి.సుదర్శన్‌రావు, జి.రాములు, డి.జి.నర్సింహరావులను కార్యదర్శివర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిలిన 47మంది రాష్ట్రకార్యవర్గ సభ్యులుగా కొనసాగనున్నారు. వీరితో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా మల్లు స్వరాజ్యం, సారంపల్లి మల్లారెడ్డి, పి.రాజారావులను నియమించారు. ఆహ్వానితులుగా తొమ్మిది మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బహుముఖ పోరాటాలతో ముందుకు పోతామని స్పష్టం చేశారు.

పులివెందుల అరటి ఎగుమతికి ప్యాక్ హౌస్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రపంచ ప్రఖ్యాత పులివెందుల అరటి పండ్ల ఎగుమతి కోసం ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌజ్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సీఆర్ చౌధరి బుధవారం రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్యాక్ హౌజ్ నిర్మాణానికి సంబంధించి వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికను రూపొందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు అప్పగించినట్టు ఆయన తెలిపారు. అరటి పండ్ల ఎగుమతులకు ప్రోత్సాహం, అందుకు తగిన సహాయాన్ని అగ్రికల్చరల్, ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా) అందిస్తుందని అన్నారు. పులివెందుల అరటి ఎగుమతుల కోసం ఇప్పటివరకు ఏ ఎగుమతిదారు లేదా ఏజెన్సీ అపెడాను సంప్రదించలేదని వివరించారు.

అంతర్జాతీయ మార్కెట్ ప్రకారమే కేజీ బేసిన్ గ్యాస్ ధర


దేశీయ సహజవాయు విక్రయ ధరల విధానాన్ని సమీక్షించాలంటూ ఓఎన్‌జీసీతో పాటు పలు సంస్థలు విజ్ఞప్తి చేసిన మాట వాస్తవమేనని పెట్రోలియం, సహజ వాయు శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజ్యసభలో తెలిపారు. ప్రభుత్వం అక్టోబర్ 2014లో కొత్త దేశీయ గ్యాస్ ధరల మార్గదర్శకాలను ప్రకటించినట్టు విజయసాయిరెడ్డి ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో లభ్యమవుతున్న పరిమాణం, ధర, ఇతర అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ విధానాన్ని రూపొందించామన్నారు. డీప్ వాటర్, అల్ట్రా డీప్ వాటర్, హై ప్రెజర్‌హై టెంపరేచర్ ప్రాంతాలలో కనుగొన్న గ్యాస్ నిక్షేపాల అమ్మకాలకు సంబంధించి మార్కెటింగ్, ధరల నిర్ణయాధికారం తమకు వదిలేయాలంటూ ఓఎన్‌జీసీతో పాటు అనేక సంస్థలు ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం 2016లో ఈ విధానాన్ని తీసుకొచ్చినట్టు ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.

ఫార్మసీ గ్రాడ్యుయేట్స్‌ను మెడికల్ ప్రాక్టీషనర్స్‌గా గుర్తించాలి

ఇరవై వేల మంది ఫార్మ్ డీ గ్రాడ్యుయేట్లు, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వారికి క్లినికల్ ఫార్మసిస్టులు లేదా డాక్టర్లతో సమానమైన హోదా కల్పిస్తూ సాధారణ జబ్బులకు చికిత్స చేయడానికి వారిని అనుమతించాల్సిందిగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖను ఎంపీ విజయసాయిరెడ్డి కోరారు. ఎంబీబీఎస్ విద్యతో సమానంగా ఆరేళ్లపాటు వైద్య విద్యకు సంబంధించిన అనేక సబ్జెక్టులు, స్పెషాలిటీలు, ఆసుపత్రులలో బోధన, శిక్షణ పొందిన వేలాది మంది ఫార్మ్‌డీ గ్రాడ్యుయేట్లు ప్రస్తుతం తగిన గుర్తింపు, ఉద్యోగవకాశాలు లేక అలమటిస్తున్నారని ఆయన కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు. వీరిని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య చికిత్స చేయడానికి అనుమతిస్తే... గ్రామీణ ప్రజలకు ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకు రావాలన్న ప్రభుత్వ లక్ష్యం కూడా నేరవేరుతుందన్నారు. వారికి క్లినికల్ ఫార్మసిస్టులు లేదా డాక్టర్ హోదా కల్పిస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లులో సవరణలు చేయాలన్నారు.

అభ్యంతరాలు డీజీపీకి చెప్పండి

● ఏపీ సీఐలకు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : చట్టంలో లేని రాయితీలను కోర్టులు అనుమతించలేవని హైకోర్టు స్పష్టం చేసింది. సీఐలుగా స్థాయిని పెంచిన తేదీనే ప్రాతిపదికగా తీసుకొని సీనియారిటీని లెక్కించాలని అభ్యర్థిస్తూ ఏడు రోజుల్లోగా ఏపీ డీజీపీకి వినతిపత్రం సమర్పించాలని హైకోర్టు రాయలసీమ ప్రాంతానికి చెందిన 26 మంది పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు హైకోర్టు సూచించింది. అలాగే ఆ సీఐల విన్నపాన్ని ఏకీకృత సీనియారిటీ జాబితాను ఖరారు చేయకముందే పరిశీలించాలని కూడా హైకోర్టు డీజీపీని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె. విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

ఈ సీఐలు 1993 నుంచి రాయలసీమ జిల్లాల్లోని 26 అర్బన్ పోలీసు ఠాణాల్లో ఎస్ఐలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం ఆ 26 ఠాణాల స్థాయిని పెంచాలని నిర్ణయించింది. అలాగే ఠాణాల్లో ఎస్‌హెచ్‌వోలుగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐలను కూడా సీఐలుగా స్థాయిని పెంచింది. దీంతో సీఐల సీనియారిటీ జాబితాను రూపొందించడంలో పలు మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి. సీఐల పదోన్నతుల ప్రాథమిక జాబితాను తేది.8-11-2017న డీజీపీ సిద్ధం చేశారు. కానీ తదనంతరం ఆ జాబితాను ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత మళ్లీ తేది.28-12-2017న ఏకీకృత సీనియారిటీ జాబితాను విడుదల చేశారు. దీనిపై అభ్యంతరాలను కూడా ఆహ్వానించారు. అయితే ఆ 26 మంది సీఐల పేర్లు పదోన్నతుల జాబితా లేవు. పదోన్నతుల జాబితాలో పేర్లు లేని 26 మంది సీఐల తరఫున సీనియర్ న్యాయవాది సీవి మోహన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పదోన్నతుల జాబితా వ్యవహారంలో పిటిషనర్లకు వ్యతిరేకంగా వ్యవహరించిన డీజీపీకి కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. డీజీపీ సంబంధిత అధికారి స్పష్టం చేసింది. అందువల్ల డీజీపీ కే ఏడు రోజుల్లోగా వినతి పత్రం సమర్పించాలని ఆదేశించింది. సీఐ పదవి డీఎస్పీలుగా పదోన్నతి పొందేందుకు కనీస అర్హత్వగా భావిస్తారు.

కర్నూలు చెన్నపట్నం కోటలో..

గుప్తనిధి తవ్వకాలపై కౌంటర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని చెన్నంపల్లి కోటలో ఏ ఖనిజాలున్నాయో చెప్పాలని హైకోర్టు ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె. విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ ..ఆ కోటలో తవ్వకాలు భారత భూగర్భ, పరిశోధన శాఖ అనుమతితోనే జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం లోని చెన్నంపల్లి కోట సమీపంలో గుప్త నిధుల కోసం జరుగుతున్న తవ్వకాలను నిలువరించేలా, చారిత్రాత్మక కట్టడమైన కోటను కాపాడేలా ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ రాసిన లేఖను హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. కర్నూలు తుగ్గలి మండల పరిధిలోని కోట వద్ద గుప్త నిధుల కోసం జరుగుతున్న తవ్వకాలను నిలువరించి, కోటను కాపాడాలని కోరుతూ కర్నూలు(దూపాడు)కు చెందిన డాక్టర్ బ్రహ్మారెడ్డి హైకోర్టుకు లేఖ రాశారు.

ఓ దినపత్రికలో ప్రచురించిన వార్తా కథనం ఆధారంగా రాసిన ఆ లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ఆ పత్రిక కథనం ప్రకారం ఏపీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే తవ్వకాలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారని డాక్టర్ బ్రహ్మారెడ్డి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించాలని హైకోర్టు పిల్ కమిటీ సిఫారసు చేసింది. దీంతో హైకోర్టు రిజిస్ట్రీ ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించిన విషయం తెలిసిందే.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

మార్కెట్ తీరు మారలేదు

• సెన్సెక్స్ 113 పాయింట్లు నష్టం • 7వరోజు నష్టాల్లోనే



ముంబై: స్టాక్ మార్కెట్లు వరుసగా ఏడు రోజు బుధవారం కూడా నష్టాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ వడ్డీరేట్లను యధాతథంగా కొనసాగించడంతో పాటు వృద్ధిరేటును తగ్గించడం మార్కెట్లను సంతృప్తిపరచలేదు. బీఎస్ఈ 113 పాయింట్లు క్షీణించి 34,082.71 వద్ద నిఫ్టీ 21.55 పాయింట్లు నష్టపోయి 10,476.70 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే డౌజోన్స్ క్రమంగా పుంజు కోవడంతో ట్రేడర్లకు కాస్తా ఉపశమనం కలిగింది. వరుసగా గత ఏడు ట్రేడింగ్ సెషన్‌లలో బీఎస్ఈ 2,200 పాయింట్ల వరకు నష్టపోయింది. విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు మంగళవారం నికరంగా రూ.2326.10 కోట్ల షేర్లు విక్రయిస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.1699.74 కోట్ల షేర్లు విక్ర యించారని స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. బీఎస్ఈలో అత్యధికంగా బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు నష్టపోయాయి. వాటిలో పీఎన్‌బీ, ఎస్‌బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యాక్సిస్‌బ్యాంకు, ఇండస్ఇండ్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా షేర్లు 2.18 శాతం వరకు నష్టపోగా.. ఐసీఐసీఐ బ్యాంకు, ఎస్‌బీఐ, ఫెడరల్ బ్యాంకులు లాభాలను మూటగట్టుకున్నాయి. నష్టపోయిన షేర్ల విషయానికి వస్తే ఎల్‌అండ్‌టి, టీసీఎస్, భారతి ఎయిర్‌టెల్, విప్రో, హిందుస్తాన్ యూనీలీవర్, ఎంఅం డ్‌ఎం, మారుతి సుజుకి, టాటాస్టీల్, సన్‌ఫార్మా, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌లున్నాయి. ఆసియా మార్కెట్లు నష్టాలతో ముగియగా.. ఐరోపా మార్కెట్లు మాత్రం లాభాలను చవిచూశాయి.

ఆంబే వ్యాలీ ఆస్తుల కొనుగోలుకు

మహీంద్రా, పిరామల్‌ల ఆసక్తి

న్యూఢిల్లీ : సహారా గ్రూపునకు చెందిన 34వేల కోట్ల ఆంబే వ్యాలీ ఆస్తులను కొనుగోలు చేయడానికి రెండు కంపెనీలు మహీంద్రా లైఫ్‌స్పెస్ డెవలపర్, పిరామల్ గ్రూపులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. బొంబాయి హైకోర్టు లిక్విడేటర్ ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ప్రస్తుతం ఈ రెండు కంపెనీలు దీనిపై అధ్యయనం చేస్తున్నాయని తెలిపారు. ఈ ఆస్తిని వివిధ భాగాలుగా విడగొట్టి వేలం వేయడానికి అనుమతి ఇవ్వాలని కోర్టును లిక్విడేటర్ అనుమతి కోరారు. చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా, రంజన్ గోగాయ్, ఏకే సిక్రీ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ప్రత్యేక బెంచ్ ఆంబీవ్యాలీ ఆస్తులను వివిధ భాగాలు విభజించి విక్రయించుకోడానికి అనుమతులు మంజూరు చేసింది. బొంబాయి హైకోర్టు జడ్జి నేతృత్వంలో ఇద్దరు రీసీవర్స్‌తో సంప్రదింపులు జరిపి వేలం ప్రక్రియను అమలు చేయాలని కోరింది. సెబి తరపున సీనియర్ అడ్వకేట్ అరవింద్ దాతర్ తన వాదన వినిపించారు. సహారా గ్రూపు ఇన్వెస్టర్లకు రూ.11,569.8 కోట్లు బకాయిపడిందని పేర్కొనగా.. సహారా చీఫ్ తరపున వాదిస్తున్న వికాస్ దీన్ని తోసిపుచ్చారు. ఇప్పటికే ఇన్వెస్టర్లకు చెల్లింపులు చేశామని అవన్నీ రికార్డు చేశామని దీనికి రూ.50 కోట్ల వరకు ఖర్చు పెట్టామన్నారు. ఇక అసలు విషయానికి వస్తేసహారా గ్రూపు దానికి సంబంధించిన రెండు రియల్టీ కంపెనీలు మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి అనుమతి లేకుండా చిన్న చితకా ఇన్వెస్టర్లను పెద్దమొత్తంలో పెట్టుబడులు సేకరించింది. దీనికి వ్యతిరేకంగా సెబి సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. కోర్టు ఇన్వెస్టర్లకు ఇవ్వాల్సిన మొత్తం రూ.24వేల కోట్లు తిరిగి ఇచ్చేయాలని కోర్టు ఆగస్టు 31, 2012న ఆర్డర్ జారీ చేసింది. అప్పటి నుంచి సహారాచీఫ్ ఇన్వెస్టర్లకు డబ్బు వాపసు చేయకపోవడంతో ఎట్టకేలకు సుప్రీంకోర్టు ఆంబేవ్యాలీ ఆస్తులను విక్రయించి ఇన్వెస్టర్లకు వారి పెట్టుబడులను ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

ఇప్పటికింతే!

● వడ్డీరేట్లు యధాతథం
● ద్రవ్యోల్బణం పెరిగినా వడ్డీరేట్ల పెంపు కష్టమే
● ఉర్జిత్ పటేల్

కేంద్ర బడ్జెట్ తర్వాత మొట్టమొదటి రిజర్వుబ్యాంకు మానిటరీ పాలసీ కమిటి సమావేశం మంగళ, బుధవారాల్లో జరిగింది. అందరూ ఊహించినట్లు వడ్డీరేట్లను యధాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. దీనికి ప్రధాన కారణం.. పెరిగిపోతున్న రిటైల్ ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు లక్ష్యం కంటే మరింత పెరిగే అవకాశం. అంతర్జాతీయ మార్కెట్లో క్రమంగా ముడిచమురు ధరలు పెరగడం, ప్రభుత్వం ఉద్యోగులకు ఏడవ వేతన సంఘం సిఫారసుల వల్ల రిటైల్ ద్రవ్యోల్బణం మరింత పైకి పోవచ్చునని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. కాబట్టి ప్రస్తుతానికి వడ్డీరేట్లు యధావిధంగా కొనసాగుతాయి.

ఆర్‌బీఐ 6వ ద్వైమాసిక పరపతి సమీక్ష కీలకాంశాలు

- కీలక వడ్డీరేట్లు రెపో రేటులో ఎలాంటి మార్పులేదు 6 శాతమే
- రివర్స్‌రేపో రేటు యధాతథంగా 5.75 శాతం. మార్జినల్ స్టాం డింగ్ ఫెసిలిటి (ఎంఎస్ఎఫ్) రేటు బ్యాంకు రేటు 6.25 శాతం
- మానటరీ పాలసీ విధానంలో ఎలాంటి మార్పులేదు
- జనవరిలో పెట్రోల్, డిజెల్ ధరలు భారీగా పెరిగాయి. గ్లోబల్ మార్కెట్లో ధరలు పెరగడంతో దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై పడింది.
- మార్చి చివరి నాటికి రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతానికి..
- వచ్చే ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం మొదటి సగభాగం5.1శాతం నుంచి 5.6 శాతం మధ్యలో..
- వచ్చే ఆర్థిక సంవత్సరం రెండవ సగభాగంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 నుంచి 4.6 శాతానికి
- గరిష్ఠ వాల్యూయాడెడ్(జీవీఏ) వృద్దిరేటు ఈ ఆర్థిక స ంవత్సరం 6.6 శాతం
- వచ్చే ఆర్థిక సంవత్సరం జీవీఏ అంచనా 7.2 శాతం
- త్వరలోనే పెట్టుబడులు పెరిగే అవకాశం
- బ్యాంకులకు మూలధనం వచ్చిన వెంటనే రుణాల డిమాండ్ పెరుగుతుంది: ఆర్‌బీఐ
- గ్లోబల్ మార్కెట్లో డిమాండ్ పెరగడంతో ఎగుమతులు పుంజుకుంటాయి.
- బడ్జెట్‌లో గ్రామీణ మౌలికరంగంపై దృష్టి పెట్టడం ఆహ్వా నించదగ్గ అంశం
- మానిటరీ కమిటిలో ఐదుగురు సభ్యులు వడ్డీరేట్లు యధావిధిగా కొనసాగించాలని మొగ్గుచూపితే.. ఒక సభ్యుడు 0.25 శాతం వడ్డీ పెంచాలని పట్టుబట్టారు.
- తదుపరిమానిటరీ పాలసీ కమిటి సమావేశం ఏప్రిల్ 4,5 తేదీల్లో..



ముంబై: రెండు రోజుల పాటు జరిగిన రిజర్వుబ్యాంకు మానిటరీ పాలసీ సమావేశం బుధవారంతో ముగిసింది. ఈసమావేశంలో ఆర్‌బీఐ వడ్డీరేట్లను యధాతథంగా కొనసాగించడానికి నిర్ణయించింది. దీనికి పలు కారణాలు ప్ర స్తావించింది. వాటిలో ప్రధానంగా చెప్పుకోవాలంటే ద్రవ్యలోటు అదుపు తప్పుతోంది. గ్లోబల్ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి.. అమెరికా ట్రెజరీ బాండ్ల పై ఈల్డింగ్ పెరిగిపోవడంతో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని చెప్పింది. కేంద్రప్రభుత్వం ఉద్యోగులకు ఏడవ వేతన సంఘం సిఫారసులు అమలు చేస్తున్ననేపథ్యంలో ద్రవ్యోల్బణం పెరుగుతుందని చెప్పి ఈ సారికి వడ్డీరేట్ల పెంపు జోలికి పోమని స్పష్టం చేసింది.. యధావిధిగా ఆరు శాతానికి కొనసాగించడానికి నిర్ణయించింది. ఆర్‌బీఐ రెపోరేటు యధావిధిగా ఆరు శాతానికి, రివర్స్ రెపోరేటు 5.75 శాతానికి కొనసాగిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్దిరేటు 6.6 శాతానికి సవరించింది. గతంలో 6.7 శాతం సాధిస్తుందని అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో మాత్రం జీడీపీ 7.2 శాతం సాధించే అవకాశాలున్నయని అంచనా వేసింది. ఇప్పుడిప్పుడే పెద్దనోట్ల రద్దు, జీఎస్టి సమస్యల నుంచి గట్టెక్కుతున్నాయని పేర్కొంది. మానిటరీ పాలసీ కమిటిలో ఐదుగురు సభ్యుల్లో ఆర్‌బీఐ గవర్నర్‌తో కలిపి వడ్డీరేట్లు యాధావిధిగా కొనసాగించాలని వోటు వేస్తే.. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ పాత్ర ఒక్కరే వడ్డీరేట్లు పెంచాలని వోటు వేశారు. అయితే ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షలో అన్నీ అంశాలను జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకుంది. వృద్ధిరేటు ఇప్పుడిప్పుడే పుంజుకుంటోందని.. ప్రస్తుతం పరిస్థితుల్లో వడ్డీరేట్ల పెంపుజోలికి కూడా పోమని కూడా స్పష్టం చేసింది. అందరూ ఊహించినట్లు ఆర్‌బీఐ వచ్చే ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం రేటు పెరుగుతుందని అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరం రెండవ సగ భాగంలో ద్రవ్యోల్బణం 4.3 శాతం నుంచి 4.7 శాతానికి ఎగబాకవచ్చునని పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 మొదటి సగభాగంలో ద్రవ్యోల్బణం 5.1 శాతం నుంచి 5.6 శాతానికి ఎగబాకవచ్చునని అంచనా వేసింది . దీనికి ఆర్‌బీఐ చెబుతున్న కారణాలు అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడంతో పాటు చమురేతర ముడిసరకుల ధరలు పెరగవచ్చునని తెలి పింది.అయితే వచ్చే ఆర్థిక సంవత్సరం రెండవ సగభాగంలో ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గి 4.5 నుంచి 4.6 శాతం మధ్యలో ఉండొచ్చునని అంచనా వేసింది. దీనికి ప్రధానకారణం ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో పాటు.. రుతుపవనాలు కూడా సాధారణం కంటే మెరుగ్గా ఉండే అవకాశాలుంటాయని సరఫరా కూడా మెరుగుపడుతుందని వివరించింది. ద్రవ్యోల్బం మాత్రం పెరుగుతుందని పక్కాగా అంచనా వేసినా.. ఒక వేళ వచ్చే ఆర్థికసంవత్సరం మొదటి సగభాగంలో ద్రవ్యోల్బణం 5.6 శాతానికి ఎగబాకినా.. రెండవ సగ భాగం నుంచి ద్రవ్యోల్బణం తగ్గ ముఖం పట్టినా.. కీలకవడ్డీరేట్లు పెంచే అవకాశాల్లేవు. అంత ర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయ పరిణామాల్లో ఎలాంటి కీలకమాప్పులు చేర్పులు జరి గినా.. ఆర్‌బీఐ మాత్రం వడ్డీరేట్లు పెంచడానికి మాత్రం మొగ్గు చూ పడం లేదు. దీంతో బాండ్ డీలర్లకు ఉపశమనం కలిగింది. ఆర్‌బీఐ డిప్యూటి గవర్నర్ విరాల్ ఆచార్య కూడా బాండ్ ఈల్డింగ్ తగ్గించడా నికి ఎలాంటి జోక్యం చేసుకోదని.. మార్కెట్లో సరిపడేంత ద్రవ్యం అందుబాటులో ఉందని కాబట్టి బాండ్ మార్కెట్ స్థిరపడు తుందన్నారు. ప్రస్తుతం పరి స్థితులు చూస్తుంటే ఆర్‌బీఐ వడ్డీ రేట్ల పెంపుజోలికి పోయే పరిస్థితి కనిపించడం లేదు. మరింత కాల యాపన చేసేట్లు ఉంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ద్రవ్యో ల్బణం పెరగడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. దీనికి ఉదాహరణ చెప్పుకోవాలంటే ముడిచమురు ధరలతో పాటు కమాడిటీ ధరలు పెరిగాయి. ప్రభుత్వం కొన్ని పంటలతో కనీస మద్దతు ప్రకటించింది. కస్టమ్స్ సంకం పెం చింది. దీంతో పాటు 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును మరింత పెరిగే అవకాశాలున్నాయని ప్రభుత్వం సెలవిచ్చింది. ఇవన్నీ కలిసి వడ్డీరేట్లు పెంచడానికి దారి తీయాల్సిన పరిస్థితులున్నా.. రిజ ర్వుబ్యాంకు మాత్రం సమీప భవిష్యత్తులో మాత్రం వడ్డీరేట్ల పెం పుజోలికిపోదు. మరింత సమయం తీసుకుని వడ్డీరేట్లు పెంచితే పెం చుతుంది. ప్రస్తుతం ఆర్‌బీఐ పరిస్థితి చూస్తుంటే కనీసం రెండు ద్రవ్యపరపతి సమీక్షల వరకు వడ్డీరేట్ల పెంపుజోలికి పోయే అవకాశాల్లేవు. వడ్డీరేట్లు పెర గాలంటే ద్రవ్యోల్బణం భారీగా పెరిగితే తప్ప వడ్డీరేట్లు పెంచడానికి అవకా శాల్లేవని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు.

మార్చి నాటికి ద్రవ్యోల్బణం 5.4 శాతం

మార్చి చివరి నాటికి రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతానికి ఎగబాకవచ్చునని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. దీనికి ప్రధాన కారణం ద్రవ్యలోటు పెరగడంతో పాటు ముడిచమురు ధరలు పెరగడం, ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు పెంచడమే కారణమని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం మొదటి సగభాగంలో ద్రవ్యోల్బణం 5.1 నుంచి 5.6 శాతం మధ్య ఉండవచ్చునని అంచనా వేసింది. ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటు 7 నుంచి 7.5 శాతం మధ్యలో ఉండొచ్చునని పేర్కొంది. కాగా డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ అంచనా కంటే ఎక్కువగా 5.21 శాతం దాటిపోయింది. నవంబర్‌లో 4.88 శాతం కాగా 2015 డిసెంబర్‌లో 3.41 శాతంగా నమోదైంది.

ఆటో పండుగ షురూ!



గ్రేటర్ నోయిడా : ఢిల్లీలో జరుగుతున్న ఆటో ఎక్స్‌పో 2018లో దేశీయ ఆటో కంపెనీలతో పాటు విదేశీ ఆటో కంపెనీలు తమ ప్రొడక్టులను ప్రదర్శనకు ఉంచుతున్నాయి. ఈ ఆటో ఎక్స్‌పో అధికారికంగా గురువారం మధ్యాహ్నం ఆవిష్కరిస్తారు. కాగా ప్రజల కోసం ఈ నెల 9-14 వరకు ఈ ప్రదర్శనకు అనుమతిస్తారు. వీటిలో బుధవారం నాడు కొన్ని కంపెనీలు తమ తమ ప్రొడక్టును మీడియా కోసం ప్రదర్శనకు ఉంచారు.

టీవీ ఎస్ మోటార్

టీవీఎస్ మోటార్ కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్ కాన్సెప్ట్'క్రెయాన్' 220 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ బైక్ జెప్పిలిన్‌ను ప్రదర్శనకు ఉంచింది. దీంతో పాటు ఎథినాల్‌తో నడిచే మోటార్‌సైకిల్ అపాచీ ఆర్‌టీఆర్ 200 ఎఫ్ఐ ఎథినాల్‌ను ఇక్కడ ప్రదర్శనకు ఉంచింది. ఈ బైకల ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చునని టీసీఎస్ కంపెనీ ప్రెసిడెంట్, సీఈవో కెఎన్ రాధాకృష్ణణ్ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. టీవీఎస్ క్రియాన్ 5.1 సెకన్లలో 0-60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. లిథియమ్ బ్యాటరీ 80శాతం చార్జింగ్ 60 నిమిషాల్లో పూర్తవుతుందని వివరించారు.



హెచ్‌ఎంఎస్‌ఐ నుంచి 160సీసీ బైక్ ఎక్స్ బ్లేడ్

హీరోమోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా బుధవారం నాడు 160 సీసీ బైక్ ఎక్స్ బ్లేడ్‌ను వచ్చే నెల మార్కెట్లో విడుదల చేయబోతోంది. ఆటోఎక్స్‌లో మొత్తం పది మోడల్స్‌ను ప్రదర్శనకు ఉంచింది. వీటితో పాటు కొత్త వెర్షన్ స్కూటర్ యాక్టివాను ప్రదర్శనకు ఉంచబోతోందని కంపెనీ ప్రెసిడెంట్ సీఈవో తాకిరో హచిగో ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సేల్స్ మార్కెటింగ్ వైఎస్ గులేరియా మాట్లాడుతూ 150 సీసీ 180 సీసీ బైక్ సెగ్మెంట్‌కు మంచి డిమాండ్ ఉందని ఆయన అన్నారు. ఎక్స్ బ్లేడ్ బైక్‌తో మార్కెట్లో మరింత పట్టుబిగిస్తామన్నారు.

రోమోటో కార్ప్ నుంచి 200 సీసీ

అడ్వెంచర్ మోటార్ సైకిల్, రెండుస్కూటర్లు

ద్విచక్ర వాహనాల తయారీకంపెనీల్లో అతి పెద్ద కంపెనీ హీరోమోటో బుధవారం నాడు 200 సీసీ అడ్వెంచర్ మోటార్‌సైకిల్, ఎక్స్‌పల్స్; రెండు 125 సీసీ స్కూటర్లను ఈ ఏడాది చివర్లో మార్కెట్లో విడుదల చేయబోతోందని కంపెనీ చైర్మన్, ఎండీ, సీఈవో పవన్ ముంజాల్ ఇక్కడ జరుగుతున్న ఆటోఎక్స్‌పో అన్నారు.

మారుతి నుంచి కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్ కార్లు

దేశంలోని అతి పెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి బుధవారం నాడు ఇక్కడ కాన్సెప్ట్ కాంపాక్ట్‌కారు తో పాటు ఎస్‌యూవీ లాంటి కార్లను ఇక్కడి ఆటో ఎక్స్‌పోలో గ్లోబల్ ఆవిష్కరణ చేసింది. ఈ కాన్సెప్ట్ ఫ్యూచర్‌ఎస్ వినూత్నమైన స్టయిల్‌తో ఎఎస్‌వీని తలపిస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్ మార్కెట్ కోసం యుటిలిటి వాహనాలను పెద్దమొత్తంలో విడుదల చేస్తామని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సీఈవో కెనిచి ఆయుకావా చెప్పారు.

హోండా కొత్త అమెజ్, సివిక్

జపాన్‌కు చెందిన ఆటో దిగ్గజం కంపెనీ హోండా బుధవారం మొత్తం మూడు ప్రొడక్టులను ప్రదర్శనకు ఉంచింది. వాటిలో కొత్త అమేజ్, ఒకటి వచ్చే ఆర్థిక సంవత్సరం రోడ్లపైకి వస్తుంది. దీంతో పాటు కొత్తసీఆర్-వీ, సివిక్ సెడాన్‌లో పాటు మరో మూడు ప్రొడక్టులనువచ్చే మూడు సంవత్సరాల్లో మార్కెట్లో విడుదల చేయడం జరుగుతుంది. వచ్చే మూడు సంవ త్సరాల్లో భారత్ మార్కెట్ కోసం మొత్తం ఆరు మోడల్స్‌ను విడుదల చేస్తామని చెప్పిన మాటకు కట్టుబడి 2018-19 ఆర్థిక సంవత్సరానికి మూడు మోడల్స్‌ను విడుదల చేస్తామని కంపెనీ ప్రెసిడెంట్, రెప్రెంజెటెటివ్ డైరెక్టర్ లాకాహీరో హచిగో చెప్పారు.

కియా మోటార్స్ ఆవిష్కరణ

దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ బుధవారం నాడు వివిధ మోడల్స్‌ను ఆటోఎక్స్ 2018లో ప్రదర్శనకు ఉంచింది. వాటిలో కాంపాక్ట్ ఎలక్ట్రిక్ వాహనాలున్నాయి. ఇవి 2019-2021 మధ్య దేశీయ మార్కెట్లో విడుదల చేస్తాయి. ఎస్‌పీ కాన్సెప్ట్ ఎస్‌యూవీని భారత్ మార్కెట్ కోసం డిజిఐన్ చేసినట్లు కియా మోటార్స్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ సీఈవో హన్ కూ పార్కు ఆటోఎక్స్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఎస్‌పీ కాన్సెప్ట్ ఎస్‌యూవీ ఆంధ్రప్రదేశ్‌లో ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తున్నట్లు దీని కోసం 100 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టామని.. ఏడా దికి మూ డు లక్షల యూ నిట్ల ఉత్పత్తి జరుగు తుం దన్నారు. 2019-21 వరకు భారతీయ మార్కెట్ల కోసం హెచ్‌బ్యాక్ నుంచి ఎస్ యూవీల వరకు వాహనాలను మార్కెట్లో విడుదల చేస్తామన్నారు.



రెనో నుంచి 2 ఈవీకార్లు

ఫ్రెంచి ఆటో దిగ్గజం రెనో ఇండియా ఎలక్ట్రిక్ కాన్సెప్ట్‌కార్లు ట్రెజోర్, జోఈ ఈ-స్పోర్ట్‌ను ఇక్కడ ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచింది. ప్రభుత్వం నుంచి ఎలక్ట్రిక్ కార్ల విధానంపై స్పష్టం వస్తే మార్కెట్లో విడుదల చేస్తామని కంపెనీ ఇండియా సీఈవో, ఎండీ సుమిత్ సహానే చెప్పారు. ఫార్ములా వన్ కారు ఆర్‌ఎస్ 17తో పాటు రెనోస్పోర్ట్ ఫార్మా వన్ టీమ్‌ను ప్రదర్శనకు ఉంచింది. వీటితో పాటు వివిధరకాల కార్లు క్విడ్ సూపర్ హీరో ఎడిషన్‌ను కూడా ప్రదర్శనకు ఉంచింది.

మెర్సిడెజ్ బెంజ్ మేబాచ్ ఎస్650 ధర రూ.2.73 కోట్లు

జర్మనీకి చెందిన లగర్జీ కార్ల తయారీ కంపెనీ మెర్సిడెజ్ బెంజ్ మేబాచ్ ఎస్ 650ను బుధవారం నాడు మార్కెట్లో విడుదల చేసింది దీని ప్రారంభ ధర రూ.2.73కోట్లు. దీంతో పాటు ఆటోషోలో 2018 భవిష్యత్తులో విడుదల చేసే ఎలక్ట్రిక్ వాహనం కాన్సెప్ట్ ఈక్యూను ప్రదర్శనకు ఉంచింది. ఇక మేబ్యాచ్ రెండు వెర్షన్‌లలో వస్తోంది ఒకటి ఎస్650 ధర రూ.2.73 కోట్లు, రెండో మేబాచ్ ఎస్ 650 ధర రూ. 1.94 కోట్లు. కాగా భారత్ లగ్జరీ మార్కెట్లో మెర్సిడెజ్ బెంజ్ నెంబర్ వన్ స్థానంలో ఉందని కంపెనీ ఎండీ, సీఈవో రోలాండ్ ఫోల్గర్ చెప్పారు. రాబోయే ప్రొడక్టులను ఆటోఎక్స్‌లో ప్రదర్శించడానికి ఇది చక్కటి వేదిక అని ఆయన అన్నారు.

ఫియాజీ నుంచి ఏప్రిల్లా

ఇటాలియన్ ఆటో తయారీ కంపెనీ ఫియాజీ బుధవారం నాడు 125 సీసీ బైక్ ఏప్రిల్లా ఎస్‌ఆర్ 125సీసీ బైక్‌ను ఇక్కడ ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచింది. దీని ధర ఎక్స్‌షోరూం పూనే రూ.65, 310గా నిర్ణయిం చింది. ఇక్కడ వెస్పా స్కూ టర్ తో పాటు వెస్పా జీటీఎస్, ట్యూనో 150తో పాటు ఈ- స్కూటర్ ఎలక్ట్రికాను ఆటో ఎక్స్‌పో ప్రదర్శనలో ఉం చింది.

2020 నాటికి పది లక్షల బైక్‌ల విక్రయం లక్ష్యం

సుజుకి మోటార్ సైకిల్ ఇండియా 2020 నాటికి మిలియన్ బైక్‌లు లేదా పది లక్షల యూనిట్లను విక్రయిస్తామని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ద్విచక్ర వాహ నాల అమ్మకాల్లో సుజుకి దూసుకుపోతోందని.. భారత్ మార్కెట్లో మరిన్ని మోడ ల్స్‌ను విడుదల చేస్తామని పెద్దమొత్తంలో పెట్టుబడులు కూడా పెడుతామనారు.

హ్యుందాయ్ కొత్త ఎలైట్ ఐ20 ధర రూ.5. 34 లక్షలు

దక్షిణ కొరియాకు చెందిన ఆటోతయారీ కంపెనీ హ్యుందాయ్ కొత్త వెర్షన్ ప్రీమి యం వెర్షన్ కాంపాక్ట్‌హెచ్‌బ్యాక్ ఎలైట్ ఐ20ని బుధవారం నాడు ఆవిష్కరించింది. దీని ధర రూ.5.34 లక్షల నుంచి రూ.9.15 లక్షల వరక (ఎక్స్‌షో రూం ఢిల్లీ). దీంతో పాటు గ్లోబల్ ఎలక్ట్రిక్ వాహనం లోనిక్ ను కూడా ఆవిష్క రించింది. కొత్త ఎలైట్ 2018 దేశంలోని ఆర్‌అండ్‌డిలో దీనిపై పెద్దెత్తున ప్రయో గాలతో పాటు డిజైన్ చేసి ఇంటిరి యర్‌తో పాటు కొత్త లుక్స్‌తో మార్కెట్లో విడుదల చేశామని కంపెనీ ఎండీ సీఈవో వైకె కూ చెప్పారు. పెట్రోల్ వెర్షన్ ధర రూ. 5.34లక్షల నుంచిరూ.7.9 లక్షల వర కు డిజెల్ ధర రూ. 6.73 లక్షల నుంచి రూ. 9.15 లక్షల వరకు ఉంటుంది. ఈ కారుకు భద్ర తా ప్రమా ణాలు ఎక్కువగా పాటిం చారు. డ్యూ యెల్ ఎయిర్ బ్యాగ్‌ను అందు బాటులో ఉంచి నట్లు వివరించారు.







చురుకుగా ఓటర్ల నమోదు

• రేపు ప్రత్యేక కార్యక్రమం

ఆంధ్రప్రభ, హైదరాబాద్: భారత ఎన్నికల సంఘం పిలుపుమేరకు రాష్ట్రంలో ఓటర్ల నమోదు కార్యక్రమం చురుకుగా సాగుతోంది. ఈ నెల 14వరకు అభ్యంతరాలు, దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. అయితే ఈనెల 9న ప్రత్యేకంగా 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్ జాబితాలో చేర్చే కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ చేపడుతోంది. రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి పి విష్ణుదేవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సమన్వం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్నికల ప్రధానాధికారి అనూప్ సింగ్ పిలుపునిచ్చారు.

నిరుద్యోగులకు కాంగ్రెస్ ద్రోహం

• టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రాన్ని అస్థిరపర్చే కుట్రతో కాంగ్రెస్ పదేపదే అబద్ధాలను చెబుతూ దివాళాకోరు రాజకీయాలు చేస్తున్నదని, తెలంగాణ నిరుద్యోగులను మోసగించింది కాంగ్రెస్సేనని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజమెత్తారు. బుధవారం టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేండ్లకాలంలో నిరుద్యోగులను పట్టించుకోకుండా వారి ఉసురుపోసుకున్న కాంగ్రెస్ ఇపుడు ఉద్యోగనియామకాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ళ కాలంలోనే 81,739ఉద్యోగ నియామకాల ప్రక్రియ చేపట్టిన సిఎం కెసిఆర్‌పై అవాకులు చెవాకులు పేలడం కాంగ్రెస్ దుష్టరాజకీయాలకు పరాకాష్ట అన్నారు. ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ విడుదల కాగానే కాంగ్రెస్ పార్టీ అనుబంధ న్యాయవిభాగానికి చెందిన లాయర్లతో తప్పుడు కేసులు వేయిస్తున్న చరిత్ర కాంగ్రెస్ నాయకులదన్నారు. కాంగ్రెస్ ఏ యాత్ర చేసినా.. నిరుద్యోగులు నమ్మరన్నారు.

బీమా సంస్థకు టోకరా

ముగ్గురు అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బీమా సంస్థను మోసగించిన ఓ వ్యక్తితో పాటు అతడికి సహకరించిన మరో ముగ్గురిని హైదరాబాద్ సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్ట్‌చేశారు. వివరాల్లోకి వెళితే.. సదరు వ్యక్తి బీమా సొమ్ము కోసం నకిలీ పత్రాలను సృష్టించాడు. అనుకున్నట్లుగానే సొమ్ము చేసుకున్నాడు. ఎల్ఐసీ అధికారుల విచారణలో విషయం బహిర్గతమైంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రధాన నిందితుడు అరిపిరాల రవిశంకర్ శర్మ ప్రకాశం జిల్లాలో ఎల్ఐసీలో బీమా చేయించుకుని దానిని హైదరాబాద్ పుత్లీబౌలి బ్రాంచ్‌కు బదిలీ చేయించుకున్నాడు. ఇదే మాదిరిగా మరో మూడు పాలసీలు చేయించుకున్నాడు. అయితే, సొమ్ము కోసం తాను చనిపోయినట్లు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి బీమా సొమ్మును కాజేశాడు. మరోసారి తాను చనిపోయినట్లు మరణ ధ్రువీకరణ పత్రాన్ని తయారు చేయించుకుని అతడి భార్య ఉషశ్రీ ద్వారా బీమా సొమ్మును తెప్పించుకున్నాడు. కాగా, ఒకే మరణ ధ్రువపత్రాన్ని వేర్వేరు సమయాల్లో లబ్ది పొందడానికి ఉపయోగించుకోవడంతో ఎల్ఐసి అధికారులకు అనుమానమొచ్చింది. దీంతో పూర్తిస్థాయి విచారణ జరిపగా వీరి విచారణలో రవి శంకర్ వర్మ జీవించి ఉన్నాడని తేటతెల్లమైంది. డబ్బుల కోసం కావాలనే చనిపోయినట్లుగా పత్రాలు సృష్టించి మోసం చేశాడని ఎల్ఐసీ గుర్తించింది. ఈ విషయంపై అధికారులు సుల్తాన్ బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదునందుకున్న పోలీసులు రంగంలోకి దిగి నిందితుడు రవిశంకర్‌శర్మ, అతడి భార్య ఉషశ్రీ, నకిలీ ధ్రువపత్రాల జారీకి సహకరించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాజా అరీఫుద్దీన్, ముజీబుల్లాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

10న పీజీటీ సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ అధ్వర్యంలో నిర్వహించబడుతున్న తెలంగాణ బాలుర, బాలికల పాఠశాలలోనికి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపిక కాబడిన పిజిటి (తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్) అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, తదుపరి పోస్టింగ్ ఉత్తర్వుల కోసం ఈ నెల 10న ఉదయం 9.30 గంటలకు సంస్థ ప్రధాన కార్యాలయం, తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ, గగన్ విహార్, 4వ అంతస్తు, ఎం.జే.రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌కు హాజరు కావలసిందిగా సంస్థ కార్యదర్శి ఎ. సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

జామియా నిజామియా యూనివర్సిటీని సందర్శించిన ఎ.కె. ఖాన్

మైనారిటీ సంక్షేమ శాఖ సలహాదారు ఎ.కె. ఖాన్ బుధవారం పాతబస్తీలోని జామియా నిజామియా యూనివర్సిటీ ప్రాంగణాన్ని సందర్శించారు. అక్కడ రూ. 14.65 కోట్లతో నిర్మిస్తున్న ఆడిటోరియం పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. జామియా నిజామియా యూనివర్సిటీ డిగ్రీ కోర్సులను ఇతర యూనివర్సిటీ డిగ్రీ కోర్సులతో సమానంగా పరిగణించడం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు తెలియచేశారని ఎ.కె. ఖాన్ తెలిపారు. యూనివర్సిటీ ఛాన్సిలర్ నిజామోద్దీన్ హుస్సేన్ సాబిరీతో పాటు విశ్వవిద్యాలయం అధ్యపక సిబ్బంది ఎ.కె. ఖాన్ పర్యటనలో ఉన్నారు.

మేడారంలో

తిరుగువారం పూజలు



భూపాలపల్లి, ప్రభన్యూస్ : మేడారంలో సమ్మక్క - సారలమ్మ తల్లులకు బుధవారం తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. జనవరి 31 నుండి ఫిబ్రవరి 3వ తేదీ వరకు మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర కుంభమేళాను మరిపించే విధంగా వైభవోపేతంగా జరిగింది. గిరిజన సంప్రదాయాల ప్రకారం గిరిజన పూజారులు నాలుగు రోజుల పాటు పూజలు నిర్వహించారు. ఈ సారి మేడారం జాతరకు కోటి 30 లక్షల మంది భక్తులు దేశంలోని నలుమూలల నుంచి హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. గుడిమెలిగే పండుగ నుంచి తల్లుల వన ప్రవేశం అయ్యేంత వరకు తల్లులకు పూజలు నిర్వహించిన పూజారులు బుధవారం తిరుగువారం పండుగను నిర్వహించారు. తిరుగువారం పండుగతో మేడారం మహా జాతర గిరిజన సంప్రదాయాల ప్రకారం పరిసమాప్తం అయినట్లు లెక్క. తిరుగువారం పూజలు నిర్వహిస్తున్న సమయంలో గిరిజన పూజారులు సమ్మక్క -సారలమ్మ తల్లులకు ప్రత్యేక పూజలు చేయడమే కాకుంగా జాతరకు వచ్చిన భక్తులందరూ చల్లగా ఉండే విధంగా ఉండేలా చూడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, మళ్ళీవచ్చే జాతరకు భక్తులు తిరిగి వచ్చే విధంగా అనుగ్రహించాలని భక్తుల తరుపున పూజారులు తల్లులను ప్రార్థించారు.

సమ్మక్క ఆలయంలో ప్రత్యేక పూజలు

మేడారంలోని సమ్మక్క గుడిని పూజారులు నీటితో శుద్ధి చేయగా, మహిళలు ముగ్గులు వేసి తల్లికి దీప దూపాలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. జంతు బలిచ్చి నైవేద్యంగా సమర్పించారు. మేడారం సమీపంలోని కన్నెపల్లి సారలమ్మ ఆలయంలోకూడా పూజారులు తిరుగువారం పండుగను నిర్వహించారు. ప్రధాన పూజారి కాక సారయ్య సారలమ్మ తల్లి పూజా సామాగ్రిని శుద్ధి చేశారు. వడేరాల కుండను పసుపు కుంకుమలతో అలంకరించి సారలమ్మకు దూప దీపాలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మేడారం జాతర వేడుకల్లో పాల్గొన్న పూజారులందరు తిరుగువారం వేడుకలు పూర్తి కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. జాతర ముగిసి నాలుగు రోజులు అవుతున్న మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరకు భక్తు తాకిడి కొన సాగుతూనే ఉంది. మేడారానికి వచ్చిన భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసి తల్లులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. బుధవారం తిరుగువారం కావడంతో నలభై నుంచి యాభై వేల వరకు భక్తులు తల్లుల దర్శనానికి వచ్చారు.

మేడారం హుండీల లెక్కింపు

సమ్మక్క-సారలమ్మ హుండీలకు సంబంధించిన లెక్కింపులు హన్మకొండలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో రెండు రోజులుగా కొనసాగుతున్నది. మొత్తం హుండీలు 453 ఐరన్ హుండీలు కాగా 24 క్లాత్ హుండీలు ,3 ఒడిబియ్యం హుండీలు ,రెండవ రోజు వరకు 202 హుండీలు పూర్తిగా లెక్కింపు కాగా రూ.4.87 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ హుండీలలో పలు దేశాల కరెన్సీ లభ్యమైంది. బంగారం, వెండి ఆభరణాలు కూడా హుండీలలో లభించాయి. గత జాతరలో హుండీల ద్వారా వచ్చిన ఆదాయం 8.95 కోట్లు కాగా, ఈ సారీ మరో రెండుమూడు కోట్లు అదనంగా వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

మత్స్యకారులకు సామాజిక న్యాయం



● వృత్తి నైపుణ్యత, మార్కెటింగ్‌పై హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు ● మార్చి 15 నుంచి మూడు రోజులు హెచ్ఐసీసీలో నిర్వహణ: మంత్రి తలసాని

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులందరికీ శాశ్వత ఉపాధి మార్గాలను చూపేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వృత్తిని పరిరక్షించడమే కాదు, లాభదాయంగా చేసి లక్షలాది కుటుంబాల ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. మత్స్యకారులను సామాజ్ంగా కూడా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పాన్ని నెరవేర్చేందుకు వారిలో వృత్తి నైపుణ్యతను పెంపొందించేందుకు, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరిచేందుకు మార్చి 15 నుంచి 18 వరకు హెచ్ఐసిసిలో అంతర్జాతీయ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై బుధవారం సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా ప్రతినిధుల సమావేశంలో తలసాని మాట్లాడుతూ, ఆక్వాక్స్ ఇండియా - 2018 పేరుతో ఈ సదస్సును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ ఆక్వాకల్చర్ ఆర్గనైజేషన్ సహకారంతో తెలంగాణ ప్రభుత్వం మరింత మెరుగైన మత్స్య సహకార వ్యవస్థను నెలకొల్పబోతోందన్నారు. మత్స్య పరిశ్రమ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందిన సాంకేతిక విధానాలు, కొత్త జాతి చేపలు, వాటి ఉత్పత్తి విధానం, యంత్ర సామాగ్రి, మార్కెటింగ్ పద్దతులు, మానవ వనరుల వినియోగం తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దక్షిణాసియా దేశాల్లోనే ప్రప్రథమంగా ఆక్వాక్స్ ఇండియా సదస్సు జరుగుతుందన్నారు. 25 దేశాల నుంచి వివిధ కంపెనీల ప్రతినిధులు, మార్కెటింగ్ నిపుణులు, ప్రఖ్యాత శాస్త్రవేత్తలు ఈ సదస్సులో ప్రసంగిస్తారని మంత్రి తలసాని వెల్లడించారు. భారతదేశ వ్యాప్తంగా 14.5 మిలియన్ల ప్రజలు మత్స్య రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. అలాగే 10.8 మిలియన్ టన్నుల చేపలు, రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ మత్స్య ఉత్పత్తిలో 60శాతం వాటా కలిగిఉన్న చైనా తర్వాత మన దేశానికి రెండోస్థానం ఉందన్నారు. చేపలు, రొయ్యలతో చేసిన ఆహార పదార్థాలు మనిషి ఆరోగ్య పరిరక్షణలో ఎంతో కీలకమని అంతర్జాతీయ స్థాయి అధ్యయనాలు, పరిశోధనల్లోనూ వెల్లడైందన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణాలో చేపడుతున్న మత్స్యరంగ అభివృద్ధి కార్యక్రమాలు, చేయూత కారణంగా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. గత ఏడాది 22 కోట్లు, ఈ ఏడాది 52 కోట్ల చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేసి చరిత్ర సృష్టించామన్నారు. సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా సుమారు రూ.1000 కోట్ల నిధులను ఖర్చు చేశామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మత్స్యశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు తాఖీదులు

- పాత బకాయిల వసూళ్లకు సిద్ధమైన బ్యాంకర్లు
- టెస్కాబ్ ఆదేశాలతో రంగంలోకి వ్యవసాయ పరపతి సంఘాలు
- ఆందోళన చెందుతున్న రైతులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నాలుగు విడతలుగా రూ.17వేల కోట్ల రైతుల బకాయిల మొత్తాన్ని రద్దుచేసిన తెలంగాణ ప్రభుత్వం హామీని నిలబెట్టుకున్నప్పటికీ, మిగిలి ఉన్న మొత్తాన్ని రాబట్టేందుకు బ్యాంకర్లు రంగం సిద్ధంచేశారు. ఒక్కో రైతుపై గరిష్టంగా రూ.లక్ష వరకు రుణ మాఫీ జరిగినప్పటికీ మిగతా మొత్తం ఇప్పటికీ ఆయా బ్యాంకుల్లో బకాయిపడి ఉన్నారు. ప్రభుత్వ హామీతో గత ఏడాది కాలంగా ఈ మొత్తాన్ని వసూలు చేయడాన్ని నిలిపివేసిన ఆయా బ్యాంకులు ఈ ఏడాది ఎలాగైనా రాబట్టాలన్న దిశగా చర్యలు ప్రారంభించాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు మొదలుకొని గ్రామీణ, వాణిజ్య బ్యాంకులు కూడా నోటీసులు జారీచేసే ప్రక్రియను ప్రారంభించాయి. వారం రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు (టెస్కాబ్) జారీచేసిన అంతర్గత ఆదేశాల మేరకు పరపతి సంఘాలు రైతులకు నోటీసులందిస్తున్నాయి. ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా వ్యవసాయ రంగానికి సహాయ సహకారాలు అందుతున్నప్పటికీ బ్యాంకుల నిబంధనల ప్రకారం మిగిలి ఉన్న మొత్తాలను రాబట్టడం కొత్త సమస్యగా తయారవుతోంది. చాలా మంది రైతులు డిఫాల్టర్లుగా మిగిలినందున ప్రస్తుత రబీ సీజన్‌లో ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యంలో 40శాతం పంట రుణాలు మాత్రమే వితరణ జరిగాయి. రబీలో మొత్తం రూ.789 కోట్ల పంట రుణాలు ఇవ్వాలనుకుంటే రైతులకు అందింది కేవలం రూ.373 కోట్లు మాత్రమే. అలాగే 2017-18లో రుణ లక్ష్యాలు పూర్తికాలేదు. రూ.1400 కోట్ల పంట రుణాలు ఇప్పించాలన్న ప్రభుత్వ అంచనాలు తారుమారయ్యాయి. అయినా రుణమాఫీ నిధులు విడుదలచేసే సందర్భంలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు రుణలక్ష్యం రూ.1287 కోట్లకు చేరుకోగలిగారు. ఈ రెండు సీజన్లలో కలిపి రూ.2189 కోట్ల వ్యవసాయ రుణాలు ఇవ్వాలనుకుంటే రూ.1,681 కోట్లు మాత్రమే ఇచ్చినట్లు రికార్డుల ద్వారా స్పష్టమవుతోంది. ప్రస్తుతం పాత బకాయిల వసూళ్ళ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో వచ్చే ఖరీఫ్ పరిస్థితి ఆందోళనకరంగా కనిపిస్తోంది. డిఫాల్టర్లుగా ధృవీకరించిన వారిలో దాదాపు 90శాతం రైతులు ఆ మొత్తాలను చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నారు.

మహా శివరాత్రిపై మీమాంస

హైదరాబాద్, ప్రభ న్యూస్: హైంధవ పండుగలలో అత్యంత ప్రధానమైన పండుగ మహాశివరాత్రి. మహాశివ రాత్రి రోజున కఠిన ఉపవాసం చేసి ఆ పరమ శివుణ్ణి పూజిస్తే జన్మజన్మల పుణ్య ఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. అయితే ఈ ఏడాది వచ్చే మహాశివ రాత్రి ఎప్పుడు జరుపుకోవాలనే దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఫిబ్రవరి13వ తేదీ అని, మరికొందరు 14వ తేదీ అని చెబుతున్నారు. అసలు పురాణాల ప్రకారం మాఘమాసం కృష్ణపక్షంలో అర్ధరాత్రి ఉండే చతుర్ధశి తిథినాడు వస్తుంది. చతుర్ధశి తిథి భోళా శంకరుడికి ఎంతో ప్రీతికరమైంది. శివరాత్రులు నిత్య శివరాత్రి, పక్షశివరాత్రి, మాసశివరాత్రి, మహాశివరాత్రి, యోగశివరాత్రి, నిత్య శివ రాత్రి అంటే ప్రతిరోజూ రాత్రి చేసే శివారాధన. పక్షశివరాత్రి అంటే 15రోజుల కోసారి రాత్రిపూట చేసే శివార్చన. వివాదం ఏర్పడినప్పుడు సామాన్య నియమాలు బలీయమైనవన్న విషయాన్ని గుర్తించి, నిర్ణయించాలి, ధర్మ సింధు, నిర్ణయ సింధు, భగవాన్ శ్రీ వ్యాసోక్త పురాణ గ్రంథాలు శివరాత్రి విషయంలో విశేష నియమాన్ని ఇలా చెబుతున్నారు.

13నే మహాశివరాత్రి

ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయంలో 13వ తేదీన మహా శివరాత్రిని జరుపుతున్నారు. అయితే దాన్ని అనుసరించే ఈ పండుగను జరుపుకోవల్సి ఉంటుందని వేద పండితులు వెల్లడిస్తున్నారు. శ్రీశైలం మహాక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు 6వ తేదీ నుంచి ఫిబ్రవరి16వ తేదీ వరకు జరగనున్నాయి.

14 నుంచి 'మైనింగ్ టుడే'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ నగరంలో మరో ప్రముఖ సదస్సుకు వేదిక కాబోతున్నది. మైనింగ్ టుడే కార్యక్రమం నగరంలో జరగనుంది. ఈ అంతర్జాతీయ కాన్ఫరెన్సు మరియు ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో మైనింగ్ మెషినరీ అసోసియేషన్ అఫ్ ఇండియా(ఎంఈఐఏ), ఫిక్కి కలిసి నిర్వహిస్తున్నాయి. టెక్నాలజీ, ఎక్విప్‌మెంట్, మేషినరీ, పాలసీ, ఒవర్‌సీస్(టెంపో)థీమ్‌తో ఈ సమావేశం జరుగుతుంది. హైటెక్స్‌లో ఈనెల 14నుచి17 వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. దేశ ఆర్థిక ప్రగతిని బలోపేతం చేసేందుకు మైనింగ్ ఒక కీలకమైన అంశం అని, పవర్, సిమెంట్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఆయిల్, గ్యాస్ వంటి రంగాలను ప్రభావితం చేసే పలు అంశాలను ఈ సదస్సులో చర్చించనున్నారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ఖనిజాల అన్వేషణలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞాన మార్పులపైన ప్రధానంగా ఈ సమావేశంలో చర్చ జరగనుంది. మైనింగ్ సాంకేతిక పరిజ్ఞాన అంశంలో గనుల గుర్తింపులో రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ల వినియోగం, గనులకు రేటింగ్ ఇవ్వడం, గనుల పర్యవేక్షణ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలపైన వివిధ దేశాల నుంచి వచ్చే నిపుణులు చర్చిస్తారు. ఇసుక ప్రొక్యూర్ విధానాల అధ్యయనంలో భాగంగా బీచ్ సాండ్, రివర్ సాండ్, క్రష్డ స్టోన్ సాండ్(రాతి ఇసుక) అంశాలను ప్రత్యేకంగా చర్చిస్తారు. మైనింగ్ దాని అనుబంధ రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహిస్తారు. సమావేశాలకు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఆసియా, ఆఫ్రికా దేశాల ప్రతినిధులు హాజరవుతారు. గనుల శాఖాధికారుల 2018డైరీని మంత్రి కేటీఆర్ బుధవారం బేగంపేట క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. గనులశాఖ డైరెక్టర్ సుశీల్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

9న అగ్రిటెక్ సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ మహానగరం మరో ప్రముఖ సదస్సుకు వేదిక కానుంది. రాష్ట్ర రైతుల్లో పంటల సాగు,నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు దక్షిణాది రాష్ట్రాల అగ్రిటెక్ 2018 సదస్సును ఈ నెల 9 నుంచి 11 వరకు నగరంలో నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ వి ప్రవీణ్‌రావు వెల్లడించారు. బుధవారం ఇక్కడ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) చైర్మన్ అనిల్‌కుమార్ వి ఏపూర్, వైస్ చైర్మన్ సంజయ్ సింగ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు కె విజయకుమార్‌తో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులో స్మార్ట్ అండ్ సుస్థిర వ్యవసాయం అనే అంశంపై వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ,మూడురోజుల పాటు జరిగే ఈ ఇగ్రిటెక్‌ను శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రారంభిస్తారని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర , కేరళకు చెందిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను నివేదికగా రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు చెప్పారు. సీఐఐ చైర్మన్ అనిల్‌కుమార్ వేపూర్ మాట్లాడుతూ, వ్యవసాయరంగం అభివృద్ధికోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ 7 అంశాలను రూపొందించారని, వాటి ప్రాతిపధికగా ఈ రంగం లాభసాటిగా మార్చేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలి

ఉద్యోగులకు ఈటల పిలుపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఉద్యమంలో ఎలా పని చేశామో మంత్రులుగా కూడా అదే అంకితభావంతో పని చేస్తున్నమని, ఉద్యోగులు కూడా అదే స్ఫూర్తితో పని చేయాలని ఉద్యోగులకు ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సూచించారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ట్రెజరీ శాఖ ఉద్యోగుల డైరీని ఈటల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న పథకాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని, దీనిని బాధ్యతగా తీసుకోవాలని కోరారు. రాజకీయ వ్యవస్థ, ఉద్యోగుల సమన్వయంతోనే అనుకున్న లక్ష్యాలు సాధించగలమన్నారు. ఉద్యోగం జీతం కోసం కాకుండా ప్రజలకు సేవ చేస్తున్నామని భావించాలని సూచించారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఆలోచనలతో రాష్ట్రం ప్రగతిపథంలో ముందుకు సాగుతోందన్నారు.అనేక కార్యక్రమాల్లో దేశంలోనే నంబర్ 1 స్థానంలో ఉన్నామని, అందుకు చిత్తశుద్ధి, అంకితభావంతో కార్యక్రమాలను అమలు చేయడమే కారణమని అన్నారు. దేశంలో అగ్రస్థానంలో ఉండడమనేది కొనుక్కుంటే వచ్చేది కాదనీ,పైరవీలతో అసలు రాదనీ, అన్నిఅంశాలను పరిశీలించిన తర్వాతనే స్థానాలను ప్రకటిస్తారని చెప్పారు.

ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో షీ టాయిలెట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నగరంలో షీ ఇ - టాయిలెట్ల నిర్మాణానికి నేషనల్ థర్మల్ పవర్ కార్పోరేషన్ (ఎన్‌టీపీసీ) ముందుకు వచ్చింది. అందులో భాగంగా ఇందిరాపార్కు, భోలక్‌పూర్‌లో రెండు టాయిలెట్ల నిర్మాణానికి రూ.14,61,000 లక్షల చెక్కును సంస్థ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఆర్‌సి మూర్తి (సౌత్) బుధవారం జీహెచ్‌ఎంసీ అదనపు కమీషనర్ బి మనోహర్‌కు అందజేశారు. ఎన్టీపీసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో తమ వంతుగా పాల్గొంటున్నామని కేఆర్‌సి మూర్తి తెలిపారు. జంట నగరాల్లోని పాఠశాలల్లో 20 టాయిలెట్లను నిర్మించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎంబీ ఎల్బర్ట్ చూట్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ స్కీంలో సవరణలు చేయండి

బొగ్గు శాఖా మంత్రికి సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ వినతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం -1998లో సవరణలు చేసిన రిటైరైన 5లక్షల మందికి లబ్దిచేకూరే విధంగా పెన్షన్ స్కీంలో సవరణలు వర్తింపజేయాలని కేంద్ర బొగ్గుశాఖ మంత్రి పీయూష్‌గోయల్‌కు సింగరేణి రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్, కోల్‌మైన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ బృందం బుధవారం విజ్ఞప్తి చేసింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని ప్రతినిధి బృందం మంత్రిని కోరింది. మంత్రిని కలిసిన వారిలో సంఘ నేతలు జె.వి. దత్తాత్రేయులు, కెఆర్‌సిరెడ్డి, ఎ.వి. సత్యలింగం, జె.రామకృష్ణలు ఉన్నారు.

రైతుల కోసం ప్రభుత్వ పథకాలు భేష్

పంజాబ్ మార్కెటింగ్ అధికారుల కితాబు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రైతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని పంజాబ్ రాష్ట్ర మార్కెంట్ బోర్డు అధికారులు కితాబిచ్చారు. ఈ విధానాన్ని తమ రాష్ట్రంలోనూ అమలు చేయనున్నట్లు ఆ రాష్ట్ర అధికారులు తెలిపారు. వ్యవసాయ మార్కెంట్ శాఖలో అమలవుతున్న ఈనామ్ విధానం, రైతులు పండించిన పంటలను గోడౌన్లలో నిల్వ చేయడం తదితర అంశాలపై పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ కార్యదర్శి పార్థసారథితో పంజాబ్ మార్కెటింగ్ బోర్డు చైర్మన్ లాల్‌సింగ్, అధికారులు విశ్వజిత్ ఖన్నా, అమిత్ ధాఖా, దల్‌విందర్‌జిత్‌సింగ్, కుల్‌దీప్ సింగ్ తదితరులు సమావేశమయ్యారు. అంతకు ముందు సూర్యాపేట మార్కెట్‌ను పరిశీలించారు. మొబైల్ యాప్, గేట్ ఎంట్రీ కౌంటర్లు, షెడ్డు మధ్యలో కౌంటర్ల ఏర్పాటు, మార్కెట్ యార్డులో రైతులు, వ్యాపారస్తులతో పాటు కమీషన్ ఏజెంట్ల సమస్యలను తెలుసుకున్నట్లు వివరించారు.

తెలుగు జీవోలకు ప్రాధాన్యత ఇవ్వండి

- సీఎస్ డాక్టర్ ఎస్.కె. జోషి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి , సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు చేరాలని, అందుకు గానూ అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కె శైలేంద్రజోషీ కోరారు. ప్రభుత్వం జారీ చేస్తున్న జీవోలను వీలైనంత వరకు తెలుగులోనే ఇచ్చేందుకు కృషి చేయాలని ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఆర్థిక, రెవెన్యూ, వ్యవసాయం, అనుబంధ రంగాలు, ప్రణాళిక, జీఏడీ, హోం, న్యాయ, పరిశ్రమలు, ఐటి,అటవీ, పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలు, శాఖలమధ్య సమన్వయం, లక్ష్యాలు తదితర అంశాలపై చర్చించారు. వ్యవసాయం అనుబంధ రంగాలకు సంబంధించి రాష్ట్రంలో పంటల సాగు, ఉత్పత్తి, నీటివసతి, పాల ఉత్పత్తి, చేపల పెంపకం, ఎరువులు ,విత్తనాలు పంపిణీ, పశుగ్రాసం, ఉత్పాదకత, గుడ్లు, మాంసంపై అంశాలపై అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయం, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా పంటల సాగుపై కార్యాచరణ రూపొందించుకోవాలని కోరారు. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా తక్కువ నీటితోనే ఎక్కువ ఉత్పత్తి సాధించవచ్చన్నారు. అటవీ శాఖపై చర్చ సందర్భంగా భూగర్భ జలమట్టం, అడవుల విస్తీర్ణం, ఫారెస్ట్ కార్పోరేషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించారు. డీ గ్రేడ్ ఏజెన్సీలో మొక్కలు నాటాలని, హరితహారం కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సీఎస్ కోరారు. రోడ్ల భద్రతపై చర్చ సందర్భంగా ప్రమాదాల నివారణకు కృషి చెయ్యాలని కోరారు. టెక్స్ టైల్ పార్కు, ఫార్మాసిటీ, నిమ్జ్ , పారిశ్రామిక క్లస్టర్, టీఎస్ -ఐ పాస్, ఈఓడీబీ, ఫుడ్ ప్రాసెసింగ్, జినోం వ్యాలీ, లెదర్ పార్కు, ఎంఎస్‌ఎంఇ, ఫైబర్ నెట్ వర్కు, ఇ ప్రొక్యూర్‌మెంట్ ప్రగతిని ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ఐటీ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలన్నారు.

ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్‌డేట్ చేయాలని కోరారు.మీ సేవా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, ముఖ్య కార్యదర్శులు అధర్ సిన్హా, కె రామకృష్ణారావు, సోమేష్‌కుమార్, రజత్‌కుమార్, రాజీవ్ త్రివేదీ, వికాస్ రాజ్, జయేష్ రంజన్, శాలినీ మిశ్రా, కార్యదర్శులు శ్రీలక్ష్మి, సందీప్‌కుమార్ సుల్తానియా, శివశంకర్, పార్థసారథి, నదీమ్ అహ్మద్, ఆర్‌వి చంద్రవదన్, పీసీసీఎఫ్ పీకే ఝా, పోలీస్ ఉన్నతాధికారులు అంజనీకుమార్, తేజ్ దీప్ కౌర్ మీనన్, సీవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

యూనిట్ రూ. 2కే సంప్రదాయ విద్యుత్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సౌర, పవనవిద్యుత్ ఛార్జీలు రానున్న రెండు, మూడేళ్ళలో యూనిట్‌కు రూ.2కే దిగివస్తాయని స్టెర్‌లైట్ పవర్ అంచనా వేస్తోంది. సోలార్ పవర్ ప్రస్తుతం యూనిట్ ధర రూ.2.4కు చేరగా, పవన విద్యుత్ యూనిట్‌కు రూ.2.5గా ఉందని, రానున్న రోజుల్లో ఇది మరింత తగ్గుతుందని స్టెర్‌లైట్ పవర్ సిఈవో వేద్ తివారి తెలిపారు. సోలార్ పవర్ టారిఫ్ రాజస్థాన్‌లో యూనిట్‌కు రూ.2.44కే ఉత్పత్తి చేసేలా 500మెగావాట్లసామర్థ్యం గలకేంద్రానికి వేలం కూడా జరిగిందన్నారు. రానున్న రోజుల్లో సోలార్, పవన విద్యుత్ ఛార్జీలను మరింత తగ్గిస్తుందన్నారు.

ఎల్‌ఈడీలతో వెలిగిపోతున్న ద.మ. రైల్వే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని స్టేషన్‌లో 100 శాతం ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేశారు. ఈ విధంగా పూర్తి స్థాయిలో ఎల్ఇడి బల్బులను ఏర్పాటు చేయడం భారత రైల్వేలలో దక్షిణ మధ్య రైల్వే అగ్రగామిగా ఉంది. ఇంధన పొదుపులో దక్షిణ మధ్య రైల్వే రికార్డు సమయంలో ప్రగతిని సాధించింది. జోన్ పరిధిలోని అన్ని కార్యాలయాలు, స్టేషన్లలో పూర్తి స్థాయిలో ఎల్ఇడి లైట్లను అమర్చిన అధికారులు, సిబ్బందిని జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అభినందించారు. జోన్ పరిధిలోని 733 రైల్వే స్టేషన్లలో ఎల్ఇడి బల్బులను అమర్చడం జరిగింది. ఎల్ఇడి బల్బులను అమర్చడానికి 75,681 పాత బల్బులను తొలగించారు. సికింద్రాబాద్ డివిజన్‌లో 162 స్టేషన్లు, హైదరాబాద్‌లో 100, విజయవాడలో 158, గుంతకల్‌లో 157, గుంటూరులో 76, నాందేడ్ డివిజన్ పరిధిలోని 80 స్టేషన్లు ఎల్ఇడి బల్బులతో వెలిగిపోతున్నాయి.

వివిధ దూర ప్రాంతాలకు 58 వీక్లీ ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీ పెరగడంతో దక్షిణ మధ్య రైల్వే వివిధ దూర ప్రాంతాలకు 58 వీక్లీ ప్రత్యేక రైళ్లను నడిపించబోతుంది. చెన్నై - అహ్మదాబాద్ మధ్యన 26, ముంబాయి - చెన్నై మధ్యన 24, సాంత్రగచ్చి - చెన్నై మధ్యన 8 వీక్లీ రైళ్లను ప్రత్యేకంగా నడిపించబోతున్నామని ఒక ప్రకటనలో పేర్కొంది.

హైదరాబాద్ - కాకినాడ ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ - కాకినాడ మధ్యన ఈ నెల 9, 11 తేదీల్లో ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నారు. హైదరాబాద్ నుండి 9వ తేదీన ప్రత్యేక రైలు కాకినాడకు బయలుదేరనుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడలో 11న బయలుదేరి మరుసటి రోజు హైదరాబాద్‌కు చేరుకుంటుంది.

హైదరాబాద్ డివిజన్‌లో సాగుతున్న తనిఖీలు

దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని హైదరాబాద్ డివిజన్‌లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. బుకింగ్ కార్యాలయాలు, రిజర్వేషన్ కార్యాలయాలు, పార్శిల్ ఆఫీసుల్లో అక్రమాలను నివారించే విధంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

రైళ్లలో కూడా ప్రత్యేక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహిస్తు ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించడం జరుగుతుంది. ఇప్పటి వరకు 142 ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అవినీతి రహిత ప్రయాణికుల సేవలకు తనిఖీల్లో అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. ప్రయాణికులు ఫిర్యాదులు చేయడానికి 155210 నెంబర్‌ను వినియోగించుకోవాలని తనిఖీ అధికారులు కోరుతున్నారు.


టీఆర్టీసీపై బ్రిటీష్ ప్రతినిధుల ఆసక్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజా రవాణా వ్యవస్థలో అగ్రస్థానాన్ని ఏర్పరచుకుంటున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా అమలు పరుస్తున్న విధానాలపై బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ (హైదరాబాద్) ప్రతినిధులు ఆసక్తి కనబరిచారు. రవాణా సదుపాయాల కల్పనపై సంస్థాగతంగా తీసుకుంటున్న కార్యాచరణ అమలు విధానాలను వారు ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావుతో బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ (హైదరాబాద్) అండ్రివ్ ప్లెమింగ్ బస్ భవన్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సంస్థ చేపట్టిన నూతన ప్రాజెక్టుల అమలు తీరుతెన్నులను తెలుసుకోవడమే కాకుండా ప్రజా రవాణా సదుపాయాలపై చర్చించారు. ఎలక్ట్రిక్ బస్సులు, స్మార్డు కార్డు జారీ ప్రక్రియలతో పాటు విద్యుత్ ఆదా కోసం ఎల్ఇడి బల్బులు, సోలార్ ప్రాజెక్టు వంటి వాటిపై ప్రత్యేకంగా మేనేజింగ్ డైరెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు తమవంతు సహకారం తప్పనిసరిగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా సరికొత్త విధానాలను అమలులోకి తీసుకురావడం ఎంతైనా అభినందనీయమని ఆండ్రివ్ ఫ్లెమింగ్ కొనియాడారు. ఈ భేటీలో డిప్యూటీ హెడ్ ఆఫ్ మిషన్, హెడ్ ఆఫ్ ట్రేడ్, ఇన్‌వెస్టుమెంట్ అభిలాష్ పూజాకరా, ప్రవళిక ఇనాల కూడా పాల్గొన్నారు. ఆర్టీసీ చేపడుతున్న కొత్త పథకాలపై సంస్థ అధికారులకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు.

టీడీపీ -బీజేపీ లాలూచీ

- చర్చలన్నీ నాటకం
- కాంగ్రెస్ ఎంపీ కేవీపీ
- రాజ్యసభలోనూ గాంధీ విగ్రహం వద్ద ధర్నా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ ఎంపీ కెవిపి రామచంద్రరావు బుధవారం రాజ్యసభలో నిరసనకు దిగారు. చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. అయితే వెల్ నుంచి వెళ్లిపోవాలని పదే పదే చైర్మన్ వెంకయ్యనాయుడు సూచించారు. లేదంటే రాజ్యసభ నిబంధనల కింద చర్య తీసుకుంటామని హెచ్చరించారు. ఒక సభ్యుడు సభా కార్యక్రమాలను ఆటంకం కలిగించేందుకు అవకాశం కల్పిస్తే రేపు మరొకరు ఇదే పరిస్థితి సృష్టిస్తారని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. దాంతో ఎంపీ కెవిపి సభ నుంచి బయటకు వెళ్లి పార్లమెంటులోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కొనసాగించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సభలో ఉంటే కూర్చొమని లేదంటే వెళ్లిపోమని అన్నారని, దాంతో గాంధీ విగ్రహం వద్ద మౌన ప్రదర్శన నిర్వహించానని చెప్పారు. ఏపీకి న్యాయం చేయాలని గాంధీ ఆశీస్సులు తీసుకున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హేతుబద్ధగా విభజించలేదని ప్రధాని అనడం సరైందని కాదని, ప్రస్తుతం బిజెపి ఏం చేస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. తిరుపతి వెంకన్నసాక్షిగా మోడీ ఇచ్చిన హామీ ఏమైదని, నాలుగేళ్లయినా దానికి హేతుబద్ధత లేదా అని ప్రశ్నించారు. టిడిపి -బిజెపి చర్చలు కేవలం నాటకం మాత్రమేనని అన్నారు. సీఎం చంద్రబాబు మాటలకే పరిమితమయ్యారని, చేతల్లో ఏమి లేదని విమర్శించారు. ఎకనామిక్స్ చదివిన చంద్రబాబుకు , ఏపీకి బిజెపి ఏమిచ్చిందో తెలియాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. టిడిపి, బిజెపి వ్యవహారం లాలూచీలా కనపడుతోందన్నారు. ఏపీకి 53లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని టిడిపి చెప్పుకుంటుండం వల్లే ఏపీకి కేంద్రం న్యాయం చేయడం లేదేమోనని అన్నారు.

ప్రధానికి ప్రజా సమస్యలపై గౌరవం ఉందా?

మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన ప్రసంగం నిరుత్సాహ పర్చిందనీ, ప్రజా సమస్యల గురించి ప్రస్తావన లేకుండా,రాజకీయ ప్రసంగంలా, ఎన్నికల ప్రసంగంలా సాగిందని లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. సభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ ఆయన, రఫేల్ ఒప్పందంతో సహా సభ్యులు ప్రస్తావించిన అంశాల్లో వేటి గురించి ప్రధానమంత్రి సమాధానం చెప్పకపోవడం శోచనీయమని అన్నారు. ప్రజాస్వామ్యం గురించి నీతులు బోధించనక్కరలేదంటూ కాంగ్రెస్ నుద్దేశించి మోడీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే స్పందిస్తూ, ప్రధానమంత్రికి అసలు ప్రజాస్వామ్యంపై గౌరవం ఉందా అని ప్రశ్నించారు. మోడీ వంటి వారు చెప్పేది ఒకటి, చేసేది మరొకటి అని అన్నారు. రాజకీయ ప్రయోజనాలకే ఆంధ్రప్రదేశ్‌ని కాంగ్రెస్ విభజించిందన్న మోడీ ఆరోపణను ఖర్గే ఎద్దేవా చేశారు. తెలంగాణా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని, ఆంధ్రప్రదేశ్ పౌరులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసినట్టుగా మోడీ ప్రసంగం సాగిందని ఖర్గే అన్నారు. కొత్త బడ్జెట్‌లో పొందు పర్చిన రైతులకు కనీస మద్దతు ధర, 2022నాటికి రెట్టింపు ఆదాయం కల్పిస్తామన్న వాగ్దానాలను ప్రధానమంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించకపోవడం శోచనీయమని అన్నారు. ప్రజల సమస్యల గురించి కాకుండా, రాజకీయ ప్రయోజనాల గురించి పార్లమెంటును వేదికగా చేసుకుని మోడీ ప్రసంగించారని ఆయన అన్నారు. బీజేపీ మిత్రపక్షమైన తెలుగుదేశం ఎంపీలు పార్లమెంటులో ప్లకార్డులు పుచ్చుకుని నినాదాలు చేసినప్పటికీ, వాటి గురించి కూడా ప్రస్తావన చేయకుండా ప్రధాని పూర్తిగా ఎన్నికల ప్రసంగం చేశారని ఆయన అన్నారు. రఫేల్ ఒప్పందం గురించి పార్లమెంటులో ప్రతిపక్షాలు నిలదీసినా ప్రధానమంత్రి సమాధానం చెప్పకపోవడం దురదృష్టకరమని అన్నారు. వాజ్‌పేయి కవితను మోడీ ప్రస్తావించినప్పటికీ, ఆయన ప్రసంగంలో విశాల హృదయం కనిపించలేదని అన్నారు.

ప్రధాని ప్రసంగం అర్ధ సత్యాలతో, వక్రీకరణలతో నిండి ఉందని మాజీ మంత్రి శశి థరూర్ విమర్శించారు.

పోచంపల్లి చేనేత కళ అద్భుతం

- చేనేత కార్మికులకు నా వంతు సాయం చేస్తా : నరసింహన్



భూదాన్‌పోచంపల్లి, ప్రభన్యూస్ : చేనేత కార్మికులకు తనవంతు సహాయమందిస్తానని, పోచంపల్లి చేనేత కళ అద్భుతంగా ఉందని రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నర సింహన్ అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో కనుముక్కల గ్రామ పరిధిలోని చేనేత పార్కును ఆయన సతీమణి విమలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ బూరనర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్ పార్కు చైర్మన్ కడవేరుదేవేందర్ కలిసి ఘనస్వాగతం పలికారు. పార్కులో నూలు రంగులు అద్దటం, మగ్గాలపై వస్త్రాల తయారీ విధానాలను పరిశీలించారు. పార్కులో ఎంత మంది పనిచేస్తున్నారని, కూలీ గిట్టు బాటు అవుతుందా, మార్కెటింగ్ ఏవిధంగా ఉందని అంశాలపై ఆరా తీశారు. అనంతరం పోచంపల్లిలో గ్రామ పర్యాటక కేంద్రం ఆవరణలో ప్రధమ భూదాత వెదిరె రామ చంద్రారెడ్డి, ఆచార్య వినోబావే కాంస్య విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. పర్యటక కేంద్రం లో కార్మికులు, మాస్టర్ వీవర్స్, బ్యాంకర్లు, మహిళా సం ఘాల ప్రతినిధులు సమీక్షసమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత కోసం ఎంతో కష్టమైన పని అన్నారు. చేనేత కార్మికుల సమస్య లు తమ దృష్టికి తీసుకొచ్చారని సమస్యల పరిష్కారాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని వినియోగ దారుల అభిప్రాయల మేరకు నూతన డిజైన్ లకు వస్త్రాలను తయారు చేయాలని సూచించారు. నూతన చేనేత నాణ్యత తో చేనేత వస్త్రాలు మార్కెటింగ్‌ను విస్తరిస్తే మంచి ఆధారణ లభిస్తుందని, దీనితో చేనేత వస్త్రాల ధరించే అవకాశం ఉంటుం దన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ కమిషనర్ శైలజ రామ య్యర్, జేసీ రవినాయక్, డీఆర్‌డీవోపీడీ వెంకట్‌రావు, చేనేత జౌళీ శాఖ అడిష నల్ కమిషనర్ శ్రీనివాస్, సీఈవో విద్య సాగర్‌రావు, ఆర్‌డీవో సూరజ్ కుమార్, ఎంపీడీవో గుత్తా నరేందర్ రెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితులను ఆదుకోకుంటే
సీఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సీఎం క్యాంపు ఆఫీస్‌ను ముట్టడిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా హెచ్చరించారు. తెలంగాణలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో లక్షలాది మంది గల్ఫ్ దేశాలకు వలసపోయారని ఆయన తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. గల్ఫ్‌కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఏజెంట్ల చేతిలో మోసపోయిన లక్షలాది మంది కార్మికులు గల్ఫ్‌లో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. గల్ఫ్‌లోని ఇండియా ఎంబసి వద్ద స్వదేశానికి వచ్చేందుకు పడిగాపులు కాస్తున్నారని ఆయన వివరించారు. ప్రభుత్వాలు స్పందించి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారని కుంతియా గుర్తు చేశారు.

కాంగ్రెస్ సీనియర్ నేత పీసీసీ మాజీ అధ్యక్షుడు మల్లు అనంతరాములు చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు నివాళులు అర్పించారు. మల్లు అనంతరాములు వర్ధంతిని గాంధీభవన్‌లో నిర్వహించారు.

ప్యాకేజీ టెండర్లతో ప్రభుత్వానికి రూ. 200 కోట్ల నష్టం

- గురుకులాలు, జూనియర్, డిగ్రీ కాలేజీ భవనాల నిర్మాణాలకు వింత విధానం
- మూడు నుంచి ఐదు పనులు ప్యాకేజీగా నిర్ణయించిన ఈడబ్ల్యూఐడీసీ
- రూ. 50 కోట్ల నుంచి రూ. 60 కోట్ల వరకు ఒక ప్యాకేజీ
- ఒక్కో పని అయితే.. త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంటుందంటున్న బిల్డర్లు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని దళిత కులాల అభివృద్ధి గురుకుల సొసైటీ అధ్వర్యంలో నడుస్తున్న రెసిడెన్షియల్ స్కూల్స్, జూనియర్, డిగ్రీ కాలేజీల భవనాల నిర్మాణాలకు తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలికవసతుల అభివృద్ధి మండలి వింత విధానం అవలభిస్తోంది. ఒక్కో రెసి డెన్షియల్ స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీల భవనాల నిర్మా ణాలకు వేర్వేరుగా టెండర్లను పిలవకుండా నాలుగు, ఐదు పనులను ఒక ప్యాకేజీగా రూపొందించి టెండర్లను పిలుస్తు న్నారు. తద్వారా టెండర్ల విలువ రూ. 50 కోట్ల నుంచి రూ. 60 కోట్ల వరకు ఉంటుంది. ఇంత పెద్దమొత్తంలో టెండర్లలో పాల్గొ నేవారు చాలా తక్కువ మంది ఉంటారు. ఇలా ప్యాకే జీలుగా మార్చి టెండర్లను ఎక్కువ మొత్తానికి పిలిస్తే ప్రభు త్వానికి సుమారు రూ. 200 కోట్ల వరకు నష్టం వచ్చే అవకాశం ఉంటుం దని భవన నిర్మాణాలు చేసే కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

89 పనులు... 25 ప్యాకేజీలు

రాష్ట్రంలోని 31 జిల్లాల్లో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ అధ్వర్యంలో కొత్తగా స్కూల్స్, జూనియర్, డిగ్రీ కాలేజీలను నిర్మించాలని నిర్ణయించారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 89 పనులకు గుర్తించారు. చాలా చోట్ల స్కూల్స్ ఉండగా కొన్ని చోట్ల జూనియర్, డిగ్రీ కాలేజీల భవనాలను నిర్మించనున్నారు. ఇందుకుగానూ రూ. 1179 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. వీటిని ఖర్చు చేయడానికి పరిపాలన అనుమతి కూడా ఇచ్చింది. ఒక్కో వర్క్‌కు రూ. 13.10 కోట్ల ప్రకారం మంజూరు చేసింది. అయితే టిఎస్‌ఈడబ్ల్యూఐడీసీ సంస్థ ఒక్కో వర్క్‌కు టెండర్లు పిలవకుండా నాలుగు నుంచి ఐదు వర్క్‌లను ఒక ప్యాకేజీ లాగా ఏర్పాటు చేశారు. ఆ నాలుగు, ఐదు వర్క్‌లకు కలిపి ఎంత మొత్తం అవుతుందో దానికి టెండర్లను పిలుస్తున్నారు. ఇలా చూస్తే ప్యాకేజీలకు రూ. 30 కోట్ల నుంచి రూ. 60 కోట్ల వరకు అవుతున్నాయి. టెండర్లను అలానే పిలిచారు.

ప్యాకేజీ- 3లో జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి, గొల్లపల్లి, జిగిత్యాలలో నిర్మించనున్న స్కూల్, జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్ బిల్డింగ్స్ ఉన్నాయి. వీటి అంచనావ్యయం రూ. 58.12 కోట్లుగా చూపారు. అలాగే ప్యాకేజీ-5లో వరంగల్, జనగాం జిల్లాల్లోని ఆత్మకూర్, దుగ్గొండి, నర్మెట ప్రాంతాల్లో స్కూల్, జూనియర్ కాలేజీల భవనాల నిర్మాణానికి టెండర్లను పిలిచారు. వాటి అంచనా వ్యయం రూ. 31.46 కోట్లుగా నిర్ణయించారు.

టెండర్లలో ట్విస్ట్....

టెండర్లలో ట్విస్ట్ ఏమిటంటే టెండర్లకు సంబందించి వారు కోడ్ చేసిన దానిలో సగం నిధుల పనులు వారు ఇప్పటికే ఇతర పనుల్లో పూర్తి చేసిన అనుభవం ఉండాలి. ఇది జీవో నంబర్ 94 ప్రకారం అమలు చేస్తున్నారు. అంటే ఒక వ్యక్తి రూ. 30 కోట్ల ప్యాకేజీకి టెండర్ వేస్తే అతను ఇప్పటికే రూ. 15 కోట్ల పనులు ఇతర పనుల్లో పూర్తి చేసి ఉండాలి. అలా చేసి ఉంటేనే అతను ఆ బిడ్‌లో పాల్గొనడానికి అర్హుడు అవుతాడు. లేకపోతే అతను అర్హత పొందలేడు. ఒక వ్యక్తి రూ. 60 కోట్ల పనులకు టెండర్ వేయాలంటే అతను ఇప్పటికే రూ. 30 కోట్లమేరకు ఇతర పనుల్లో పూర్తి చేసి ఉండాల్సి ఉంటుంది. రాష్ట్రంలో భవన నిర్మాణాలు చేసే బిల్డర్లు సువూరు 1000 మంది వరకు ఉంటారు. వారిలో ఇలా రూ. 30 కోట్ల నుంచి రూ. 60 కోట్లు పనుల టెండర్లలో పాల్గొనే వారు 50 మంది నుంచి 100 మంది వరకు ఉంటారు. అందులో జీవో 94 ప్రకారం అయితే వీరిలో కనీసం 20 మంది కూడా అర్హత సాధించలేరు. మొత్తం 89 పనులను 25 ప్యాకేజీలుగా రూపొందించింది. ఈ నేపథ్యంలో 25 ప్యాకేజీల్లో పనులను ఒకరిద్దరు రెండు, మూడు ప్యాకేజీల పనులను చేయాల్సి ఉంటుంది.

ప్యాకేజీలతో రూ. 200 కోట్లు నష్టం....

ప్యాకేజీలతో టెండర్లను పిలిస్తే ప్రభుత్వానికి రూ. 200 కోట్లు నష్టం వచ్చే ప్రమాదం ఉంది. ఒక్కో టెండర్‌ను పిలిస్తే ఎక్కువ మంది టెండర్లలో పాల్గొంటారు. అప్పుడు ప్రభుత్వం నిర్ధేశించిన వాస్తవ విలువలో కనీసం 15 శాతం తక్కువగా టెండర్లను వేసే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ప్యాకేజీల పేరుతో అయితే తక్కువ మంది ఉంటారు కాబట్టి వారు వాస్తవ విలువ కంటే తక్కువకు టెండర్లలో పాల్గొనే అవకాశం ఉండదు. వాస్తవ విలువ కంటే ఇంకా కనీసం 5 శాతం మేరకు ఎక్కువకే టెండర్లలో పాల్గొనే అవకాశం ఉంటుందని బిల్డర్లు ఆరోపిస్తున్నారు. మొత్తం రూ. 1179 కోట్లు కాగా అందులో 15 శాతం అంటే రూ. 170 కోట్ల వరకు ఉంటుంది. ఇది కాకుండా అదనంగా 5 శాతం కోడ్ చేసే అవకాశం ఉంటుంది కాబట్టి మొత్తంగా రూ. 200 కోట్లు ప్రభుత్వానికి నష్టం వచ్చే ప్రమాదం ఉందని చిన్న బిల్డర్లు విమర్శిస్తున్నారు.

ఒక్కో వర్క్ వారీగా టెండర్లు పిలవాలి:
బిల్డర్ల అసోసియేషన్ కార్యదర్శి మదన్‌మోహన్

సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ అధ్వర్యంలో కొత్తగా నిర్మిస్తున్న స్కూల్స్, జూనియర్, డిగ్రీ కాలేజీల భవనాల టెండర్లలో టిఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ప్యాకేజీలను రూపొందించి చిన్న బిల్డర్లు అందులో పాల్గొనలేకుండా చేశారని తెలంగాణ బిల్డర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భావన మదన్‌మోహన్ విమర్శించారు. బడాకాంట్రాక్టర్ల కోసమే ఈ విధానం రూపొందించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, బిల్డర్ అసోసియేషన్ నేత మురళీకృష్ణతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ప్యాకేజీ వర్క్‌లు కేవలం 10 నుంచి 15 మంది బడా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడం కోసం రూపొందించారని మండిపడ్డారు. ప్యాకేజీల రూపంలో కాకుండా సింగిల్‌గా టెండర్లను పిలిస్తే ప్రభుత్వానికి రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్లు ఆదాయం మిగులుతుందని తెలిపారు. వీటితో మరో 10 రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మాణం చేయవచ్చని అన్నారు. ప్రీ బిడ్డింగ్ సమావేశంలో పాల్గొన్న 40 మంది కాంట్రాక్టర్లు కూడా ఈ విధానాన్ని వ్యతిరేకించారని గుర్తు చేశారు.

నాణ్యత, త్వరగా పూర్తి కావాలనే:
టిఎస్‌ఈడబ్ల్యూఐడీసీ

నిర్మాణాల్లో నాణ్యత, త్వరగా భవనాల నిర్మాణాలు పూర్తి కావాలనే ఉద్దేశంతో టెండర్లను ప్యాకేజీలుగా రూపొం దించినట్టు టిఎస్‌ఈడబ్ల్యూఐడీసీ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వానికి ఎటువంటి నష్టం రాకుండా టెండర్ల ప్రక్రియను ఆన్‌లైన్‌లోనే ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా బిడ్‌లో ఎక్కువ కోడ్ చేస్తే వారికి పనులు అప్పగించబోమని ఉన్నతాధికారి స్పష్టం చేశారు.

తెలంగాణను మోడీ అవమానించారు



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ప్రధాన మంత్రి నరేంద్రమోడి పార్లమెంట్‌లో మాట్లాడిన తీరు ప చ్చి అవకాశవాదాన్ని తలపిస్తోందని సీఎల్పీ ఉప నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. తలుపులు మూసేసి రాష్ట్ర విభజన చేశారని ప్రధాని చేసిన వ్యాఖ్యలను పొంగులేటి ఖండిం చారు. బుధవారం ఆయన అసెంబ్లీ ఆవర ణలో మీడియాతో మాట్లా డారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను ప్రధాన మంత్రి అవ మానించారని ఆయన విమర్శించారు. రాష్ట్ర విభజన సమస్యలపై లోక్‌సభలో ప్రతిపక్షనేత మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడుతుంటే.. బీజేపీ, టీడీపీలు ఎంపీలు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడి అడ్డుకున్నాయని ఆయన ఆరోపించారు. టీఆర్ఎస్ ఎంపీలు మాత్రం నోరు మెదపక పోవడం శోచ నీయమన్నారు. విభజన హామీలను పరిష్కించే బాధ్యత ప్రధాన మంత్రికి లేదా..? అంటూ ఆయన నిలదీశారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్నిరోజులైనా నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించిన సీఎం కేసీఆర్ అసెంబ్లీని ప్రొరోగ్ చేయడంలో ఆంత ర్యమేమిటని ఆయన ప్రశ్నించారు.

కేటీఆర్ మంత్రి పదవికి అనర్హుడు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: మంత్రి కేటీఆర్ పై కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ మంత్రి పదవికి అర్హుడుకాదని విమ ర్శిం చారు. పప్పు అని గూగుల్‌లో టైప్ చేస్తే ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఫోటోలు వస్తాయని మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా రేవంత్ రెడ్డి పై విధం గా స్పందిం చారు. బుధవారం ఆయన అసెం బ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. పద్మాలయ, ఒరిస్సాలో భూ సెటిల్ మెంట్ల కేసుల్లో ఉన్న కేటీఆర్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసే హక్కు లేదన్నారు. పార్లమెంట్లో ఆమోదం తెలిపిన తెలంగాణ బిల్లును ప్రధాని మోడి అవమానించే విధంగా మాట్లాడటం తగదని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బిల్లుపై వెకిలిగా మాట్లా డటమంటే.. రాజ్యాంగాన్ని అవమానపర్చడమేనని ఆయన దుయ్య బట్టారు. మోడి ప్రధాని అయ్యాక తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణాలో బీజేపీ జెండా ఉండటానికి వీలు లేదన్నారు. మోడికి ఇదే పూరి స్థాయి బడ్జెట్ అని ఆయన పేర్కొ న్నారు. ప్రధాని ప్రసంగం రచ్చబండ మీద సామ న్య మానవుడు మాట్లాడినట్లుగా, చౌకబారుగా ఉందని ఆయన ఆరోపించారు.

ఏపీ డిమాండ్లు న్యాయమైనవి
పోరుకు మద్దతు!

- విభజన హామీలు అమలు చేయాల్సిందే!
- తెరాస పార్లమెంటరీ నేత జితేందర్ రెడ్డి

న్యూఢిల్లీ: విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లోక్‌సభలో తెరాస పక్ష నేత జితేందర్ రెడ్డి బుధవారం లోక్‌సభలో డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్ పూర్తిగా గందరగోళంగా ఉందని, ఏ ఒక్క రాష్ట్రాన్నీ సంతృప్తి పరిచేలా లేదని అన్నారు. రైతుల పంటలకు మద్దతు ధరలు ఇచ్చే విషయంలో బడ్జెట్లో ఎంతమాత్రం స్పష్టత లేదని ఆయనన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎయిమ్స్ ఇస్తామని ఆర్థిక మంత్రి జెట్లీ సభలోనే హామీ ఇచ్చారని, కాని ఆ హామీ నిలబెట్టుకోలేదని, ఇలాంటప్పుడు విలువేమి ఉంటుందని ఆయన నిలదీశారు. అలాగే ఆయుష్మాన్ భారత్ పథకంలో కూడా స్పష్టత లేదని, ఈ స్కీం భారాన్ని కేంద్రమే భరించాలని అన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా పనిచేస్తున్నారన్నారు. ప్రధాని మోడీ కూడా కేసీఆర్ పాలనను మెచ్చుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో ఆ రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి తాము కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నామని, ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు తమ పార్టీ సంఘీభావం వ్యక్తం చేస్తున్నదని అంటూ, కేంద్రం వెంటనే స్పందించి తగిన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కన్సల్టెన్సీల మాయాజాలం..
నిరుద్యోగ యువత విలవిల

- మళ్లీ భాగ్యనగరంలో వెలుగుచూస్తున్న కన్సల్టెన్సీ బాగోతాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బాగ్యనగరంలో కొన్ని మోసపూరిత ప్రైవేట్ కన్సల్టెన్సీ సంస్థలు నిరుద్యో గులను నిండా ముంచుతున్నాయి. వాటి మాయా జాలంలో నిరుద్యోగ యువత విలవిలలాడుతోంది. ఆహ్లాదకరమైన వాతావరణం.. అందమైన రిసె ప్షనిస్టు.. నమ్మకాన్ని ప్రోది చేసే అత్యాధునిక సౌకర్యా లతో కొన్ని కన్సల్టెన్సీ సంస్థలు నిరుద్యోగ యువతను ఇట్టే ఆకర్షిస్తున్నాయి. విదేశాల్లో ఉద్యోగాలు.. వీసా, టిక్కెట్లు ఫ్రీ అంటూ నిరుద్యోగ యువతను ఊరి స్తాయి. యువత సదరు కన్సల్టెన్సీ సంస్థలలో అడుగు పెట్టగానే ఉద్యోగం గ్యారంటీ అన్న నమ్మకాన్ని తప్పక కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాము జీవితంలో స్థిరపడగలమన్న భావనలో చాలా మంది నిరుద్యోగ యువత ఈ కన్సల్టెన్సీ సంస్థల మాయలో పడి తమ ఆస్తులను సైతం అమ్ముకుని మరీ ఈ కన్సల్టెన్సీ సం స్థలకు ధారపోస్తున్నారు. అంతేకాదు, విదేశాల్లో ఉద్యో గం మీద ఉన్న క్రేజుతో ఇలాంటి మోసపూరిత కన్సల్టెన్సీ సంస్థల బారిన పడేవారి సంఖ్య తక్కువేమీ కాదు. కన్సల్టెంట్స్, కన్సల్టెన్సీ ఇలా వివిధ పేర్లతో వీరు నిరుద్యోగ యువతకు గాలం వేస్తున్నారు. కొందరు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి నగరంలో ఏదో ఒక ప్రాం తంలో కన్సల్టెన్సీ సంస్థను నెలకొల్పుతారు. తమ టార్గెట్ పూర్తి చేసు కున్న అనంతరం సదరు కన్సల్టెన్సీ సంస్థలను మూసేసిన సందర్భాలు సైతం గతంలో ఉన్నాయి. దుబాయ్‌లో ఉద్యోగాల పేరిట ఈ సంస్థలు నిరుద్యోగులకు ఆశ చూపుతున్నాయి.

మరికొన్ని మోసపూరిత కన్సల్టెన్సీ సంస్థలు వివిధ పత్రికలలో ఆకర్షణీయమైన ప్రకటనలతో నిరుద్యో గులను ఆకర్షిస్తున్నాయి. ఈ విధంగా తమ వద్దకు వచ్చిన సదరు నిరు ద్యోగుల నుంచి అందినంత దండుకోవడమే ఇలాంటి మోసపూరిత కన్సల్టెన్సీ సంస్థల పనిగా ఉంది. మరికొన్ని కన్సల్టెన్సీ సంస్థలయితే తమ వలలో పడిన నిరు ద్యోగ యువతక ు ఇంటర్వ్యూలు నిర్వహించీ మరీ వారిలో ఆశలను ద్విగుణీకృతం చేస్తున్నాయి. దీంతో సదరు కన్సల్టెన్సీ అడిగినంత మొత్తాన్ని చెల్లించేందుకు సైతం నిరుద్యోగులు సమర్పించి ఆనక మోసపోయిన ఘటనలు లేకపోలేదు. ఇలా నిరుద్యోగ యువతను తమ వద్దకు రప్పించుకోవడం నుంచి వారికి ఆశలు రేపి దోచుకోవడం వరకూ కన్సల్టెన్సీ సంస్థలు తమదైన శైలిలో వ్యవ హరిస్తున్నాయి. గతంలో దిల్‌సుఖ్‌నగర్, తార్నాక, ఎర్రగడ్డ, టోలిచౌక్ తదితర ప్రాంతాల్లో ఇలాంటి మోసపూరిత కన్సల్టెన్సీ సంస్థలను నెలకొల్పి నిర్వాహకులు నిరుద్యోగ యువత నుంచి లక్షల్లో డబ్బులు గుంజేశారు. ఇదే క్రమంలో కొన్ని కన్సల్టెన్సీ సంస్థల గుట్టును పోలీసులు రట్టు చేశారు.

పెరుగు తున్న నిరుద్యోగంతో ఎక్కడైతే ఏంటి? ముందుగా స్థిరపడితే ఆనక తమ జీవితాలు బాగుపడతాయన్న గంపెడాశతో నిరుద్యోగ యువత ఈ కన్సల్టెన్సీ సంస్థల మాయలో పడిపోతు న్నారు. ఇదే అదనుగా భావిం చిన కన్సల్టెన్సీ సంస్థలు తమ వలలో చిక్కిన నిరుద్యోగ యువత నుంచి లక్షల్లో డబ్బులు గుంజేస్తున్నారు. కొన్ని కన్సల్టెన్సీ సంస్థలైతే విదేశీ ఉద్యోగాల ఆఫర్‌తో పాటు నగరంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉద్యోగాలిప్పిస్తామని మరింతగా నిరు ద్యో గులలో ఆశలను రేపుతున్నాయి. చిట్టచివరికి వారి ఆశలను అడియాసలు చేస్తు న్నాయి. ఇలాంటి మోస పూరిత కన్సల్టెన్సీ సంస్థల పట్ల నిరుద్యోగులు జాగరూకతతో వ్యవహరించాలి. లేని పక్షంలో నిండా మునిగినట్లే.. నిరుద్యోగులు బహుపరాక్...!

ఏపీ ప్రత్యేక హోదా సాధనకు
ప్రత్యేక జేఏసీ

- రాజకీయాలను పక్కనబెట్టి ఉద్యమిద్దాం
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు రాజకీయాలకు అతీతంగా ఐక్య కార్యచరణ సమితి(జేఏసీ)ని ఏర్పాటు చేయనున్నట్లు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఈ జేఏసీలో అన్ని రాజకీయపార్టీలు, విద్యావంతులు, మేధావులు భాగస్వా మ్యం కావాలని ఆయన పిలుపునిచారు. ప్రత్యేకహోదా కోసం ఇప్పటికే ఆందోళన చేస్తున్న వారితో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బుధవారం జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన చెప్పారు. లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, చలసాని శ్రీనివాస్‌లాంటి వారితో సంప్రదించి జేఏసీ ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి క్రియాశీలక రాజకీయాల్లో లేనందున ఆయనకు దీంతో ఆయనకు సంబంధం లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా పవన్ చెప్పారు. ప్రజల హక్కుల సాధనకోసమే జేఏసీ ఏర్పాటు చేస్తామని, ఇందులో రాజకీయ ప్రయోజనాలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు జనసేన గొంతు సరిపోవడం లేదని, ప్రాథమిక దశలో ఉన్న తమ పార్టీ జేఏసీలో అందరిని కలుపు కొని పోతుందని పవన్ స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేసి ఉంటే పార్లమెంట్, శాసనసభలో తమ వాణిని వినిపించే అవకాశం ఉండేదని ఇప్పుడు తన గొంతు వినిపించేపరిస్థితి లేదన్న బాధ తనకు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు కొన్ని పరిమితులు ఉన్నాయని, ప్లకార్డులు పట్టుకుని రోడ్లపైకి వస్తే సమస్యలు పరిష్కారం కావని ఆయన అన్నారు.

తెలంగాణ సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కలిసి ఉద్యమించిన రీతిలోనే ఏపీలో కూడా పోరాటం చేయాలని పవన్ పిలుపునిచ్చారు. రెండు రాష్ట్రాల సమస్యలపై భావోద్రేకంలో వ్యాత్యాసం ఉన్నప్పటికీ సమస్య సాధనకు చిత్తశుద్ధితో తాను ఉద్యమించనున్నట్లు పవన్ స్పష్టం చేశారు. ప్రజాశ్రేయస్సు కోసం ఒక వేదికను ఏర్పాటు చేస్తానని, ఆ వేదిక పైకి అందరూ ఒకటిగా రావాలని ఆయన కోరారు. రాష్ట్రానికి న్యాయం జరగాలన్నదే తన ఆకాంక్ష అని ఆ లక్ష్యంతోనే జేఏసీ ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా సాధనపై ప్రజలు కూడా రాజకీయపార్టీలను ప్రశ్నిస్తున్నారని, ఈ తరుణంలో ప్రజా ఆకాంక్ష మేరకు అందరం ఒకటి కావాలని పవన్ కోరారు. రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం కాదని రాజకీయ వేదిక ద్వారా సాధించుకోవాల న్నదే తన ఆకాంక్ష అన్నారు. చివరి అస్త్రంగానే రోడ్లపైకి వచ్చి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పవన్‌కల్యాణ్ అభిప్రా యపడ్డారు.

రాష్ట్ర విభజనలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకుండా అన్యాయం చేస్తుందని ఆయన మండిపడ్డారు. యూపీఏ ఇచ్చిన హామీలను తామెందుకు అమలు చేయాలన్న రీతిలో ఎన్డీయే ప్రభుత్వం దాటవేస్తుం దని ఆయన దూయబట్టారు. విభజన బిల్లు హామీలన్నీ అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాజాపా ప్రధాన అభ్యర్థిగా నరేంద్రమోడీ హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు ఆ అంశాన్ని పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీల పేరుతో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతూ ప్రజలను మభ్యపెడుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబులపై ప్రజలకు విశ్వాసం పోతుందని ఆయన అన్నారు. విభజన సమస్యలు పరిష్కరిం చుకోవాలన్న ఆశతోనే గత ఎన్నికల్లో మోడీతో కలిసి ప్రచా రంలో పాల్గొన్నానని పవన్ స్పష్టం చేశారు. హామీల అమలుపై ఏడాదిపాటూ వేచి చూసిన తర్వాతే ప్రధాని మోడీని కలిసి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరానని ఆయన గుర్తు చేశారు. హోదా సాధ్యం కాదంటూ ప్యాకేజీ ఇస్తామంటే ముఖ్య మంత్రి చంద్రబాబు స్వాగతిం చారని, అవికూడా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్యాకేజీ క్రింద రాష్ట్రానికి ఇచ్చిన నిధుల వినియోగంపై లెక్కలు చెప్పడం లేదని కేంద్రం ఆరోపిస్తుంటే, తమకు ఇచ్చిన నిధుల గురించి చెప్పాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం అనడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని పవన్ విచారణ వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల వివాధం మధ్య ప్రజలు నష్ట పోతున్నారని ఇది ఇంకెంతకాలం కొనసాగాలని ఆయన ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌ను రూ.24లక్షల కోట్లతో ప్రకటించినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌కు కేటాయి ంపుల ప్రస్తావన లేకపోవడం బాధక రమన్నారు. పార్లమెం ట్‌లో బుధవారం ప్రధాని చేసిన ప్రసంగంలో దివంగత నేతలు పీవీ నరసిం హరావు, ఎన్‌టీ.రావూరావులను స్మరిస్తూ సెంటిమెంట్ వ్యాఖ్యలు చేసిన తర్వాతనే సమస్యకు పరిష్కారం చూపవని ఆయన అన్నారు. తాము ఎవరిపై పోరాటం చేస్తామన్నది ప్రధానం కాదని కేవలం సమస్య ప్రాధాన్యతకే పరిమితం అవుతామని ఒక ప్రశ్నకు సమాధానంగా పవన్ చెప్పారు. చట్టాలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు వాటిని పాటించనప్పుడు ప్రజలు స్పందిస్తుం టారని ఇప్పుడు రాష్ట్రంలో కూడా అదే జరుగుతుందని ఆయన అన్నారు. తమ పోరాటం కేవలం సమస్యపైనే అని, వ్యక్తులపై కాదని ఓ ప్రశ్నకు సమాధానంగా పవన్ స్పష్టం చేశారు.

వచ్చే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీతో కలిసి పోటీ చేస్తారని ఓ విలేకరి ప్రశించగా, ఎన్నికలు, పొత్తుల గురించి మాట్లాడే సమయం కాదన్నారు. ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇస్తారని, ఏ పార్టీతో కలిసి పోటీ చేస్తారని మరో విలేకరి ప్రశ్నించగా తాను ఏరాజకీయ పార్టీకి మద్దతుగా లేనని, కేవలం ప్రజల కోసమేనని చెప్పారు. రాజకీయ పార్టీలతో కాకుండా తనకు ప్ర జల మద్దతు ఉంటే చాలునని పవన్ అన్నారు. తాను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో లేనని అలాంట ప్పుడు మద్దతు ఇచ్చినట్లు ఎలా అవుతుందని ఆయన అన్నారు. రాజకీయ పార్టీ నిర్మాణంపై స్పందిస్తూ, ప్రస్తుతం తమకు బూత్‌కమిటీలు కూడా లేవని, క్షేత్రస్థాయి నుంచి ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని అన్నారు. ఇతర పార్టీల నుంచి వలసలు వస్తే ఆహ్వానిస్తారా...అని ప్రశ్నించగా, వలసలు అనే పదం కన్నా చేరికలను స్వాగతిస్తామని స్పష్టం చేశారు. జనసేన పార్టీ కూడా తోక పార్టీ లాగా మిగిలిపోతుందా అని ఒక విలేకరి ప్రశ్నించగా, చైనాలో ఒక జాతి పాముకు తోకలో కూడా విషయం ఉంటుందంటూ పవన్‌కల్యాణ్ తీవ్రంగా స్పందించారు.

ఆయూష్మాన్‌కు నిధుల కొరత లేదు

బడ్జెట్‌పై బీజేపీ నేత మురలీధర్‌రావు వ్యాఖ్య



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజకీయాల్లో నీతి, నిజాయితోనే నీతి వంతమైన పాలన సాధ్యమవుతుందని, ఇందు కోసం అవినీతి, నల్లధనం అరికట్టడం అవసర మని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి. మురళీధర్‌రావు అన్నారు. పార్లమెంట్‌లో ఇటీవల అరుణ్‌జైట్లీ ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌పై పార్టీ కార్యా లయం లో ఆయన విశదీక రించారు. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి వల్ల అవినీతిని నిర్మూలిం చేందుకు మార్గం సుగమమైందన్నారు. రైల్వేలో దక్షిణ మధ్య రైల్వేకు రూ. 18 వేల కోట్లు కేటాయించారన్నారు. ఇందులో రైల్వే లైన్ల ఆధు నీకరణ, విస్తరణ, కొత్త లైన్ల సర్వే తదితరాలున్నాయని పేర్కొన్నారు. ఆయుష్మాన్ పథకం ఎంతో ఉన్నతమైం దని, అందరికీ ఆరోగ్యం అన్న నినా దాన్ని ఈ పథకం ద్వారా సాకారం కాబోతుం దన్నారు. ఈ పథకానికి బడ్జెట్ లో రూ. 2వేల కోట్లు కేటాయించారని, హెల్త్‌సెస్ ద్వారా వచ్చే మొత్తాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కూడా తీసుకోను న్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రహదారులలో అడిగిన దాని కంటే ఎక్కువగా ఇచ్చారని పేర్కొన్నారు.

జాతీయ హోదా స్థాయిలో ఏర్పాట్లేవీ?

మేడారం జాతరకు జాతీయ హోదా కల్పిం చాలన్న టిఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనలను పాటించలేదని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి. మురళీధర్‌రావు అన్నారు. నాలు గేళ్ళుగా నిశ్శబ్ధంగా ఉన్న ప్రభుత్వం హడా విడిగా అసెంబ్లీలో తీర్మానం చేసింద న్నారు. దాదాపు ఏడు రాష్ట్రా ల ప్రజలు పాల్గొనే జాతర నిర్వహణ బాధ్యతలను కలెక్టర్‌కు అప్పగించడం సరైంది కాద న్నారు. జాతీయ హోదా కావాలన్నప్పుడు ఆ స్థాయిలో నిబంధనలు ఉన్నాయని, వాటిల్లో ఏ ఒక్కటీ పాటించలేదని తప్పు పట్టారు. జాతీయ గుర్తింపు కావాలంటే కనీసం రెండు మూడేళ్ళ నుంచి ప్రయత్నం చేయాలని, అందుకు అనుసరిం చాల్సిన నిబంధ నలను కూడా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దళితు లకు ప్రాధాన్యమిస్తూ, పేదలూ అణగారిన వర్గాల ప్రజల పట్ల కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనసరిస్తున్న తీరు వల్లే అన్నివర్గాల వారు బిజెపిలో చేరుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో కుటుంబ పార్టీ, అవినీతిలో కూరుకుపోయిన టిఆర్ ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొ న్నారు. ఉస్మానియా యూనివర్సిటీ జాక్ నాయకుడు అంజిబాబుతో పాటు పలు వురు విద్యార్థులు, యువజనులు పార్ట కార్యాలయంలో బుధవారం చేరారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రాణత్యాగాలకు పాల్పడ్డ అమరులకు త్యాగాలే మిగిలాయని, తెలంగాణ ద్రోహులు మాత్రం రాజ భోగాలను అను భవిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి పోరుబాట పట్టిందని, అందుకోసం వివిధ ప్రజా చైతన్య కార్య క్రమాలను చేపట్టినట్లు తెలిపారు. దళితుల అన్యాయాలపై దళిత అదాలత్‌లు, రైతు సమస్యలపై రైతు పోరు, నిరుద్యోగ సమస్యపై నిరుద్యోగ సమరభేరీ, బిసి సమస్యలపై బిసి సంగ్రామ సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు బిజెపి కట్టుబడి ఉందని, కాంగ్రెస్‌కు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాహుల్‌గాంధీతో కేంద్రానికి వర్గీకరణపై లేఖ రాయించాలని డిమాండ్ చేశారు.



ముద్దు కృష్ణమ ఇక లేరు

- రాజకీయ ప్రముఖులు, తెదేపా నేతలు, అభిమానుల నివాళి
- నేడు స్వగ్రామం వెంకటరామాపురంలో అంత్యక్రియలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి, శాసనమండలి సభ్యుడు గాలి ముద్దు కృష్ణమ నాయుడు(71) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన స్వస్థలం చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకటరామాపురంలో 1947లో జన్మించారు. ఆయన అంత్యక్రియలుస్వగ్రామంలో గురువారం నిర్వహించ నున్నారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ 1983లో ఎన్టీరామారావు పిలుపుమేరకు ఉద్యోగానికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. చిత్తూరు జిల్లా పుత్తూరు నుంచి ఐదు సార్లు, నగరి నుంచి ఒకసారి శాసనసభ్యు డిగా ఆయన ఎన్నికయ్యారు. ఎన్టీఆర్‌కు ఎంతో సన్నిహితు డిగా పేరుతెచ్చుకున్న ముద్దు కృష్ణమనా యుడు ఆయన మంత్రి వర్గంలో పాఠశాల విద్య, అటవీశాఖ, ఉన్నత విద్యాశాఖ మంత్రిగా మూడు పర్యాయాలు బాధ్యతలు నిర్వహించారు.

గత వారం రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ముద్దు కృష్ణమనాయుడు నగర శివారులోని ఒక కార్పోరేట్ ఆసుపత్రిలో చేర్చారు. ఆ సమయంలో బీపీ నియంత్రణలో లేకపోవడంతో అది వివిధ అవయవాల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపించింది. ఆయనకు అత్యుత్తమ చికిత్స అందించేందుకు మూడు రోజులుగా ఐసీయూలో ఉంచి కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. అయితే మల్టీఆర్గాన్ ఫెయిల్యూర్‌తో డెంగ్యూ అదుపుతప్పి పరిస్థితి విషమించింది. ఈ పరిస్థితి నుంచి నాయుడుని గట్టు ఎక్కించేందుకు డాక్టర్లు చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో అర్ధరాత్రి ఆయన తుది శ్వాస విడిచినట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారణకు వచ్చి ప్రకటించారు. ముద్దు కృష్ణమనాయుడు మరణవార్త తెలియగానే బంధువులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆసుపత్రికి తరలివచ్చారు. తమ మిత్రుడు, సహచరుడు, అభిమాన నాయకుడిని కడసారి సందర్శించుకున్న పలువురు నివాళులర్పించారు. అక్కడే ఉన్న ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమా ర్ రెడ్డి, ఏపీ శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరా వు, సీఎల్పీ నేత కే.జానారెడ్డి, మాజీ మంత్రులు మోత్కుపల్లి నర్సింహులు, మండవ వెంకటేశ్వరరావు, బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి, సముద్రాల వేణుగోపాల చారి, ఎల్.రమణ, మాజీ ఎంపీలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నామా నాగేశ్వరరావు తదితరులు ముద్దు కృష్ణమనాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి ఆయనతో తమకు ఉన్న అనుబంధం, సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. మోత్కుపల్లి నర్సింహులు తమ సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీటి పర్వతమయ్యారు. శివప్రసాదరావు, కిరణ్‌కుమార్ రెడ్డి, బొజ్జాల గోపాలకృష్ణారెడ్డి తదితరులు ముద్దు కృష్ణమనాయుడు సేవలను కొనియాడుతూ దద్గద స్వరంతో ఆవేదనకు లోనయ్యారు.

ఎన్టీఆర్ భవన్‌లో నివాళి...

గాలి ముద్దు కృష్ణమనాయుడి మృతిపట్ల టీడీపీ-టీఎస్ నాయకులు తమ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



ముద్దు కృష్ణమసేవలు మరవలేం: గవర్నర్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు,ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు మృతికి ఉమ్మడి రాష్ట్రా ల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి వార్త దిగ్భ్రాంతికి గురి చేసిందని బుధవారం ఒక సంతాప సందేశంలో గవర్నర్ పేర్కొన్నారు. నాయుడు కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రాజేశం గౌడ్ సంతాపం

ఎపి ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు మృతి పట్ల తెలంగాణ ఆర్థిక కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్ సంతాపం తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మంత్రివర్గంలో తామిద్దరం సభ్యులుగా ఉన్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాయుడు కుటుంబానికి సానుభూతిని తెలుపుతూ వారికి మానసిక స్థైర్యం ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు రాజేశం గౌడ్ తెలిపారు.

ప్రధాని కొత్తగా చెప్పిందేమీలేదు



న్యూఢిల్లీకాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలు ఒకటి కోరుకుంటుంటే..మోడీ మరొకటి చెబుతున్నారని మండిపడ్డారు.బుధవారం పార్లమెంట్ లో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా కాంగ్రెస్ పై మోడీ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. మోడీ ప్రసంగంలో కొత్తేమీ లేదని.. ప్రజలు తమ భవిష్యత్, ఉద్యోగాలపై ఆశలు పెట్టుకుంటే..ప్రధాని వారి ఆశలపై నీళ్లు చల్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మాటల్లో కొత్తేమీ లేదు..పాత పల్లవినే వల్లెవేశారు. ప్రజలు తమ భవిష్యత్ గురించి ఆలోచిస్తున్నారు. ఉద్యోగాలు కోసం ఆరాటపడుతున్నారు. అని రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానం సందర్భంగా మోడీ వ్యాఖ్యలపై పెదవి విరిచారు.

24 మెడికల్ కాలేజీలకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ: దేశంలో కొత్త 24 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. కొత్త కాలేజీలు ప్రస్తుతమున్న జిల్లాలు, రిఫరల్ ఆస్పత్రులకు అనుసంధానంగా 2021-22 నాటికి పనిచేస్తాయి. వైద్య ఆరోగ్య రంగానికి బడ్జెట్ లో పెద్దపీట వేసిన కేంద్ర ప్రభుత్వం ఆరంగానికి రూ. 14వేల 930 కోట్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. మెడికల్ కాలేజీల్లో 2020-21 నాటికి 18 వేల 58 డిగ్రీ, పీజీ సీట్ల పెంపునకు కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది. త్వరలో248 నర్సింగ్, మిడ్‌వైఫరీ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వంపేర్కొంది. ఆరోగ్యరంగ నిపుణుల అవసరాల మేరకు కొత్త కాలేజీలలో ఎంబీబీఎస్, పీజీ సీట్లను పెంచనున్నట్లు స్పష్టం చేసింది. దేశంలో నాణ్యమైన మెడికల్ విద్యను అదించడమే లక్ష్యంగా ప్రస్తుతమున్న కాలేజీలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ఆధునిక వైద్యసేవలు కూడా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ప్రతీ 3-5 పార్లమెంట్ నియోజక వర్గాల్లో కనీసం ఒక మెడికల్ కాలేజీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.కొత్త మెడికల్ కాలేజీలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకుంటాయని తెలిపింది. ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల మధ్య అంత రాలను తొలగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అధికారులు తెలిపారు.

స్వతంత్ర సంస్థల హేతుబద్దీకరణకు కేబినెట్ ఓకే

వైద్య ఆరోగ్యశాఖ కింద నడుస్తున్న స్వతంత్ర సంస్థల హేతుబద్దీకరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. హేతుబద్దీకరణ అంశాన్ని అంతర్గత మంత్రిత్వ శాఖ పరిశీలిస్తుందని పేర్కొంది.రాష్ట్రీయ ఆరోగ్య నిధి(రాన్) జనసంఖ్య స్థిరత కోశ్(జేఎస్‌కే) ల ఏకీకరణకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. పేదరోగులకు చికిత్స అందించేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని రాన్ అందిస్తుండగా.. 2003లా 100కోట్లకార్పస్ ఫండ్ తో ఏర్పాటైన జేఎస్‌కే జనాభా స్థిరీకరణ వ్యూహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

11న పవన్‌తో ఉండవల్లి భేటీ



కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలంటూ ఉద్యమ నిర్మాణానికి జాయింట్ యాక్షన్ కమిటీని రూపొందించే క్రమాన్ని ప్రారంభించిన జనసేనాధిపతి పవన్‌కళ్యాణ్‌తో ఈ నెల 11వ తేదీన మాజీఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ బేటీ కానున్నారు. బుధవారం పవన్‌కళ్యాణ్ అరుణ్‌కుమార్‌కు ఫోన్ చేశారు. ఆయన సమమిస్తే రాజమండ్రి కొచ్చి కలిసి జెఎసిపై చర్చిస్తానంటూ ఉండవల్లితో చెప్పారు. దీనిపై స్పందించిన ఉండవల్లి తానే రెండుమూడ్రోజుల్లో హైదరాబాద్‌కొచ్చి కలుస్తానంటూ బదులిచ్చారు. ఇరువురికి సముచితంగా 11వ తేదీన బేటీకావాలని నిర్ణయించారు. దీనికెలాంటి రాజకీయ ప్రాధాన్యతలేదని ఉండవల్లి మీడియాకు స్పష్టం చేశారు. ప్రస్తుతం తానే రాజకీయ పార్టీలోనూ లేరన్నారు. ప్రత్యేక హోదా కోసం రాజకీయాలకతీతంగా మేధావుల్తో ఓ కమిటీ రూపొందించే ప్రయత్నాన్ని ఆయన స్వాగతించారు. పవన్‌కళ్యాణ్ జనాకర్షణ కలిగిన నాయకుడు. ఆయన చెబితే పదిమంది వింటారు. దాన్ని ఆచరణలో పెడతారు. అలాంటి వ్యక్తి హోదా ఉద్యమానికి నాయకత్వం వహిస్తే అది ఖచ్చితంగా కేంద్రంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందంటూ ఉండవల్లి చెప్పారు. విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్ని కూడా కేంద్రం ఆచరణలో పెట్టడంలేదంటూ ఆయన మండిపడ్డారు. ప్రత్యేకహోదాకు నీతిఆయోగ్ అంగీకరించడంలేదన్న వాదన కూడా సరికాదన్నారు. కేంద్రం ఒప్పుకుంటే మధ్యలో నీతిఆయోగ్ ఎవరంటూ ప్రశ్నించారు. నీతి ఆయోగ్ కూడా కేంద్రం నియమించిన ఓ కమిటీయేనని మర్చిపోకూడదన్నారు. రాష్ట్రాన్ని మోడి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవ డంలేదంటూ విమర్శించారు. ఇచ్చిన హామీల్ని అమలు చేయించుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. ఇందుకోసం ఉద్యమమే సరైన మార్గంగా పేర్కొన్నారు.

ఎఎన్ఎంల వేతన పెంపుపై జీవో

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎఎన్ఎంలకు వరంగా ప్రకటించిన వేతన పెంపును ప్రభుత్వం ఆచరణలోకి తెచ్చింది. గత ఆదివారం ముఖ్యమంత్రి ఎఎన్ఎంలకు వేతనాలను రూ.10 వేల నుంచి 21,230 రూపాయలకు పెంచుతున్నట్టుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. 2003 సంవత్సరంలో యూరోపియన్ కమిషన్ పథకం కింద నియామకం అయిన ఎఎన్ఎంలు తమ వేతనాలను పెంచాలని కోరుతూ గతంలో సీఎంతో పాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్యకార్యదర్శులకు విన్నవించుకున్నారు. వారి విజ్ఞప్తి మేరకు సీఎం సానుకూల నిర్ణయం తీసుకొని ప్రస్తుతం 10 వేల నుంచి 21 వేల రూపాయలకు పెంచారు. అయితే 2వ ఎఎన్ఎంలకు కూడా త్వరలో వేతనాలను పెంచుతామని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. బుధవారం ఈ మేరకు వేతన పెంపుపై వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు...

మోడీ టాప్ ఎజెండా!

- ప్రచారంలో టమోటా..ఉల్లి..ఆలు ప్రస్తావన
- మరోసారి రాజకీయాల్లో ఉల్లి ప్రకంపనలు



న్యూఢిల్లీ: 'కూరగాయలు, పండ్లు పండించే వారికి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. మీరు దేశంలోని ఏ ప్రాంతానికైనా వెళ్లండి. ప్రధానంగా మూడు ఉత్పత్తులు కచ్చితంగా దర్శనమిస్తాయి. అవే టమోటా (టొమాటో), ఉల్లి(ఆనియన్), ఆలు(పొటాటో). అందుకే దీన్ని నేను టాప్ (టీవోపీ) ప్రయారిటీగా పేర్కొంటాను' అని రెండు రోజుల కిందట కర్నాటక ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పారు. దేశంలో అత్యంత హెచ్చుతగ్గులకు గురయ్యే పంట ఉత్పత్తుల్లో ఉల్లిది అగ్రస్థానం. అంతేకాదు 1970 తర్వాత ఉల్లి ప్రభావం ఏంటో చాలా పార్టీలకు తెలిసొచ్చింది. ఉల్లి ధరల దెబ్బకు అనేక ప్రభుత్వాలు కూలిపోయిన ఉదంతాలు ఉన్నాయి. అందుకే రైతుల అంశానికొచ్చే సరికి, వరి, గోధుమ, చెరకు పంటలకు ఎంత ప్రాధానం ఇస్తారో, టమోటా, ఉల్లి, ఆలు ఉత్పత్తులకు అంతే ప్రాధాన్యం ఇవ్వక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే దక్షిణాది (కర్నాటక) ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోడీ 'టాప్' ఎజెండాను భుజానికెత్తుకున్నట్లు కనిపిస్తోంది. 'టాప్' ధరలపై బీజేపీ నాయకత్వం ఒకింత కలవరం చెందుతున్నట్లు తెలుస్తోంది.

రైతులకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, బడ్జెట్‌లోనూ ఈదిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గోధుమ, వరి, చెరకు రైతులతో పోల్చుకుంటే 'ఇటీవల కాలంలో 'టాప్' రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నట్లు తన దృష్టికి తీసుకొచ్చారు. దిగుబడులు వచ్చినప్పుడూ, రానప్పుడూ రెండు సందర్భాల్లోనూ నష్టాల పాలవుతున్నామని చెప్పారు. ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఉంది. కొన్నేళ్లుగా ఈ మూడు పంటల ఉత్పత్తిలో చైనా తర్వాత ప్రపంచంలో మన దేశం రెండోస్థానంలో ఉంది. కొన్నిచోట్ల టమోటా, ఉల్లి ధరలు కిలో ఒక్క రూపాయిగానే ఉండగా, ఆలు ధర కిలో రూ.20గా ఉందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ధరలు కనీస మద్దతు ధరకంటే తక్కువ స్థాయిల్లో ఉండి, రైతులను కష్టాల్లోకి నెట్టివేస్తున్నాయని ప్రధానమంత్రి గుర్తుచేశారు.

ఉల్లి.. కన్నీరు

గతేడాది జులైలో ఉల్లి ఎగుమతులు 56 శాతం పెరిగాయి. అదే ఏడాది నవంబర్ మాసానికి వచ్చే సరికి దిగుమతి చేసుకోవాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్-జులై మాసంలో రిటైల్ మార్కెట్‌లో ఉల్లి సగటు ధర రూ. 15గా నమోదైంది. ఈసమయంలో కనీస మద్దతు ధర రూ. 6 కంటే తక్కువకే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రైతులు ఉత్పత్తులను అమ్ముకోవాల్సి వచ్చింది. ఇక ఆసియాలోనే అతిపెద్దదైన నాసిక్‌లోని లసంగావ్ మార్కెట్‌లో కేజీ రెండు రూపాయలకే రైతులు పంటను అమ్ముకున్నారు. కనీసం పది రూపాయల మద్దతు ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అక్టోబర్ - నవంబర్ మాసాల్లో ఉల్లి ధరలకు రెక్కలొచ్చాయి. కిలో రూ. 70-80 మధ్య రిటైల్ మార్కెట్లో అమ్మకాలు జరిగాయి. గతవారం మళ్లీ ధరలు పాతాళానికి చేరాయి. ఏకంగా యాభైశాతం పతనమయ్యాయి. ఉల్లి రైతులకు పంట నిల్వ చేసుకోవడం సవాల్‌గా మారుతోంది. 95శాతం నీరు కలిగి ఉండటమే ఇందుకు కారణం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శీతల గిడ్డంగులు సరిపడా లేకపోవడంతో, పండించిన పంటను ఏదో ఒక ధరకు తెగనమ్మాల్సి వస్తోంది.

ఆలు.. విలవిల..

ప్రధానమంత్రి పేర్కొన్న టాప్ కేటగిరీ కూరగాయల్లో నిల్వ సామర్థ్యం కలిగినది బంగాళదుంప (ఆలు) మాత్రమే. ఆలును అధికంగా పండించే ఉత్తరప్రదేశ్‌లో 7వేల శీతల గిడ్డంగులు ఉన్నాయి. కిందటేడాది ఇండియాలో 48 మిలియన్ టన్నుల ఆలు పండించారు. 2016తో పోల్చితే నాలుగు శాతం అధికం. దిగుబడులు పెరగడం రైతులకు శాపంగా మారింది. కిలోకి రూ. 0.5 నుంచి 2 మాత్రమే లభించింది. శీతల గిడ్డంగుల ఖర్చులు కలిపి చూస్తే, కిలో ఉత్పత్తి ధర 9 రూపాయలు అవుతున్నది. దేశీయ మార్కెట్ కంటే అంతర్జాతీయ మార్కెట్లే కాస్తంత నయం అనిపిస్తున్నది. అక్కడ కిలో 13-15 రూపాయల ధర ఉంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆలును ఎగుమతి చేసుకునే సౌలభ్యం రైతులకు లభించలేదు. ఎగుమతి ధర రూ. 27గా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.

> **ఇదేనా ప్రభుత్వ ప్రాధాన్యత?**
>
> - 2007లో టమోటా, ఉల్లి రైతులకు లభించిన ధర కిలో ఒక్కింటికి రూ. 1 మాత్రమే
> - టమోటా, ఉల్లి, ఆలు పంటసాగుకు అయ్యే ఖర్చు కిలో ఒక్కింటికి రూ. 6-7
> - ఇబ్బడిముబ్బడి దిగుబడులు వచ్చినా రైతులకు ప్రయోజనం ఉండటం లేదు. ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవడం సాధ్యం కావడంలేదు. మార్కెట్ ధర కంటే కనీస మద్దతు ధర అధికంగా ఉండటం ప్రతిబంధకం అవుతోంది.
> - అవసరానికి సరిపడినన్ని శీతల గిడ్డంగులు లేని కారణంగా టమోటా, ఉల్లి రైతులు తరచూ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.
> - గతేడాది బెంగళూరు రిటైల్ మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ. 120 ఉన్న సమయంలో, రైతులు మాత్రం కేజీ టమోటాను రూ. 1-2 రూపాయలకే అమ్మాల్సిన దుస్థితి ఏర్పడింది.

టమోటా...రోడ్లపాలు

గతేడాది టమోటా మార్కెట్‌ను గమనిస్తే, ఇటు రైతులకు, అటు ప్రభుత్వాలకు కూడా సంకటంగా పరిణమించింది. దేశీయ మార్కెట్‌కు టమాలు ఖరీఫ్, రబీ సీజన్ల ద్వారా చేరుతుంది. ఈసారి రొటీన్‌కు భిన్నంగా వర్షాకాలంలో టమోటా ధరలు ఆకాశాన్నంటాయి. కోల్‌కతా మార్కెట్‌లో 700శాతం పెరిగాయి. ముంబై రిటైల్ మార్కెట్‌లో కిలో ధర 100 రూపాయలు ధాటిపోయింది. బెంగళూరులో రూ. 120 పలికింది. ధరల మంట ఈవిధంగా ఉంటే, రైతులు వద్ద కొనేవారు కరవయ్యారు. దేశంలో టమోటాకు అతిపెద్ద మార్కెట్లయిన కర్నూలు-అనంతపురం లలో కనిష్ఠ ధరలు నమోదయ్యాయి. రైతుకు కిలోపై రూ. 0.65 పైసలు మాత్రమే చేతికొచ్చింది. ఇక జార్ఖండ్, మధ్యప్రదేశ్‌వంటి రాష్ట్రాల్లోనైతే తక్కువ ధరకు అమ్మడం ఇష్టంలేక, నిరసనగా టమోటాలను జాతీయ రహదారులపై పడేశారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి చెబుతున్న టాప్ ప్రయారిటీ కోసం పాలసీలలో మార్పులు చేయడంపై దృష్టిసారిస్తే మంచిదని రైతులు కోరుతున్నారు.

> **బడ్జెట్‌లో 'టాప్' లేపేశారు!**
>
> - కనీస మద్దతు ధరను యాభై శాతం లాభానికి నిర్ణయించాలి. లేదంటే ఉత్పాదక వ్యయానికి 150శాతంగా ఉండేలా చూడాలి.
> - కానీ జైట్లీ చెప్పిన 25 మద్దతు పంటల జాబితాలో 'టాప్' పంటలకు చోటివ్వలేదు.
> - వ్యవసాయానికి బడ్జెట్‌లో 11 లక్షల కోట్లు కేటాయించారు. అయితే దీనివల్ల 'టాప్' రైతులకు లబ్ది చేకూరే అవకాశాలు చాలా తక్కువనే చెప్పాలి.
> - ఆపరేషన్ గ్రీన్‌కు బదులు ఆపరేషన్ వరదలు పేరుతో కేటాయింపులు జరిపితే బాగుండేది. టాప్ ఉత్పత్తుల ధరల్లో హెచ్చుతగ్గుల నియంత్రణకు పెద్దపీట వేయాల్సింది.
> - ఏటా రూ.30వేల కోట్ల మేరకు బంగాళదుంప రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వ కేటాయింపులు బఠాణీ గింజ పరిమాణంలో ఉంటే ఆలు రైతులకు ఒరిగేది ఏముందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.
> - 22వేల గ్రామీణ మార్కెట్లను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెప్పింది. సరిపడ శీతల గిడ్డంగులు లేక ఉత్పత్తులను రైతులే నేరుగా రిటైలర్లకు, టోకు వర్తలకు విక్రయించాల్సి వస్తోంది.

గాంధీ ఆస్పత్రికి 3సీట్లు

- నిజామాబాద్ ఫార్మా కాలేజీకి 3 సీట్లు మంజూరు
- మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: తెలంగాణలో వైద్యశాలల బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగానే మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వైద్య విద్య కోసం కేంద్రం నుంచి రావలసిన సీట్లతో పాటు నిధుల కోసం ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోంది. ఈ కృషికి గుర్తింపుగా బుధవారం గాంధీ ఆస్పత్రికి పరిపాలనా విభాగం కింద 3 సీట్లు, నిజామాబాద్ ఫార్మాకాలేజీలో 3 సీట్లను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా..

గాంధీ ఆస్పత్రిలో గతంలో ఎంబీఏ చేసిన ముగ్గురు మేనేజర్లను నియమించింది. వారు శానిటేషన్‌తో పాటు ఓపీ విభాగం తదితర వాటికి సంబంధించి రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీరి పర్యవేక్షణలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ నడిచేలా ప్రభుత్వం వీరిని నియమించింది. వీరి నియామకం వల్ల ప్రసుతం ఉన్న ఆర్ఎంఓలతో పాటు డాక్టర్లకు కొంత మేర పనిభారం తగ్గిందని గాంధీ ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా ఈ వ్యవస్థను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అమలు జరిగేలా చూడాలని గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. ఇంకా కొన్ని నెలల తరువాత ఇందులో తలెత్తిన లోపాలను సరిదిద్దుకొని ఆ తరువాత అన్ని ఆస్పత్రుల్లో దీనిని అమలు చేయాలని సంకల్పించింది. అందులో భాగంగా పరిపాలనా విభాగం కింద ఈ మూడు సీట్లను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మంజూరు చేసిందని గాంధీ వర్గాలు పేర్కొంటున్నాయి

స్వయం ప్రతిపత్తి వ్యవస్థగా రైతు సమాఖ్య

- 42 మంది సభ్యులతో పాలక మండలి
- కేబినెట్ హోదాలో అధ్యక్షుడి నియామకం
- గుత్తాను నియమించాలని సీఎం సూచనప్రాయ నిర్ణయం
- సభ్యుల ఎంపికకు 90మంది పేర్ల పరిశీలన
- రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు?
- ఖరీఫ్ నుంచి కార్యాచరణ ప్రారంభం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ రంగంలో పూర్వ వైభవం తీసుకురావాలన్న ధృడ సంకల్పంతో రైతు సమన్వయ వ్యవస్థను నెలకొల్పుతున్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు ముమ్మరం చేసింది. స్వయం ప్రతిపత్తి వ్యవస్థగా రాష్ట్ర రైతు సమాఖ్యను నెలకొల్పేందుకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 42మంది సభ్యులతో పాలకమండలిని నేర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. వ్యవసాయ రంగంపై అనుభవమున్న నాయకుణ్ణి ఈ సంస్థకు అధ్యక్షునిగా నియమించి కేబినెట్ హోదా కల్పించాలని నిర్ణయించారు. అందుకు పార్లమెంట్ సభ్యుడు గుత్తా సుఖేందర్‌రెడ్డిని సూచనప్రాయ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర రైతు సమన్వయ సమాఖ్యకు సభ్యులుగా నియమించేందుకు అర్హులుగా గుర్తించిన 90మంది పేర్లు ముఖ్యమంత్రి పరిశీలనలో ఉన్నాయి. రెండు, మూడు రోజుల్లోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెడువడుతాయని అధికార వర్గాల ద్వారా సమాచారం అందింది. ఇప్పటికే జిల్లా సమన్వయ సమితిల ఏర్పాటు ప్రక్రియ మంత్రులు, కలెక్టర్ల నేతృత్వంలో ప్రారంభమైంది.

రైతు పక్షపాతిగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు గత ఆరు నెలల కాలంగా వ్యవసాయశాఖ ఉన్నతాధికార యంత్రాంగం కసరత్తు చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఎప్పటికప్పుడు రైతుల అవసరాలను తెలుసుకుంటూ, వారికి కావాల్సిన సహాయ, సహకారాలకు అందిస్తూ వ్యవసాయం, అనుబంధ రంగాలను ముందుకు నడిపించేందుకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒక పారదర్శకమైన వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే గ్రామ, మండల రైతు సమన్వయ సమితులు ఏర్పాటయ్యాయి. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సమన్వయ సమితులను అతిత్వరలోనే ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రతిపాదన కూడా ముఖ్యమంత్రి ఆమోదం పొందింది.

మెరుగైన వ్యవసాయ విధానాలు

వ్యవసాయఅనుబంధ రంగాలతో పాటు వృత్తులను ప్రోత్సహించి ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసే కార్యాచరన ప్రణాళిక త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్ నుంచి కార్యరూపం దాల్చనుంది. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఖర్చుచేసే నిధులు నేరుగా లబ్ధిదారులకే చేర్చాలన్న అంశంపై పోచారం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కసరత్తు పూర్తి చేసింది. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభిస్తున్న పెట్టుబడి మద్దతు పథకాన్ని అత్యంత పారదర్శకంగా అమలు చేసేందుకు గ్రామస్థాయిలో చర్యలు ప్రారంభమవుతున్నాయి.

ప్రభుత్వ రైతు సంఘాలు

వ్యవసాయ రంగ పరిపుష్టికి ముందుచూపుతో సీఎం కేసీఆర్ సరికొత్త తరహాలో నాలుగంచెల వ్యవస్థను ఏర్పాటు చేశారు. రైతుల పక్షాల ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, ప్రభుత్వ పథకాల ద్వారా అన్నదాతలకు లబ్ధి చేకూర్చేలా చూసేందుకు అధికారికంగా రైతు సమన్వయ సమితులను నెలకొల్పారు. గ్రామ స్థాయిలోనే కాకుండా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనూ ఈ సంఘాలు ఏర్పాటయ్యాయి. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా గ్రామ సభల ద్వారా పదిహేను మంది సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఆ మేరకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి యంత్రాంగానికి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సీఎం కేసీఆర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు గ్రామ రైతు సమాఖ్యలను రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో నెలకొల్పారు. గ్రామ సమాఖ్యలు ఏర్పాటైన వెంటనే మండల సమాఖ్యలను కూడా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

రైతు కార్పొరేషన్‌కు రూ.1500 కోట్లు

రాష్ట్ర కేబినెట్ హోదాలో రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుణ్ణి నియమించనున్నారు. అధికార వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు వచ్చే బడ్జెట్‌లో ఈ సంస్థ కార్యకలాపాలకు రూ.1500 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కూడా కేటాయించనున్నారు. ఈ పదవికి పోటీ పడుతున్న వారిలోంచి కొంతమంది పేర్లు ముఖ్యమంత్రి పరిశీలనలో ఉన్నాయి. త్వరలోనే తుదినిర్ణయం వెలువడనుంది.



అలాగే 24 మంది సభ్యులతో జిల్లాస్థాయి, మండల స్థాయి రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేయనున్నారు. 15 మంది సభ్యులతో గ్రామ రైతు సమితిలు ఏర్పాటైన విషయం తెలిసిందే.

నోడల్ అధికారులుగా రెవెన్యూ యంత్రాంగం

రాష్ట్రస్థాయిలో వ్యవసాయ శాఖ కమిషనర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్ నోడల్ అధికారిగా, మండల స్థాయిలో తహసిల్దార్, గ్రామస్థాయిలో వీఆర్వోలు కార్య నిర్వహణాధికారులుగా వ్యవహరిస్తారు. పక్షం రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు సీఎం ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. రైతుసమితిల ఏర్పాటు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి మూడు జిల్లాలకు ఒకరి చొప్పున మంత్రులకు బాధ్యతలు అప్పగించారు.

వలసజీవిపై ఉక్కుపాదం

- మారుతున్న ధనిక దేశాల వైఖరి
- వలసలకు చెక్ పెట్టేలా చట్టాలు
- స్వదేశీయులకు ఉపాధి పెంపే లక్ష్యం
- అమెరికా మార్గంలో సౌదీ అరేబియా
- వలసలపై కఠిన వైఖరి
- కొత్త గెజిట్ విడుదల
- 2019 నాటికి వలసలపై నిషేధం
- భారతీయులపై తీవ్ర ప్రభావం
- తెలుగువారికి కోలుకోలేని దెబ్బ



రియాద్: ప్రపంచ దేశాలు ఒక్కొక్కటిగా వలస జీవులపై ఉక్కుపాదం మోపుతున్నాయి. పొట్ట చేత పట్టుకుని పరాయి దేశానికి వెళ్లి విధేయతగా పనిచేసే భారతీయులను తారెత్తిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు అమెరికా ఫస్ట్ నినాదంతో విదేశీ ఉద్యోగులపై కోత పెట్టడం ప్రారంభించాక.. ఇతర దేశాలు కూడా అదే బాటలో పయనిస్తున్నాయి. క్రూడాయిల్ నిల్వలు అత్యధికంగా ఉండే అరబ్ దేశాలు కూడా ట్రంప్ వేసిన రాచమార్గాన్ని అనుసరిస్తున్నారు. తాజాగా సౌదీ అరేబియా వలసజీవులకు పిడుగులాంటి వార్తను చేరవేసింది. తమ దేశంలో 2019 నాటికి వలసలే లేకుండా చేస్తామని ప్రకటించింది. మూడు విడతల్లో విదేశీ ఉద్యోగులకు టాటా చెప్పాలని నిర్ణయించినట్లు ఆదేశ కార్మిక శాఖ మంత్రి అలీ అల్ ఘన్ఫీ చేసిన ప్రకటన భారతీయుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది.

తెలుగు వారికి కోలుకోలేని దెబ్బ

ఆయా దేశాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న రంగాల్లో పనిచేసే ఉద్యోగాలపై వలసల ఎత్తివేత ప్రభావం చూపదని సౌదీ అరేబియా ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ.. పరోక్షంగా అది భారతీయ కార్మికులకు పిడుగులాంటి వార్తే. సౌదీ అరేబియాలో 2017 నాటికి 41 లక్షల మంది భారతీయులు ఉపాధి కోసం వలస వెళ్లగా.. వారిలో దాదాపు సగం మంది తెలుగు వారే ఉంటారని నిపుణుల అంచనా. సౌదీ అరేబియా కరెన్సీకి ఎక్కువ విలువ ఉండటంతో కొన్ని రోజులైనా అక్కడికి వలస వెళ్తే ఉపాధితో పాటు తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించుకుని స్వదేశానికి తిరిగి రావచ్చని అభిప్రాయం ఎక్కువ మందిలో ఉంటుంది. దీంతో ఏళ్ల తరబడి కుటుంబాలకు దూరంగా వెళ్లి అక్కడి పనుల్లో నిమగ్నమైపోతారు.



నితాఖత్‌తో నిషేధం షురూ

నితాఖత్.. అంటే సౌదీ సేషన్... ఒక్క మాటలో చెప్పాలంటే సౌదీ ప్రజలకే ఎక్కువ ఉద్యోగాలు అని దీని అర్థం. 2011 లో సౌదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నితాఖత్‌కు విడతల వారీగా సవరణలు చేస్తున్నారు. ఈ విధానం ప్రకారం దేశంలోని ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో విదేశీయుల కంటే స్వదేశీయులకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంకా చెప్పాలంటే ముల్కీ ఫస్ట్ అన్నమాట. ప్రైవేట్ రంగాల్లోనూ విదేశీ ఉద్యోగులకు బదులు సౌదీ జాతీయులకు ఉద్యోగావకాశాలు పెంపొందించడం నితాఖత్ ముఖ్య ఉద్దేశం. ఈవిధానం ప్రకారం దేశ వ్యాప్తంగా ఉన్న సంస్థలను ప్లాటినం, గ్రీన్, ఎల్లో, రెడ్‌గా నాలుగు కేటగిరీలుగా విభజించారు. వీటిని బట్టి సౌదీ సంస్థల్లో పనిచేసే విదేశీ ఉద్యోగుల నిష్పత్తిని విభజించారు. ప్లాటినం సంస్థల్లో 40 శాతానికి పైగా సౌదీ జాతీయులే ఉద్యోగులుగా ఉండాలి. ప్లాటినం, గ్రీన్ సంస్థలు నైపుణ్యాభివృద్ధి సంస్థలు కావడంతో అందులోకి ఎక్కువ మంది విదేశీయులు,ముఖ్యంగా భారతీయులు రారన్నది సౌదీ ప్రభుత్వ ఆలోచన.

విడతల వారీగా వలసలకు చెక్

సెప్టెంబర్ 11,2018 తర్వాత



- కార్లు, మోటర్ బైక్ షోరూంలు
- రెడీమేడ్ బట్టల దుకాణాలు
- ఇళ్లు, ఆఫీసుల ఫర్నీచర్ స్టోర్లు
- గృహోపకరణాలు, కిచెన్ పాత్రల దుకాణాలు

నవంబర్ 9, 2018 తర్వాత



- ఎలక్ట్రానిక్ దుకాణాలు
- గడియారాల స్టోర్స్
- కంటి అద్దాల దుకాణాలు

జనవరి 7, 2019 తర్వాత



- ఔదక సామాగ్రి, సరఫరా దుకాణాలు
- భవన నిర్మాణ సామాగ్రి దుకాణాలు
- ఆటోమొబైల్ రంగంలోని విడిభాగాల దుకాణాలు
- కార్పెట్ అమ్మకాల దుకాణాలు
- స్వీట్ షాపులు

స్వదేశీయులకు ఉపాధి పెంపే లక్ష్యం

ప్రస్తుతం సౌదీలో 15 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు యువత 32.6 శాతంగా ఉంది. చాలామంది తమ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను విదేశీయులు కొల్లగొట్టుకుపోతున్నాయని నిరసన కార్యక్రమాలను శ్రీకారం చుట్టడంతో ప్రభుత్వం ఆలోచనలో పడింది. ఇలాగే ఊరుకుంటే నిరుద్యోగ సమస్య నివురుగప్పిన నిప్పులా రాజుకోవచ్చని ఊహించిన ప్రభుత్వం వలసలకు దశల వారీగా చెక్ పెట్టాలని నిర్ణయించింది. ఈ లెక్కన సుమారు 1.20 కోట్ల మంది విదేశీయులు వెనక్కి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. 41 లక్షల మంది భారతీయులు ఉంటారని అంచనా.

నిర్మాణ రంగంలోనే ఎక్కువ

సౌదీ అరేబియాలో ఉపాధి కోసం వలస వెళ్లే భారతీయుల్లో ఎక్కువ మంది నిర్మాణ రంగంలోనే పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది మేస్త్రీలు, కూలీలుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. నిరక్షరాస్యులు, నామమాత్రం చదువుకున్న వారు వివిధ మార్గాల్లో వర్క్ వీసాలు పొంది సౌదీ అరేబియా వెళ్తారు. భారత్ లోని ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్,బీహార్, కేరళ,రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే ఎక్కువ మంది వలస వెళ్లారు.



పృథ్వీ-2 క్షిపణి సక్సెస్



బాలాసోర్ : స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన అణు ఆయుధ సామర్థ్యం ఉన్న పృథ్వీ-2 మిస్సైల్ ను బుధవారం ఉదయం 11.35 నిమిషాలకు ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుండి విజయవంతంగా ప్రయోగించారు. 350 కిలోమీటర్ల రేంజ్ ఉన్నదిగా రక్షణ శాఖ అధికారులు వివరించారు. లాంచ్ కాంప్లెక్స్ - 3 నుండి మొబైల్ లాంచర్‌ను ఈ క్షిపణి తీసుకెళ్లింది. జనవరి 18న అగ్ని-5ను, ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుండి మంగళవారం అగ్ని-1 మిస్సైల్‌ను ప్రయోగించగా, విజయవంతమైనట్టు రక్షణ శాఖ అధికారులు వివరించారు. 500 నుండి 1,000 కిలోల బరువున్న ఆయుధ సామాగ్రిని తరలించే సామర్థ్యం ఉంది. పృథ్వీ - 2ను ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ మూడో కాంప్లెక్స్ నుండి ప్రయోగించారు. ఇది ద్రవ రూపం ఇంధనంతో నడిచేది అధికారులు ప్రకటించారు. పోరాట సన్నద్ధతను పటిష్టం చేయడానికి సైన్యంలోని వ్యూహాత్మక దళాల విభాగం ఈ పరీక్షను నిర్వహించింది. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద డీఆర్‌డీఓ తయారు చేసి మొదటి క్షిపణిగా పేరు సంపాదించుకుంది. దీన్ని 2003లో సైన్యం వ్యూహాత్మక దళాల విభాగంలో చేర్చారు.

ఆధార్ వివరాలు భద్రం

న్యూఢిల్లీ: దేశ ప్రజలు భద్రత, గుర్తింపు కోసం తీసుకు వచ్చిన ఆధార్ పథకం అద్భుతంగా అమలు అవుతోందని అదే సమయంలో అత్యంత భద్రత నడుమ ప్రజలకు చెందిన ఆధార్ సమచారం ఉందని కేంద్ర సాంకేతిక శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ లోక్‌సభలో తెలిపారు. ఆధార్ పథకం మెరుగైన పనితీరుతో దేశ ప్రజలను ఆకట్టుకుంటోందని, ప్రస్తుతానికి 120 కోట్లమంది భారతీయలు ఆధార్ కార్డులను కలిగి ఉన్నారని, వీటిలో 57 కోట్ల ఆధార్ కార్డులు బ్యాంకు ఖాతాలకు అనుసంధానమైనట్లు పేర్కొన్నారు. దీనివల్ల దాదాపు 57 వేల కోట్ల రూపాయలను ఆదా చేయగలిగామని పేర్కొన్నారు. ఆధార్ సమాచారం గోప్యతపై చాలామంది సందేహాలు వ్యక్తం చేస్తున్నారని, ఈ విషయంలో ఎవ్వరికీ ఎటువంటి భయాలు అక్కర్లేదని ఆయన అన్నారు. దేశ ప్రజల నుంచి సేకరించిన సమాచారం అత్యంత కట్టుదిట్టమైన సాంకేతిక పహారాలో ఉందని, ఒక వేళ దీన్ని ఎవరైనా అక్రమంగా పొందాలని చూస్తే ఆధార్ చట్టం ప్రకారం 6 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్షకు గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ పథకం తీరుతెన్నులపై వివిధ దేశాలు కూడా ఆసక్తి కనబరిచాయని, ప్రపంచ బ్యాంకుతో సహా పలు ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలు కూడా మెచ్చుకున్నాయని కూడా ఆయన చెప్పారు. ఆధార్ సమాచారాన్ని గోప్యంగా ఉంచడానికి ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పద్ధతులను అవలంభిస్తున్నామని చెప్పారు. ఆధార్ కార్డులు లేని కారణంగా ఇప్పటి వరకూ ఎవరికీ ప్రభుత్వ పథకాలు అందక పోవడం అన్నది జరగలేదని, ఆధార్ కార్డు లేని వారికి ఇతర ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయని అన్నారు.

గోవా మైనింగ్ లీజులు రద్దు..

న్యూఢిల్లీ: గోవాలోని 88 మైనింగ్ కంపెనీలకు చెందిన లీజులను రద్దు చేస్తూ సుప్రీం ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. 2015వ సంవత్సరంలో గోవా ప్రభుత్వం మంజూరు చేసిన లీజులను రెండవసారి పొడిగించవద్దని, వాటిని రద్దు చేసి కొత్తగా టెండర్‌లను పిలవాలని ఆదేశించింది. ఇందుకోసం కేంద్రం ప్రభుత్వం కూడా కొత్తగా పర్యావరణ అనుమతులను కూడా జారీ చేయాలని తీర్పులో పేర్కొంది. 2015లో కొన్ని కంపెనీలకు ఇనుప ఖనిజం తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసింది. అయితే చాలా కంపెనీలు శాసనాలను ఉల్లంఘించి ఖనిజ తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడుతున్నాయని గోవా ఫౌండేషన్ అనే ఎన్జీఓ సంస్థ పిటీషన్ దాఖలు చేసింది. గనుల తవ్వకాలపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో 2012లో సుప్రీంకోర్టు అప్పటి లీజులను రద్దు చేసింది. అయితే గతంలో తొలగించ బడిన కంపెనీలకు కూడా మళ్ళీ టెండర్లు కట్టబెట్టారు. దీంతో కేసును క్షుణ్ణంగా పరిశీలించిన మదన్ బి లోకూర్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం గోవాలోని అన్ని మైనింగ్ లీజులను రద్దు చేయాలంటూ సంచలన ఆదేశాలను జారీ చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న తవ్వకాలను మార్చి 15వ తేదీతో నిలిపేయాలని మైనింగ్ కంపెనీలను ఆదేశించింది.

2017లో 342 ఉగ్ర దాడులు

- జమ్మూ-కాశ్మీర్‌లో అమరులైన 80 మంది జవాన్లు
- 40 మంది సాధారణ పౌరులు మృతి
- కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ ఆహిర్

న్యూఢిల్లీ : జమ్మూ-కాశ్మీర్‌లో 2017లో 342 ఉగ్రవాద సంఘటనలు చోటు చేసుకున్నట్టు కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ ఆహిర్ రాజ్యసభలో వివరించారు. ఉగ్రవాద సంబంధ హింసాత్మక ఘటనల వివరాలను ఆయన రాజ్యసభలో వెల్లడించారు. 2016లో 322 ఘటనలు, 2015లో 208 ఘటనలు చోటు చేసుకున్నట్టు తెలిపారు. 2017లో జరిగిన దాడుల్లో 80 మంది ఆర్మీ సిబ్బంది, 40 మంది సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయినట్టు వివరించారు. జమ్మూ-కాశ్మీర్‌లో ఉగ్రవాద చర్యలు నియంత్రించడానికి వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. 2017లో 213 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టగా, 2016లో 150మంది, 2015లో 108 మందిగా నమోదయ్యారు. 2017లో సాధారణ పౌరుల మృతుల సంఖ్య ఎక్కువగా ఉంది. 2017లో 80 మంది ఆర్మీ సిబ్బంది అమరులుకాగా, 2016లో 82 మంది, 2015లో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా 2017లో సాధారణ పౌరులు 40 మంది మృతి చెందగా, 2016లో 15, 2015లో 17గా నమోదైందని వివరించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ నరేష్ అగర్వాల్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ సమాధానం ఇచ్చారు. 2017లో రాళ్లు రువ్వే ఘటనలు 1,261 చోటు చేసుకున్నాయి. 2016 నుండి ఈ తరహా దాడులు పెరిగాయి. హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన బుర్హాన్ వాణిని చంపిన తరువాత దాడుల సంఖ్య 2016లో 2,808 రాళ్లు రువ్వే ఘటనలు చోటు చేసుకున్నట్టు వివరించారు. 2015లో వీటి సంఖ్య 730గా నమోదైంది.



మాల్దీవులకు భారత్ సైన్యం!

- చైనా మాటలు లెక్కచేయని ఇండియా
- ఇస్లాం బలోపేతం చేసే దిశగా యెమీన్ అడుగులు

న్యూఢిల్లీ : మాల్దీవుల్లో నెలకొన్న రాజకీయ సంక్షోభానికి తెర దించేందుకు భారత్ అటువైపుగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తున్నది. భారత్ తన బలగాలను మాల్దీవులకు పంపేందుకు సిద్ధం అవుతున్నట్టు సమాచారం. ప్రస్తుత మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యెమీన్‌కు భారత్ వెన్నుదన్నుగా నిలుస్తున్నది. యెమీన్ పదవీ కాలం నవంబర్‌లోనే ముగిసింది. ఈ సందర్భంగా కొద్ది రోజుల క్రితం త్వరలో ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్టు, ప్రజలు ఎవరికి ఓటు వేసి గెలిపిస్తారో చూడాలని విలేకరుల సమావేశంలో ప్రకటించారు. మాల్దీవుల రాజకీయ సంక్షోభంతో అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా ఎమర్జెన్సీ విధించారు. 15 రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. దేశంలో పెట్టుబడులు పెట్టాలని చైనాతో పాటు సౌదీ అరేబీయా దేశాలను మాల్దీవులు అధ్యక్షుడు యెమీన్ కోరుతున్నారు. మాల్దీవుల సంక్షోభంలో జోక్యం చేసుకోవద్దని, మిలటరీని పంపించొద్దని భారత్‌కు చైనా సూచించింది. ఇలా చేయడంతో అక్కడి రాజకీయ సంక్షోభం ముదురుతుందే తప్ప పరిష్కారం కాదని చైనా సూచించింది. సుప్రీం కోర్టు జడ్జీలతో పాటు మాజీ అధ్యక్షుడిని జైల్లో వేసి అరాచకంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడు యోమీన్‌ను చెక్ పెట్టడానికి మీ ఆర్మీని పంపడంటూ దేశ ప్రతిపక్షనేత మహ్మద్ నషీద్ కోరిన విషయం తెలిసిందే. చైనా ఇచ్చిన సూచన నేపథ్యంలో భారత్ వెనక్కి తగ్గే పరిస్థితిలో లేదని, మాల్దీవులకు సైన్యాన్ని పంపే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.



ప్రధాని భార్యకు తప్పిన ముప్పు



రాజస్థాన్ : ప్రధాని నరేంద్ర మోడీ భార్య జశోదాబెన్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. బుధవారం కోటా -చిత్తోర్ ఘర్ రహదారిపై ఆమె ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు లారీని ఢీకొట్టింది. ఆ సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. ఈ ఘటనలో ఆమెకు గాయాలయ్యాయి. కారు పూర్తిగా ధ్వంసమైంది. జశోదాబెన్‌కు ఆరోగ్యంగా బాగానే ఉందని, తలకు గాయాలయ్యాయని, భయపడాల్సిన అవసరం లేదని ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం చిత్తోర్‌ఘర్‌కు అందించినట్టు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ సురేష్ ఖాటిక్ తెలిపారు. ఈ ఘటన చిత్తోర్‌ఘర్ నుండి 55 కి.మీ దూరంలో చోటు చేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న వారందరూ జశోదాబెన్‌కు బంధువులే. ఈ ఘటనలో ఆమెకు బంధువు బసంత్ భాయ్ అక్కడే మృతి చెందాడు. విమల్ మోడీ, గన్‌మెన్‌తో పాటు ఐదేళ్ల చిన్నారి కూడా ఆమె వెంట కారులో ఉన్నారు. 45 ఏళ్ల గన్‌మెన్ యతేంద్రతో పాటు విమల మోడీని చికిత్స నిమిత్తం ఉదయ్‌పూర్‌లోని ఆస్పత్రికి తరలించారు. జశోదాబెన్ స్కూల్ టీచర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఈ ఘటన విషయమై కాంగ్రెస్ నాయకుడు అశోక్ గెహ్లాట్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యశోదా బెన్ కుటుంబసభ్యులతో కలిసి కోటాలోని జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొని కారులో రాజస్థాన్ నుండి గుజరాత్ వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

హామీలొద్దు...నిధులివ్వండి

- కేంద్రాన్ని నిలదీసిన తెలుగుదేశం పార్టీ
- ఏపీకిచ్చిన నిధుల కంటే బాహుబలి కలెక్షన్లే ఎక్కువ
- ఘాటైన వ్యాఖ్యలతో చెలరేగిన ఎంపీ గల్లా జయదేవ్
- వరుసగా 3వ రోజు ఆందోళనలతో అట్టుడికిన లోక్‌సభ
- ప్రధాని ప్రసంగం తర్వాత కూడా మెత్తబడని మిత్రపక్షం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిపిన బడ్జెట్ కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసిన తెలుగుదేశం ఎంపీలు, వరుసగా మూడో రోజు పార్లమెంటును ఆందోళనలతో అట్టుడికించారు. ప్రభుత్వంపై ముప్పేట దాడితో ఉక్కిరిబిక్కిరి చేశారు. ముఖ్యంగా లోక్‌సభలో గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ప్రసంగంలో ప్రతిపక్ష నేతలు సైతం ఉపయోగించని ఘాటైన పదజాలాన్ని ప్రయోగించారు. నాలుగేళ్లుగా దేశాన్ని పరిపాలిస్తున్న మోడీ సర్కారు తీరును ఉతికి ఆరేశారు.

సుజనా నివాసంలో వ్యూహరచన

బుధవారంఉదయం 9 గంటల సమయంలో తెలుగు దేశం పార్లమెంటరీ పార్టీ నేత, కేంద్ర మంత్రి వై.ఎస్. చౌదరి (సుజనా) నివాసంలో ఎంపీలంతా సమావేశమయ్యారు. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఎంపీలకు దిశానిర్దేశం చేశారు.

సీఎం ఆదేశాల మేరకు ఆందోళన కొనసాగించాలని నిర్ణయించుకున్న తెలుగుదేశం ఎంపీలు, నేరుగా పార్లమెంటులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని.. తమ పార్టీ రంగైన పసుపు రంగు ప్లకార్డులు చేతబట్టారు. గాంధీ విగ్రహం వద్ద నినాదాలతో హోరెత్తించారు. సభ ప్రారంభమయ్యే సమయానికి లోపలికి వెళ్లిన ఎంపీలు, లోక్‌సభలో ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ పోడియంకు ఇరువైపులా నిలబడి నినాదాలు కొనసాగించారు. ప్రశ్నోత్తరాల సమయం నుంచి మొదలుపెట్టి, ప్రధాని ప్రసంగం ప్రారంభించేవరకు నిరసన కొనసాగించారు. సభలోని మిగతా సభ్యులకు అర్థమయ్యేలా ఎంపీ రామ్మోహన్ నాయుడు హిందీలో నినాదాలు చేయగా, మిగతా సభ్యులు వంతపాడారు. ''రైల్వే జోన్ క్యా హువా'' (రైల్వే జోన్ ఏమైంది?) వంటి నినాదాలతో సభ్యుల ప్రసంగాల్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

అమలు కాని 19 హామీలు

- ప్రత్యేక హోదా
- రిసోర్స్ గ్యాప్ (రెవెన్యూ లోటు)
- పోలవరం ప్రాజెక్ట్
- రైల్వే జోన్
- రాజధాని (అమరావతి) నిర్మాణానికి ఆర్థిక సహాయం
- గ్రీన్ ఫీల్డ్ క్రూడ్ రిఫైనరీ ఏర్పాటు
- పెట్రో కెమికల్ కాంప్లెక్స్
- జాతీయ విద్యా, పరిశోధనా సంస్థల ఏర్పాటు
- దుగరాజపట్నం పోర్ట్ నిర్మాణం
- అసెంబ్లీ సీట్ల పెంపు
- పన్ను రాయితీలు
- కడపలో స్టీల్ ప్లాంట్
- విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్
- విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్
- అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్ కనెక్టివిటీ
- వెనుకబడ్డ జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి
- విద్యుత్ పంపిణీ కంపెనీల బకాయిల చెల్లింపులు
- షెడ్యూల్ 9 మరియు షెడ్యూల్ 10 సంస్థల ఏర్పాటు
- గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు

ఈ అంశాలన్నీ తాము కొత్తగా కోరుతున్నవేమీ కాదని, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోనే పొందుపరిచినవని గల్లా జయదేవ్ పేర్కొన్నారు.

మోడీ ప్రసంగ సమయంలో వెనక్కి

ప్రశ్నోత్తరాల సమయం తర్వాత ప్రధాని ప్రసంగించేందుకు సిద్ధపడ్డారు. అయితే ప్రధాని ప్రసంగానికి అడ్డురావద్దని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్ తెలుగుదేశం, వైకాపా నేతలను ఉదయం నుంచి పదే పదే కోరుతూ వచ్చారు. వారి కోరికను మన్నించారో లేక ప్రధాని ప్రసంగంలోనైనా స్పష్టత వస్తుందని భావించారో, మొత్తానికి తెలుగుదేశం ఎంపీలు ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగం ప్రారంభించే సమయానికి తమ తమ సీట్లలోకి వెళ్లి కూర్చున్నారు.

ప్రధాని ప్రసంగంపై పెదవి విరుపు

లోక్‌సభలో సుదీర్ఘంగా సాగిన ప్రధాని మోడీ ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ విభజన నాటి పరిస్థితుల గురించి ప్రస్తావించడం మినహాయిస్తే, కేంద్రం రాష్ట్రానికి ఏం చేస్తుందన్న విషయం లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడంపై తెలుగుదేశం ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన కేవలం భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు మినహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏం చేస్తామన్నది చెప్పలేదని పెదవి విరిచారు. ప్రధాని ప్రసంగంలోనూ విస్పష్టమైన హామీ రాకపోవడంతో భోజన విరామం తర్వాత మధ్యాహ్నం గం. 3కు సభ మళ్లీ మొదలవగానే ఆందోళన పునః ప్రారంభించారు.

బడ్జెట్‌పై చర్చలో జయదేవ్ వీరంగం

సాయంత్రం బడ్జెట్‌పై చర్చ మొదలయ్యాక, తెలుగుదేశం పార్టీ తరపున ఎంపీ గల్లా జయదేవ్ మాట్లాడే అవకాశం అందిపుచ్చుకున్నారు. పరిమిత సమయంలోనే తాను చెప్పదలుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పేశారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిపిన కేటాయింపులను, జరిగిన అన్యాయాన్ని ఉదాహరణలతో సహా ఎండగట్టారు.

తెదేపా నిరసన ఓ నాటకం



తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండి డ్రామాలు చేస్తోందని, హామీల అమలుపై కేంద్రంపై ఒత్తిడి చేయడం లేదని వైకాపా ఎంపీలు విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లోపు విభజన హామీలపై కేంద్రం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ చేరుకున్న వైకాపా ఎంపీలు, ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద తెలుగుదేశం ఎంపీలకు పోటీగా ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేపట్టారు. వారితో సమానంగా నినాదాలు చేశారు. సభ మొదలయ్యాక లోక్‌సభలో స్పీకర్ పోడియం ఎదురుగా వెల్‌లో నిలబడి తెలుగుదేశం ఎంపీలతో పాటుగా నినాదాలు చేశారు. అంతకంటే ముందు ఉదయం గం. 9.30 ని. సమయంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ వైకాపా ఎంపీలు వైవీసుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డి, వరప్రసాద్, అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి సమావేశమయ్యారు. విభజన చట్టంలోని హామీలతో పాటు ప్రత్యేక హోదాను అమలు చేయాలని కోరుతూ ఒక విజ్ఞాపనా పత్రాన్ని ఆయనకు అందజేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చేసిన ప్రకటనలో కొత్తేమీ లేదని ఆయనకు చెప్పారు. అనంతరం ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తెలుగుదేశం ఎంపీలు తమ ఆందోళన మంగళవారం విరమించుకున్నారని, తాము మాత్రం కొనసాగించామని చెప్పారు.

కతియార్.. నోరు జారొద్దు: ఓవైసీ

న్యూఢిల్లీ: భారతదేశంలోని ముస్లింలు అందరూ పాకిస్థాన్‌కి గానీ, బంగ్లాదేశ్‌కు గానీ వెళ్లిపోవాలంటూ బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వినయ్ కతియార్ చేసిన వ్యాఖ్యల పట్ల ఏఐఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మండి పడ్డారు. వినయ్ కతియార్ చేసిన వ్యాఖ్యలు అసంబద్ధమైనవిగా కొట్టిపారేశారు. ఈ దేశంలోని ముస్లింలను ఎవరైనా పాకిస్థానీ అని సంబోధిస్తే మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధించేలా నూతన చట్టాలను తీసుకు రావాలని అన్నారు. దేశ విభజన సందర్భంగా మహ్మద్ ఆలీ జిన్నాను విభేదిస్తూ భారత్‌ను తమ మాతృదేశంగా ఎంచుకున్న ముస్లింలను ఇది తీవ్రంగా అవమానించడమే అని అన్నారు. ఇవి మత విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలుగా భావించాలని అన్నారు. మెజార్టీ ప్రాతిపదికన దేశాన్ని విడగొట్టి పాకిస్థాన్‌ను ఏర్పాటు చేసినా ఇంకా వారు ఈ దేశంలో ఎందుకు ఉండాలి అంటూ వినయ్ కతియార్ బుధవారం ఉదయం వ్యాఖ్యానించారు. ఈ వాఖ్యలు పెద్ద దుమారాన్ని రేపాయి. మొన్న రిపబ్లిక్ డే రోజున కాశ్మీర్‌లోని కసగంజ్‌లో ఓ వ్యక్తి హత్య సందర్భంగా ఆయన వారు మన కార్యకర్తను చంపివేశారు. కఠిన చర్యలు తీసుకోవాలి అన్నారు. అంతకు ముందు కూడా తాజ్‌మహల్ ఓ దేవాలయ స్థలంలో ఏర్పాటు చేసినందున దానికి 'తేజో మందిర్' అని పేరు మార్చాలంటూ కొత్త వివాదానికి తెరతీశారాయన.

క్రీడాప్రభ

మిథాలి సేన విజయం



• 178 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఓటమి
• సిరీస్ 2-0తో భారత్ కైవసం



కింబర్లీ: స్థానిక ఓవల్ మైదానంలో భారత్, దక్షిణాఫ్రికా మహిళా క్రికెట్ జట్ల మధ్య రెండో వన్డే మ్యాచ్‌లో భారత్ 178 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 303 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో సఫారీ మహిళా జట్టు 30.5 ఓవర్లలో 124 పరుగులకే కుప్ప కూలింది. ఐసీసీ మహిళా ఛాంపియన్ షిప్‌లో భాగంగా ఈ సిరీస్ జరుగుతోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంకో మ్యాచ్ మిగిలి ఉండగానే భారత్ 2-0 ఆధిక్యంతో సిరీస్‌ను గెలుచుకుంది. భారత ఇన్నింగ్స్‌లో ఎస్ మంధాన మరోసారి మెరిసింది. అద్భుతమైన ఆటతో 135 పరుగులు చేసి భారత భారీ స్కోరుకు పునాది వేసింది. హర్మీన్ దర్ కౌర్, వి కృష్ణమూర్తి కూడా అర్ధ శతకాలు చేశారు. ఉదయం టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు కెప్టెన్ వ్యాన్ నెయికెర్క్ బౌలింగ్‌ను ఎంచుకుంది. భారత ఓపెనర్లు పీజీ రౌత్, మంధానాలు దాటిగా ఆడుతూ స్కోరును పరుగులెత్తింపజేశారు. 9.2 ఓవర్లలోనే భారత్ 50 పరుగులను చేసింది. తొలి వికెట్‌కు 60 బంతుల్లో 50 పరుగులు భాగస్వామ్యం నమోదైంది. 12.3 ఓవర్లలో రౌత్ 20 పరుగులు చేసి క్లాస్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ చెట్టికి క్యాచ్ ఇచ్చి ఔటయింది. అనం తరం బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ మిథాలీ రాజ్ 20 పరుగులకే బి ల్యూస్ బౌలింగ్‌లో ఆమెకే రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటయింది. హర్మీందర్ కౌర్ బ్యాటింగ్‌కు వచ్చి మంధానా కలిసి సఫారీల బౌలింగ్‌ను ఉతికి పారేశారు. మంధానా 116 బంతులను ఎదుర్కొని తన సెంచరీని పూర్తి చేసుకుంది. ఇందుకు ఆమె 115 నిమిషాల సమయాన్ని తీసు కుంది. భారత్ స్కోరు 40.4 ఓవర్లలో 200 మార్కును చేరింది. ఇన్నింగ్స్ 43.2 ఓవర్లో మూడవ వికెట్‌గా మంధాన 135 పరుగులకు వెనుదిరిగింది. ఎన్టోజాకె బౌలింగ్‌లో వికెట్ కీపర్ చెట్టికి క్యాచ్ ఇచ్చి ఔటయింది. బ్యాటింగ్‌కు వచ్చిన వి కృష్ణ మూర్తి, కౌర్‌లు కలిసి భారత్ నిర్ణీత 50 ఓవర్లు పూర్తయ్యే సరికి మరో వికెట్ నష్టపోకుండా 302 స్కోరును సాధించింది. అనంత రం బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్లు లీ, వాల్వార్ట్ జంట బ్యాటింగ్‌ను దాటిగా ప్రారంభించింది. సఫారీల తొలివికెట్ ఐదో ఓవర్లో పడింది. గోస్వామి బౌలింగ్‌లో వాల్వార్ట్(9) వర్మకు క్యాచ్ ఇచ్చిఔటయింది. అనంతరం వచ్చిన సఫారీల బ్యాట్స్‌మన్లు ఏమాత్రం నిలదొక్కుకోలేకపోయారు. లీ ఒక పక్క దాటిగా ఆడుతూ ఉంటే మిగతా బ్యాట్స్‌మన్లు ఇటు వచ్చి అటు పోయే చందంగా మారింది. లీ 109 బంతులు ఎదుర్కొని 73 పరుగులు చేసి శర్మ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యుగా వెనుదిరిగింది. సఫారీల బ్యాట్స్‌మన్లలో లీ తర్వాత ఎం కాప్ ఒక్కతే రెండకెల స్కోరును చేసింది. మొత్తానికి దక్షిణాఫ్రికా 30.5 ఓవర్లాడి 124పరుగులకు ఆలౌటయింది. సీఎల్ ట్రెయాన్ ఒక పరుగుచేసి రనౌట్ అయింది. భారత బౌలర్లలో పూనం యాదవ్ 4 వికెట్లు తీయగా, ఆర్ఎస్ గ్వైక్వాడ్, పిబి శర్మలు చెరి 2 వికెట్లు తీశారు. గోస్వామి ఒక వికెట్‌ను పడగొట్టింది.

స్కోరు బోర్డు: భారత్: పిజి రౌత్ (సి) చెట్టి (బి)క్లాస్ 20, మిథాలీ రాజ్ (సి అండ్ బి) ల్యూస్ 20, మంధాన (సి) చెట్టి (బి) ఎన్టోజాకె 135, హెచ్. కౌర్ నాటౌట్ 55, వి. కృష్ణమూర్తి నాటౌట్51, ఎక్స్ట్రాలు:21, (మొత్తం పరుగులు 302/3, 50 ఓవర్లలో), **వికెట్ల పతనం:** 1-56, 2-107, 3-241

ద. ఆఫ్రికా బౌలింగ్: ఎ ఖాకా 8-0-63-0, ఎం కప్ 9-0-41-0, ఎం క్లాస్ 9-0-65-1, వ్యాన్ నెకెర్క్ 10-1-38-0, ఆర్ ఎన్టోజాకె 9-0-63-1, ఎస్ ల్యూస్ 5-0-31-1, **ద.ఆఫ్రికా బ్యాటింగ్:** ఎల్ లీ ఎల్బీడబ్ల్యు (బి) శర్మ 73 ఎల్ వాల్వార్ట్ (సి) వర్మ (బి) గోస్వామి 9, టి చెట్టి (సి) మేశ్రం(బి)గ్వైక్వాడ్ 9, స్టెయిన్ (సి) కృష్ణమూర్తి (బి)పూనం యాదవ్3, ల్యూస్ (సి) కృష్ణమూర్తి (బి)పూనం యాదవ్ 2, వ్యాన్ నెయ్‌కెర్క్ ఎల్బీడబ్ల్యు (బి)గ్వైక్వాడ్ 7, ట్రెయాన్ రనౌట్ (గ్వైక్వాడ్/వర్మ)1, కాప్ నాటౌట్ 17, ఖాకా (బి) శర్మ 0, క్లాస్ (బి) పూనం యాదవ్ 4, ఎన్టోజాకె పూనం యాదవ్ 0. ఎక్స్ట్రాలు2(మొత్తం:124 ఆలౌట్ 30.5 ఓవర్లు)

భారత్ బౌలింగ్: గోస్వామి 7-0-29-1, ఎస్ పాండే 4-1-23-0, ఆర్ఎస్ గ్వైక్వాడ్ 6-0-14-2, పూనం యాదవ్ 7.5-1-24-4, డీబీ శర్మ 6-1-34-2



• 124 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా పై విజయం
• సిరీస్‌లో 3-0తో ముందంజ

కోహ్లీ 160 నాటౌట్

స్పిన్‌కు సఫారీలు విలవిల!

కేప్‌టౌన్: భారత్ చారిత్రక విజయం సాధించింది. స్పిన్నర్ల మాయాజాలానికి సఫారీలు తలవంచారు. చాహల్, యాదవ్‌లు చెరి 4వికెట్లు దక్కించుకున్నారు. దక్షిణాఫ్రికా గడ్డపై ఆదేశంపై వరుసగా 3వన్డేల్లో నెగ్గింది. బుధవారం జరిగిన మూడో వన్డేలో భారత్ తొలుత బ్యాటింగ్ చేసి 303 పరుగుల లక్ష్యంను సఫారీల ముందుంచుంది. లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 40 ఓవర్లలోనే 179 పరుగులకు చేతులెత్తేసింది. దీనితో భారత్ 124 పరుగుల తేడాతో విజయం సాధించింది. దక్షిణాఫ్రికాలో ఆతిథ్య దేశంపై అత్యధిక తేడాతో భారత్ భారీ తేడాతో విజయం సాధించిన రికార్డు ఇదే. సిరీస్‌లో 3-0 ఆధిక్యం సాధించింది. అజేయ శతకంతో 160 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన కోహ్లికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తొలి ఓవర్లోనే భారత్‌కు ఎదురు దెబ్బ తగిలింది. రోహిత్ డకౌట్ అయ్యాడు. రబాడా వేసిన ఓవర్ చివరి బంతిని ఆడుతూ వికెట్ కీపర్ క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుతిరి గాడు. బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కోహ్లీ తాను ఆడిన తొలి బంతిని ఫోర్‌గా మలిచాడు. రబాడా, ఎన్గిడి బౌలింగ్‌ను ఎదుర్కొంటూ ఆరు ఓవర్లు ముగిసే సరికి భారత్ స్కోరును 28 పరుగు లకు చేర్చారు. 17వ ఓవర్లో ధావన్ తన 25వ అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. 17 ఓవర్లు ముగిసే సరికి భారత్ వికెట్ నష్టానికి 140 పరుగులు చేసింది. ఇది దక్షిణాఫ్రికాలో దక్షిణాఫ్రికాపై భారత్ రెండో వికెట్‌కు జమచేసిన అత్యధిక పరుగుల భాగస్వామ్యం ఇదే. కాగా ధాటిగా ఆడుతున్న ధావన్ 76 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద స్పి న్నర్ డుమిని బౌలింగ్‌లో మర్‌క్రమ్ కు క్యాచిచ్చి ఔటయ్యాడు. రహానే బ్యాటింగ్ వచ్చి కోహ్లీకి జత కలిశాడు. 25 ఓవర్లు ముగిసే సరికి భారత్ 150 పరుగులు చేసింది. అయితే రహానే(11) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. పెహ్లుక్ వాయో బౌలింగ్‌లో డిమినికి క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన హార్దిక్ పాండ్యా కేవలం 15 బంతులు ఎదుర్కొని 14 పరుగులు చేసి మోరిస్ బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచిచ్చి ఔటయ్యా డు. ధోని బ్యాటింగ్ వచ్చాడు. మరోపక్క కోహ్లీ వన్డేల్లో 34వ సెంచరీని చేశాడు. ఇందుకు కోహ్లీ 119 బంతులను ఎదుర్కొన్నాడు. 43వ ఓవర్లో ధోని 10 పరుగులు చేసి తాహిర్ బౌలింగ్‌లో ఎన్గిడికి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. కేదార్ జాదవ్ బ్యాటింగ్ వచ్చి 1 పరుగు చేసి పెహ్లుక్ వాయో బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్‌ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భువనేశ్వర్, కోహ్లీలు భారత్ ఇన్నింగ్స్‌ను 50 ఓవర్లలో 303 పరుగులు చేసి ముగించారు. మోరిస్ వేసిన 48 ఓవర్లో 3 బంతిని కోహ్లీ సిక్సర్‌గా మలిచే ప్రక్రియలో గాల్లోకి లేపాడు. బంతిని మిల్లర్ క్యాచ్ పట్టాడు. అయితే మిల్లర్ ఈ క్రమంలో బౌండరీ లైన్ తాడును పక్కకు జరపటంతో అంపైర్ దాన్ని సిక్సర్‌గా ప్రకటించాడు. కోహ్లీ తన ఇన్నింగ్స్‌లో రెండు సిక్సర్లు, 12 ఫోర్లు కొట్టాడు. లక్ష్య ఛేదనకు దిగిన సఫారీల జట్టు ఓపెనర్లు, మర్‌క్రమ్, హాషీం ఆమ్లా జంట రెండో ఓవర్లోనే విడిపోయింది. ఆమ్లా(1) రెండో ఓవర్ తొలి బంతికి బుమ్రాకు ఎల్బీడబ్ల్యు రూపంలో చిక్కా డు. అనంతరం డుమిని బ్యాటింగ్ వచ్చి సఫారీల బ్యా టింగ్‌ను కుదుట పర్చాడు. 16 ఓవర్ల వరకు వీరిద్దరూ ఆడుతూ స్కోరును 78 పరుగులకు చేర్చారు. 17 ఓవర్ తొలిబంతికి మర్‌క్రమ్(32) కులదీప్ యాదవ్ బౌలింగ్ లో ధోనీకి క్యాచిచ్చి ఔటయ్యాడు. అతని స్థానంలో బ్యాటిం గ్‌కు వచ్చిన క్లాసెన్ రెండు ఓవర్లు ఆడి ఆరు పరుగులు చేసి చాహల్‌కు ఎల్బీడబ్ల్యుగా చిక్కాడు. డుమిని అర్ధశతకంను పూర్తిచేసుకున్నాడు. ఇందుకు 64 బంతులను ఎదుర్కొన్నాడు. మిల్లర్ బ్యాటింగ్ వచ్చి డుమినికి జత కలిశాడు. 21 ఓవర్లు పూర్తయ్యే సరికి సఫారీల స్కోరు 91/3. భారత బౌలర్లకు పరీక్షపెడు తున్న డుమిని 22వ ఓవర్లో చాహల్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యుగా ఔటయ్యాడు. జొండో వచ్చి మిల్లర్ కలిసి స్కోరును నెమ్మదిగా ముందుకు పోనిచ్చారు. బుమ్రా బౌలింగ్‌లో మిల్లర్(3) ధోనికి క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. తాహిర్ బౌలింగ్‌ వచ్చిన మోరి స్(14) యాదవ్ ఎల్బీడబ్ల్యు గా ఔటయ్యాడు. అనంతరం పెహ్లుక్‌వాయో బ్యాటింగ్‌కు వచ్చాడు. 37వ ఓవర్లో జొండోను చాహల్ పెవిలియన్‌కు పంపించేశాడు. 17 పరుగులుచేసి మనీష్‌పాండేకు (సబ్‌స్టిట్యూట్) క్యాచ్ఇచ్చి ఔటయ్యాడు. రబాడా బ్యాటింగ్ వచ్చాడు. జొండో 38వ ఓవర్లో పెహ్లుక్‌వాయో(3) యాదవ్ బౌలింగ్ లో కోహ్లీకి క్యాచిచ్చి వెనుదిరిగాడు. తాహిర్‌ను చాహల్ బౌల్ చేయగా, ఎన్గిడి వికెట్‌ను కులదీప్ యాదవ్ చేజిక్కించుకున్నాడు. మొత్తానికి సఫారీల ఇన్నింగ్స్ 40 ఓవర్లలో 179 పరుగులకు ముగిసింది.

భారత్ బ్యాటింగ్: రోహిత్ (సి)క్లాసెన్ (బి) రబాడా0, ధావన్ రనౌట్ (సి)మర్‌క్రం (బి)డుమిని76, కోహ్లీ (కెప్టెన్)160 నాటౌట్,రహానే (సి)పెహ్లుక్‌వాయో (బి) డుమిని 11, పాండ్యా (సి) క్లాసెన్(బి) మోరిస్ 14, ధోనీ(సి) ఎన్గిడి (బి) తాహిర్10,జాదవ్ (సి) క్లాసెన్ (బి)పెహ్లుక్‌వాయో 1, భువనేశ్వర్ నాటౌట్ 16 ఎక్స్ట్రాలు 15, (మొత్తం 50 ఓవర్లలో 303), **వికెట్ల పతనం:** 0-1,140-2,160-3,188-4, 228-5,236-6, **బౌలింగ్:** రబాడా 10-1-54-1,ఎన్గిడి 6-0-47-0,మోరిస్ 9-0-45-1, పెహ్లుక్‌వాయో 6-0-42-1,ఇమ్రాన్ తాహిర్ 9-0-52-1,జెపి డుమిని 10-0-62-2, **దక్షిణాఫ్రికా బ్యాటింగ్:** అమ్లా ఎల్బీడబ్ల్యు (బి)బుమ్రా 1, ,ఏడెన్ మర్‌క్రం (సి) ధోనీ (బి)యాదవ్32, జెపి డుమిని ఎల్బీడబ్ల్యు (బి)చాహల్ 6, క్లాసెల్ ఎల్బీడబ్ల్యు (బి)చాహల్ 6, మిల్లర్(సి) ధోని (బి)బుమ్రా 25, జోండో (సి)పాండే (బి) చాహల్ 17, క్రిస్ మోరిస్ ఎల్బీడబ్ల్యు (బి)యాదవ్ 14, ఆండిలె పెహ్లుక్‌వాయో (సి) కోహ్లీ (బి) యాదవ్ 3, రబాడా నానౌట్ 12, తాహిర్ (సి) కోహ్లీ (బి) చాహల్ 8, ఎన్గిడి ఎల్బీడబ్ల్యు (బి) యాదవ్ 6 **ఎక్స్ట్రాలు:** 4,(మొత్తం 40 ఓవర్లలో 179 ఆలౌట్), **వికెట్ల పతనం:**1-1, 79-2,88-3,95-4,129-5,150-6,150-7,158-8,167-9,179-10, **బౌలింగ్:** భువనేశ్వర్ 7-0-41-0, బుమ్రా 7-0-32-2, పాండ్యా 8-0-35-0, చాహల్ 9-0-46-4, కులదీప్ యాదవ్, 9-1-23-4.

భారత్ ఫుట్‌బాల్ కోచ్ గడువు పెంపునకు ఓకే

• ఏఐఎఫ్ఎఫ్ టెక్నికల్ కమిటీ తీర్మానం



న్యూఢిల్లీ: భారత పుట్‌బాల్ కోచ్ స్టీఫెన్ కాన్‌స్టెంటైన్‌తో ఏఐఎఫ్ఎఫ్ ఒప్పందాన్ని పొడిగించేందుకు ఆలిండియా పుట్‌బాల్ ఫెడరేషన్ అంగీకరించింది. బుధవారం ముంబైలో మాజీ పుట్‌బాల్ ఆటగాడు శ్యాంథాపా ఆధ్వర్యంలోని ఏఐఎఫ్ఎఫ్ సాంకేతిక కమిటీ ఏకగ్రీవంగా స్టీఫెన్ గడువు పొడిగింపును అంగీకరిస్తూ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని ఏఐఎఫ్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదిస్తే ఒప్పందం పొడిగింపు అమల్లోకి వస్తుంది. భారత జట్టు ఇటీవల ఆడిన 13 మ్యాచుల్లో 11 మ్యాచుల్లో విజయం సాధించగా, 2 మ్యాచ్‌లను డ్రా చేసుకుంది. అంతేకాక, భారత జట్టు తన ర్యాంకింగ్‌ను 1996తో పోలిస్తే 2017 జూలైనాటికి అత్యుత్తమ ర్యాంకింగ్ 96ను సాధించింది. ఇటీవల భారత్‌లో పుట్‌బాల్ క్రీడకు పెరుగుతున్న ఆదరణ, భారత్‌లో పుట్ బాల్ జట్టు సాధిస్తున్న విజయాలు తమను ఆకట్టుకున్నాయని ఏఐఎఫ్ఎఫ్ సాంకేతిక కమిటీ సభ్యులు వాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తాను ఎఎఫ్ సి ఆసియన్ కప్-2019 వరకు తన ఒప్పందాన్ని పొడిగించుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. ఈ నేపథ్యంలో 55ఏళ్ల కాన్‌స్టాంటైన్‌ను వదులు కోవడానికి ఏఐఎఫ్ఎఫ్ సిద్ధంగా లేదు. 'ఫెడరేషన్ సభ్యులు కాన్‌స్టాంటైన్‌ను వదులుకోవడానికి సిద్ధంగాలేరు ఎందుకంటే ఆయన ఆధ్వర్యంలో భారత జట్టు ఏఎఫ్‌సి ఆసియన్ కప్-2019కి అర్హత సాధించింది. అంతేకాక, ఆసియన్ దేశాల్లో నిలకడగా రాణిస్తూ టాప్ 15 దేశాల్లో భారత్ నిలిచింది' అని ఏఐఎఫ్ఎఫ్ సాంకేతిక బోర్డు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

• భారత్ మాల్దీవులపై గెలుపు

అలోర్ సెటార్: ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో పురుషుల విభాగంలో కిదాంబి శ్రీకాంత్(ప్రపంచ ర్యాంక్5) నేతృత్వంలోని జట్టు మాల్దీవుల జట్టును 5-0 తేడాతో ఓడించింది. సింగిల్స్‌లో కిదాంబి హుస్సేన్ జాయన్‌పై 21-5, 21-6 తేడాతో విజయం సాధించగా, మరో సింగిల్స్‌లో సాయి ప్రణీత్, మాల్దీవులకు చెందిన అహ్మద్ నిబాల్‌పై 21-0 21-4 తేడాతో విజయం సాధించాడు. సమీర్ వర్మ తన ప్రత్యర్థి మహ్మద్ అర్సాలాన్‌పై 21-5, 21-1తేడాతో గెలిచాడు. డబుల్స్‌లో సాత్వాకాసాయిరాజ్ రింకిరెడ్డి, చిరాగ్ షెట్టి జోడీ షహీద్ హుసేన్ జాయాన్, షహీం హసన్ అఫ్‌షీంపై 21-8, 21-8 తేడాతో గెలిచారు. అర్జున్ ఎంఆర్ శ్లోక్ రామచంద్రన్ జంట మహ్మద్ మహ్మద్ అర్సాలాని, అహ్మద్ నిబాల్‌లపై 21-2,21-5 తేడాతో విజయం సాధించారు. తర్వాత రౌండ్లో భాగంగా నేడు భారత ఆటగాళ్ల జట్టు ఇండోనేషియాను ఢీ కొంటుంది. కాగా మహిళల జట్టు జపాన్‌తో తలపడనుంది.

రగ్బీ నేషనల్ టోర్నీ షురూ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారత పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 63వ రగ్బీ నేషనల్ చాంపియన్‌షిప్-2018 టోర్నమెంట్ బుధవా రంనాడిక్కడ ప్రారంభమైంది. ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తు న్న రగ్బీ టోర్నమెంట్‌ను తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడా కారులను పరిచయం చేసుకున్నారు. మూడు రోజుల పాటు పోటీలు జరుగనున్నాయి. ఈ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు 14 రాష్ట్రాల నుంచి అండర్-17, అండర్-19 వయస్సు గ్రూపులకు చెందిన సుమారు 600 బాలబాలికలు క్రీడాకారులు పాల్గొంటు న్నారు. ఈ సందర్భంగా శాట్స్ చైర్మన్ మాట్లాడుతూ, యూరప్, అమెరికా దేశాలలో రగ్బీ క్రీడ ఏవిధంగా అయితే అభివృద్ధి చెందిందో తెలంగాణలో కూడా రగ్బీ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎస్‌జీఎఫ్ఐ ద్వారా ఈ క్రీడా పట్ల ఎక్కువ శ్రద్ధ వహించి, ఈ క్రీడను తెలంగాణలోని అన్ని గ్రామీణ పాటశాలలో కూడా ఆడించాలని శాట్స్ చైర్మన్ కోరారు. రగ్బీ అసోసియేషన్‌కు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని శాట్స్ చైర్మన్ హామీనిచ్చారు. ఆసియా రగ్బీ ఛాంపియన్‌షిప్ తెలంగాణలో నిర్వహించ డానికి శాట్స్ నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వెంకటేశ్వర్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా డీఈఓ కే. సత్యనారాయణ రెడ్డి, తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కే. రాంరెడ్డి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి యస్.ఆర్. ప్రేమ్‌రాజ్, తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు డా. యస్. సోమేశ్వర్ రావు, రగ్బీ నేషనల్ ఛాంపియన్‌షిప్ నిర్వహణ కార్యదర్శి పి.సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ కప్‌లో భారత జంట ఓటమి

• 2-1 తేడాతో చైనా గెలుపు • అంకిత గెలిచినా ఓటమి తప్పలేదు



న్యూఢిల్లీ: ఫెడరేషన్ కప్ టెన్నిస్ టోర్నీలో భాగంగా బుధవారం రెండో రోజు జరిగిన పోటీల్లో భారత జట్టుకు చెందిన అంకితా రైనా సింగిల్స్‌లో గెలిచినప్పటికి టీం విజయం సాధించలేకపోయింది. ఆసియా/ఓసియనా గ్రూప్-1 మ్యాచుల్లో భాగంగా ఆరెకె ఖన్నా స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అంకితా(253ర్యాంక్) చైనాకు చెందిన 120 ర్యాంకర్ లిన్ జుపై 6-3, 6-2 తేడాతో గెలుపొందింది. మరో సింగిల్స్‌లో కర్మన్ కౌర్ థాండి తన తొలి మ్యాచ్‌ను యఫాన్ వాంగ్‌కు(125 ర్యాంకు) కోల్పోయింది. థాండి 2-6, 2-6 తేడాతో ఓడిపోయింది. అనంతరం అంకితా, ప్రథానా థాంబేర్‌తో కలిసి డబుల్స్ మ్యాచ్‌లో చైనా జోడీ వాంగ్, జావొగ్జువాన్ యాంగ్(ర్యాంకు31)తో తలపడి 2-6, 6-7(1)తేడాతో ఓటమిని పొందింది. భారత జంట ఆటలో చురుకుదనంను ప్రదర్శించక పోవడం, వారిద్దరి మధ్య పరస్పర అవగాహన కూడా లోపించ డంతో ఓట మిని చవిచూ డాల్సి వచ్చిందని విశ్లేషకులు అంటున్నారు. దీనితో భారత్ 1-2 తేడాతో చైనాకు మ్యాచ్‌ను కోల్పోవలసి వచ్చింది. నేడు కజికిస్తాన్ జట్టుతో ఆడనుంది. ఇందులో గెలిస్తేనే ప్లే ఆఫ్ దశకు భారత్ చేరుకుంటుంది.

అంధుల క్రికెట్ ఆసోసియేషన్‌ను గుర్తించండి

• బీసీసీఐకి టెండూల్కర్ లేఖ



న్యూఢిల్లీ: భారత అంధుల క్రికెట్ అసోసియేషన్ కు(సీఏబీఐ) గుర్తింపు ఇవ్వాలని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ బీసీసీఐను కోరాడు. ఈ మేరకు టెండూల్కర్ బుధవారం బీసీసీఐకి కమిటీ ఆఫ్ అడ్మినేస్ట్రేషన్(సీవోఏ) ఛైర్మన్ వినోద్‌రాయ్‌కు లేఖను రాస్తూ.. అంధుల క్రికెట్ అసోసియేషన్‌కు గుర్తింపునిచ్చి అంధ క్రికెటర్లకు బోర్డు తరపున పింఛన్ సౌకర్యంను కల్పించాలని విజ్ఞప్తి చేశాడు. అంధుల క్రికెట్ జట్టు 2018లో ప్రపంచకప్ ఫైనల్లో పాకిస్తాన్‌పై గెలిచిందని వారి ప్రతిభను కూడా గుర్తించాలని టెండూల్కర్ లేఖలో కోరారు. 'అంధుల ప్రపంచ కప్‌లో వరుసగా భారత్ నాలుగుసార్లు కప్‌ను గెలిచింది. అంధుల క్రికెట్ అసోసియేషన్‌ను బీసీసీఐ గుర్తించేవిధంగా తగిన చర్యలు చేపట్టాలని' మీకు నేను విన్నపం చేస్తున్నాను అని టెండూల్కర్ లేఖలో పేర్కొన్నాడు. అంధుల క్రికెట్ క్రీడాకారుల ఆటను టెండూల్కర్ ప్రశంసించాడు. వారి పోరాట పటిమ గొప్పదని వారిని ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంధుల క్రికెట్ జట్టు అనేక అవాంతరాలను అధిగమించి ఒకే లక్ష్యంతో దేశానికి పేరు తెచ్చింది. వీరి విజయం మానవ మేదస్సు అనంత శక్తిని చాటుతుంది. మునపటిలాగే వీరికి మద్దతు ఈ సారీకూడా బీసీసీఐ ఇస్తుందని అనుకుంటున్నానని టెండూల్కర్ తన లేఖలో తెలిపారు. ఎంతో కాలంగా అంధుల క్రికెట్ అసోసియేషన్ గుర్తింపు ఇవ్వాలన్న వాదన వస్తోంది. బీసీసీఐ ఈ దిశగా సకారాత్మకంగా నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నానన్నారు. కాగా గతంలో వినోద్ రాయ్ ప్రపంచకప్ విజేతలుగా నిలిచిన జట్టులోని క్రీడాకారులకు వారి సామర్థ్యాలను గుర్తిస్తూ బీసీసీఐ తగిన పారితోషకంను ఇస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. సీఏబీఐకు బీసీసీఐ గుర్తింపు క్రీడా ప్రపంచంలో సంచలనంగా ఉంటుందన్నారు. ఈ గుర్తింపుతో మిగతా వికలాంగ క్రీడాకారుల్లో ఉత్సాహం వస్తుందన్నారు.

'బేబీ లీగ్' అమలులో ఈశాన్య రాష్ట్రాలు బెస్ట్

•ఐదేళ్ల నుంచే ఫుట్‌బాల్‌పై అవగాహన తేవాలి
•ఏఐఎఫ్ఎఫ్ ప్లేయర్ డెవలప్‌మెంట్ విభాగంహెడ్ రిచర్డ్‌హుడ్



న్యూఢిల్లీ: దేశంలో పుట్‌బాల్ క్రీడకు ప్రాచుర్యం తేవాలంటే అట్టడుగు స్థాయి నుంచి సంస్కరణలు తీసుకురా వాలని ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఏఐఎఫ్ఎఫ్) ప్లేయర్ డెవలప్ మెంట్ విభాగం హెడ్ రిచర్డ్‌హుడ్ అన్నారు. అట్టడుగు స్థాయిలో పుట్ బాల్ క్రీడను ప్రోత్సహిస్తూ ఆటలో నాణ్యతను పెంచుతూ మరోపక్క యువ తలో ఈ క్రీడపట్ల మక్కువను పెంచి ఆటగాళ్ల సంఖ్యను పెంచుకోవచ్చని రిచర్డ్ పేర్కొన్నారు. ఇందుకు నేషనల్ ఫెడరేషన్‌తో కలిసి రాష్ట్రాలు, పుట్‌బాల్ అసోసియేషన్లు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. బుధవారం రిచర్డ్ మీడియాతో ముచ్చటిస్తూ ఐదేళ్ల వయస్సునుంచే పిల్లలు పుట్‌బాల్ ఆడేలా ప్రోత్సాహానిచ్చేందుకు ఏఐఎఫ్ఎఫ్ గతేడాది ఈ లక్ష్య సాధనకోసం బేబీ లీగ్‌ను ప్రారంభించిందన్నారు. వారిలో ఆటను ఎలా ఆడాలో తెలుపుతూ వారిలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే ఈ లీగ్ లక్ష్యమని ఆయన చెప్పారు. 'మా ప్రదర్శనలతో అపూర్వమైన విజయాలను సాధించాము. భారత్‌లో పుట్ బాల్ క్రీడకు ప్రాధాన్యం రావాలంటే అట్టడుగు స్థాయినుంచేమార్పు తేవాల్సి ఉంటుంది' అని రిచర్డ్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారత్ గతంలో సాధించిన విజయాలు యువతలో ఆసక్తిని కలిగించాయి. ఇవే లీగ్‌ను ముందుకు తీసుకుపోవడానికి క్రీడలో స్థిరమైన అభివృద్ధికి దోహదపడుతాయని పేర్కొన్నారు. బేబీ లీగ్ కార్యక్రమంతో దేశంలో కిందిస్థాయి నుంచి పుట్‌బాల్ క్రీడ అభివృద్ధిలో రాష్ట్రాల అసోసియేషన్‌లు కీలక పాత్ర వహిస్తాయన్నారు. ఇప్పటికే పలు ఆసోసియేషన్‌లు ఈ వ్యవస్థను ఏర్పాటుచేసుకున్నాయని రిచర్డ్ తెలిపారు. మహారాష్ట్ర(డబ్ల్యుఎఫ్ఏ) ముంబై (ఎండీఎఫ్ఏ)లతో తాము 'ప్లేయర్ డెవలప్‌మెంట్' ఒప్పందాన్ని గతేడాది ఆగస్టులో కుదుర్చుకున్నామన్నారు. అప్పటినుంచి తాము డబ్ల్యుఎఫ్ఏ-ముంబైసిటీ ఎఫ్‌సి అనుబంధ సంస్థలతో కలిసి బలీయమైన లీగ్ వ్యవస్థను ప్రారంభించామన్నారు. ఇవి పాఠశాల స్థాయినుంచే పుట్‌బాల్ క్రీడ పట్ల అవగాహన పెంపొందిస్తుందని తెలిపారు. భారత్‌లో పుట్‌బాల్ క్రీడకు హాట్‌స్పాట్‌గా ఈశాన్య రాష్ట్రాలను చెపుతారని ఆయన అన్నారు. వారి సంస్కృతిలో క్రీడలు ఒక భాగమయ్యాయని అన్నారు. మేఘాలయ గత జూలైలో తమ ఒప్పందం కుదుర్చుకొందని, బేబీలీగ్ ప్రతిపాదనపట్ల ఆ రాష్ట్రం ఉత్సుకత తోఉందన్నారు. షిల్లాంగ్ కేంద్రంగా పొరుగు జిల్లాల్లో ఈ క్రీడను అభివృద్ధి చేయనుంద న్నారు. మిజోరం జనవరిలో ఒప్పందాన్ని క ుదుర్చుకుందన్నారు. బేబీ లీగ్‌ను అమలు చేస్తున్న రాష్ట్రా ల్లో తాము అమోఘమైన ఫ లితాలను చూశామన్నారు. మేము అద్భుత మైన నాయకత్వ లక్షణాలు, జట్టు సమష్టికృషిని గమనించాము. 12 నుంచి 15 ఏళ్లలో పుట్‌బాల్ క్రీడాకారులు దేశంలో వెల్లువెత్తుతారని రిచర్డ్ ఆశిస్తున్నారు.

Published & Printed by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812
RNI Regd.No.32178/1977, Printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT.